www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 7-7-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 121 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి రా.11:10 తదుపరి త్రయోదశి, నక్షత్రం: అనూరాధ రా.1:12 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: మ.12:46-1:38, మ.3:22-4:14, అమృతఘడియలు: మ.1:43-3:29, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 5:50, సూర్యాస్తమయం: 6:50 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



గిల్ సేన విజయ గర్జన

భారత్‌దే రెండో టెస్టు

కెప్టెన్‌గా గిల్‌కు తొలి గెలుపు

చెలరేగిన ఆకాశ్‌దీప్, సిరాజ్

336 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు

10



ఏఐతో నిండు 150 ఏళ్లు!

2030 కల్లా మనిషి సగటు జీవితకాలం రెట్టింపు.. శాస్త్రజ్ఞుల అంచనా

'కృత్రిమ మేధ' సాయంతో జన్యుమార్పిడి, వైద్య రంగాల్లో పరిశోధనలు వేగవంతం

శరీరం లోపలికి వెళ్లి కణాల స్థాయిలో రిపేర్ చేసే నానోబోట్లు అందుబాటులోకి

మనిషి మెదడులోని సమాచారాన్ని బ్యాకప్ తీసే సాంకేతిక పరిజ్ఞానం కూడా..

150 ఏళ్లు కాదుగానీ.. నిండు నూరేళ్లు జీవించే చాన్స్: మరికొందరు శాస్త్రజ్ఞులు

న్యూఢిల్లీ, జూలై 6: 'నిండు నూరేళ్లూ చల్లగా ఉండు' ..అని పెద్దలు దీవిస్తుంటారు! మనిషికి పూర్ణాయుర్దాయం అంటే వందేళ్లని మనందరి భావన. కానీ.. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతీయుల సగటు జీవిత కాలం కేవలం 32 సంవత్సరాలు! మెరుగైన జీవనానికి అవసరమైన సౌకర్యాలు, సరైన వైద్యసదుపాయాలు లేకపోవడం.. తరచూ ప్రబలే అంటువ్యాధులు.. ఇలా రకరకాల కారణాల వల్ల ఒక్క మనదేశంలోనే కాక ప్రపంచంలోని చాలా దేశాల్లో 70-80 ఏళ్ల క్రితం దాకా కూడా సగటు జీవితకాలం చాలా తక్కువగా ఉండేది. కానీ.. వైద్య రంగంలో విప్లవాత్మక పరిశోధనల వల్ల, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పని చేసే సరికొత్త వైద్య ఉపకరణాలు, రకరకాల వ్యాధులను అరికట్టే టీకాలు అందుబాటులోకి రావడం వల్ల.. మనలో ఆరోగ్యం పట్ల పెరిగిన స్పృహవల్ల.. సగటు జీవితకాలం గణనీయంగా పెరిగింది. 70-80 ఏళ్ల క్రితంతో పోలిస్తే శిశుమరణాల రేటు బాగా తగ్గిపోయింది. భారతీయుల సగటు జీవితకాలం ఇప్పుడు 70 ఏళ్లు కాగా.. హాంకాంగ్,



మిగతా 2వ పేజీలో...



బెంగళూరుకు హైస్పీడ్ కారిడార్

నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు నిర్మించే రహదారి బెంగళూరు వరకు కొనసాగింపు

రెండు సెక్షన్లుగా రోడ్డు నిర్మాణానికి నిర్ణయం

రెండింటి డీపీఆర్‌లకూ టెండర్లు ఖరారు

గంటకు 120 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించేలా రోడ్డు నిర్మాణం

తొలుత 6 లేన్లు.. భవిష్యత్తులో 8-12 లేన్లు!

2

డిజిటల్ హైవేలు!

జాతీయ రహదారులు ఇక స్మార్ట్‌గా.. రోడ్లపై ఏఐతో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటు

రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం

ప్రమాదాలు జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు లొకేషన్, కి.మీ. నంబర్‌తో సహా వివరాలు

వీడియోతో సహా పంపనున్న నిఘా కెమెరాలు

వెంటనే అక్కడికెళ్లి సాయం అందించనున్న సిబ్బంది

నాగపూర్-హైదరాబాద్ హైవేపై మొదలైన పనులు

తర్వాత ఖమ్మం-దేవరపల్లి, హైదరాబాద్-బెజవాడ, కర్నూల్-రాయచూర్ మార్గాల్లో అమలు

హైదరాబాద్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త చర్యలు తీసుకుంటోంది. రోడ్డుపై నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిని నియంత్రించేలా దేశంలోని పలు జాతీయ రహదారులను డిజిటల్, స్మార్ట్ హైవేలుగా మార్చాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి రోడ్డుపైనా అత్యంత అధునాతనమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. వాటిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో అనుసంధానం చేయనున్నారు. ఏఐతో అనుసంధానమైన కెమెరా వ్యవస్థను రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేస్తారు. దీంతో రోడ్డుపై వాహనం ఎలా వెళ్తోంది, ఎంత స్పీడ్‌తో వెళ్తోందనే విషయంతోపాటు సవ్య దిశలోనే వెళ్తోందా, లేదా అనేదీ తెలిసిపోతుంది. తద్వారా..

మిగతా 12వ పేజీలో...

ఫస్ట్‌గా కొట్టేయాలని!

గనుల శాఖలో సరికొత్త 'సమస్య'.. 'ఫస్ట్ కమ్ ఫస్ట్' విధానంతో ఆటలు

అస్మదీయ కాంట్రాక్టర్లతో దరఖాస్తులు అప్‌లోడ్

మరొకరు దరిదాపుల్లో ఉండకుండా 'సర్వర్ డౌన్'

48 గంటలపాటు కొనసాగిన సాంకేతిక సమస్యలు

ఇద్దరు కిందిస్థాయి అధికారుల బరితెగింపు

ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిన వైనం

చర్యలు తీసుకోవాలని సర్కారుకు ఫిర్యాదులు



'సాంకేతిక సమస్య'... తలెత్తిందా? సృష్టించారా? సమస్య వచ్చిందే అనుకుందాం... రెండురోజులపాటు పరిష్కరించలేని పరిస్థితి ఉంటుందా? వందలు, వేల కోట్ల ఆదాయం... లీజులు ఇచ్చే గనుల శాఖలో 'సర్వర్లు' అలా పడకేశాయంటే ఏమిటి అర్థం? అసలేం జరిగింది?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఫస్ట్ కమ్ ఫస్ట్'! ఇది గనుల శాఖలో అమలవుతున్న విధానం! అంటే... ఎవరు తొలుత దరఖాస్తు చేసుకుంటారో వారికే లీజు దక్కుతుందన్న మాట! ఒక వేళ... మొదటి దరఖాస్తుదారుడికి అర్హతలు లేకుంటే, తర్వాతి దరఖాస్తులను పరిశీలిస్తారు. మరి... మొదటి దరఖాస్తుతోనే ప్రక్రియ ఆగిపోతే? ఇంకెవరూ దరఖాస్తులు వేసే వీలే లేకుండా చేస్తే? మొదటి దరఖాస్తుకే టెండరు దక్కినట్లే! గనుల శాఖలో ఇప్పుడు అదే జరిగింది. దిగువస్థాయి అధికారులు కొందరు భారీ గోల్‌మాల్‌కు పాల్పడ్డారు. అస్మదీయ లీజుదారులతో ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అప్‌లోడ్ చేయించారు. ఆ తర్వాత వీరికి మరొకరు పోటీరాకుండా ఉండేందుకు... సర్వర్లు పనిచేయకుండా, దరఖాస్తు స్వీకరణ చేపట్టకుండా కుయుక్తులు పన్నారు. జూన్ 30 నుంచి ఈనెల 2వ తేదీ వరకు సర్వర్‌లు సరిగా పని చేయకుండా వ్యూహాత్మక సాంకేతిక సమస్యలను సృష్టించారు. అస్మదీయ కాంట్రాక్టర్లు, వ్యక్తులు, సంస్థల నుంచి మాత్రమే వందల ఎకరాల భూములపై లీజులు కోరుతూ దరఖాస్తులు అప్‌లోడ్ చేసి... 'ఫస్ట్'గా నిలిచారు. కొందరు అధికారులు బరితెగించి... అస్మదీయ కాంట్రాక్టర్లు, సంస్థలను గనుల శాఖ కార్యాలయానికే పిలిపించి.. అక్కడి నుంచే దరఖాస్తులను అప్‌లోడ్ చేయించినట్లు తెలిసింది.

అనుకూలంగా 'మార్చుకుని'...

జగన్ ప్రభుత్వంలో గనుల లీజులను వేలం విధానంలో ఇచ్చారు. రాజకీయంగా

మిగతా 11వ పేజీలో...



తోతాపురికి తోడ్పాటు

12

ఇతర రాష్ట్రాల కంటే ఏపీలోనే ఎక్కువ మద్దతు

రైతులు అడక్కముందే కిలోకు 4 సబ్సిడీ

ఎన్ని టన్నులకైనా రాష్ట్ర ప్రభుత్వమే సాయం

తోతాపురి సేకరణకు 130 కోట్లు ఇవ్వండి

కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ



2

'అమెరికా పార్టీ'

కొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన మస్క్

ఇప్పుడున్న పార్టీలు చెత్త నిర్ణయాలతో దేశాన్ని దివాలా తీయిస్తున్నాయి

మూడింట రెండొంతుల మంది అమెరికన్లు రాజకీయ మార్పు కోరుకుంటున్నారు

ప్రజలకు స్వేచ్ఛను తిరిగి అందిస్తా: మస్క్

అఆ..లూ రావట్లేదు

రెండో తరగతి పాఠ్యపుస్తకాలూ చదవలేరు

లెక్కలు చేయలేరు.. ఎక్కాలు అసలే రావు

3 నుంచి 8వ తరగతి వరకూ ఇదే దుస్థితి

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తీసికట్టు

ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి మరీ దారుణం

ప్రైవేటు బడుల విద్యార్థులు అంతంతమాత్రం

జాతీయ సగటుతో పోలిస్తే వెనకబడిన రాష్ట్రం

అసర్, పరఖ్ సర్వేలపై విద్యాశాఖ సమీక్ష



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఒక చెరువు పక్కన పెద్ద మర్రిచెట్టు ఉంది. ఆ చెట్టు కొమ్మ మీద ఒక కాకి గూడు కట్టుకుంది. ఆ గూట్లో కాకి తన పిల్లలతో హాయిగా కాలం గడుపుతూ ఉండేది'...

ఇలాంటి సరళమైన పదాలతో ఉన్న రెండో తరగతి స్థాయి తెలుగు పాఠాన్ని కూడా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థుల్లో 44 శాతం మంది తప్పుల్లేకుండా చదవలేకపోతున్నారు. మూడో తరగతి విద్యార్థుల్లో కేవలం 15.5 శాతం మంది, ఐదో తరగతి పిల్లలు 37.7 శాతం మంది మాత్రమే రెండో తరగతి పుస్తకాన్ని చదవగలుతున్నారు. మిగిలిన వారంతా అక్షరాలు కూడా సరిగ్గా గుర్తించలేకపోతున్నారు. యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్(అసర్)-2024 నివేదిక వెల్లడించిన వాస్తవాలివి. ఇక ఆరో తరగతి విద్యార్థుల్లో 48 శాతం మందికే భాషా సబ్జెక్టులపై అవగాహన ఉంది. గణితంపై 41శాతం

మిగతా 12వ పేజీలో...



తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్లు దాటి పరవళ్లు తొక్కుతున్న వరద జలాలు

నేడు గోదారి పరీవాహక ప్రాంతాల్లో కుంభవృష్టి

పోలవరం నుంచి 2,23,309 క్యూసెక్కుల నీరు విడుదల

శ్రీశైలానికి భారీ వరద

ఎగువ నుంచి 1,86,212 క్యూసెక్కుల రాక

879 అడుగులకు చేరిన నీటిమట్టం

గోదావరికీ వరద పోటు

ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం

రాష్ట్రంలో మాత్రం వర్షాభావమే

శ్రీశైలం క్రస్ట్ గేట్లన్నీ ఐదేళ్లకైనా మార్చాల్సిందే!

లేదంటే తుంగభద్ర పరిస్థితే: కన్నయ్యనాయుడు

10వ గేటు లీకేజీతో ప్రస్తుతానికి ముప్పులేదు

శ్రీశైలం డ్యాంను పరిశీలించిన గేట్ల నిపుణుడు

విశాఖపట్నం/పోలవరం/కర్నూలు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం డ్యాంకు వరద పోటెత్తుతోంది. ఎగువ నుంచి 1,86,212 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 879.30 అడుగుల వరకు నీరు చేరింది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలకు గాను ప్రస్తుతం 184.27 టీఎంసీల నీరు ఉంది. ఎగువన జూరాల ప్రాజెక్టు నుంచి 1,09,216 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,218 క్యూసెక్కులు శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 10వేల క్యూసెక్కులు రాయలసీమ కాలువలకు వదులుతున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా 67,740 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే తుంగభద్ర జలాశయానికి ఎగువ నుంచి 52,308 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం గరిష్ఠ నీటిమట్టం 1633 అడుగులకుగాను ప్రస్తుతం 1625.26 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.78 టీఎంసీలకుగాను

మిగతా 11వ పేజీలో...

మాజీ సీజేఐ చంద్రచూడ్‌ను ఖాళీ చేయించండి

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు లేఖ

2024 నవంబరు 10న ఆయన పదవీ విరమణ.. 8 నెలలుగా అక్కడే నివాసం

త్వరలోనే ఖాళీ చేస్తాను: చంద్రచూడ్

2



గోల్డెన్ వీసా @ 23 లక్షలు

భారతీయులకు యూఏఈ బంపర్ ఆఫర్

నామినేషన్ ఆధారంగా వీసా జారీ

ప్రాపర్టీ/వ్యాపారంలో భారీ పెట్టుబడి అక్కర్లేదిక

టెక్సస్‌లో వరదలు.. 51 మంది మృతి

- 27 మంది బాలికలు గల్లంతు
- కేర్ కౌంటీలోనే 43 మరణాలు
- మృతుల్లో 15 మంది చిన్నారులు

2

తమిళ 'నాగరికత'పై రాజకీయం!

3

కీళడి నాగరికతపై ఎడతెగని వివాదం

ఆ నాగరికత 2,800 ఏళ్లకన్నా ముందటిదని పరిశోధనల్లో తేలిందంటున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం

అందులో తప్పులున్నాయంటూ నిలిపేసిన కేంద్రం



టెక్సస్‌లో వరదల బీభత్సం

▸▸ 51 మంది మృతి.. మృతుల్లో 15 మంది చిన్నారులు

వాషింగ్టన్/ముంబై, జూలై 6: అమెరికాలోని టెక్సస్ రాష్ట్రం వరదలతో అతలాకుతలమవుతోంది. ఈ ప్రకృతి విలయం 51 మందిని పొట్టనబెట్టుకోగా.. 27 మంది బాలికలు గల్లంతయ్యారు. ఒక్క కేర్ కౌంటీలోనే 43 మంది చనిపోయారని, వారిలో 15 మంది చిన్నారులున్నారని అధికారులు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున గ్వాడలూప్ నది ఉప్పొంగడంతో వరద ఉధృతి మొదలైనట్లు పేర్కొన్నారు.

నాసిక్‌లో గోదావరి ఉధృతి..మునిగిన ఆలయాలు

నాసిక్, జూలై 6: మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా భారీ వర్షాలతో వణుకుతోంది. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో.. రామకుండ్ ప్రాంతంలోని దేవాలయాలు నీట మునిగిపోయాయి. శనివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురియడంతో.. గోదావరి ఉప్పొంగి.. గోరారామ్-కాలారామ్ ఆలయం, ముక్తిధామ్, దుతొండియా ఆంజనేయుడి మందిరం(వరద హెచ్చరికగా భావించే ఆలయం)లో వరద కొనసాగుతోంది.

మేం హిందీ వ్యతిరేకులం కాదు: సంజయ్ రౌత్

ముంబై, జూలై 6: ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేయడాన్ని మాత్రమే తాము వ్యతిరేకించామని, అలాగని తాము హిందీకి వ్యతిరేకులం కాదని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. హిందీ విషయంలో తమిళనాడు సీఎం స్టాలిన్ వైఖరికి తాము దూరమన్నారు. తమ పోరాటం ప్రాథమిక విద్యలో హిందీ అమలును వ్యతిరేకించడం వరకే పరిమితమన్నారు.

హిజ్బుల్ అధినేత సహా 11 మందిపై చార్జిషీట్

జమ్మూ, జూలై 6: మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా ఉగ్రవాద సంస్థలకు నిధులు సమీకరిస్తున్న కేసులో పాకిస్థాన్‌కు చెందిన హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాద సంస్థ అధినేత సయ్యద్ మొహమ్మద్ యూసుఫ్ షా అలియాస్ సయ్యద్ సలాహుద్దీన్ సహా 11 మంది నిందితులపై జమ్మూకశ్మీర్ రాష్ట్ర దర్యాప్తు సంస్థ(ఎస్ఐఏ) చార్జిషీటు దాఖలు చేసింది. 2022లో జమ్మూలో ఈ కేసు నమోదైంది.

సహనానికి మారుపేరు దలైలామా: మోదీ

ధర్మశాల, జూలై 6: టిబెటన్ ఆధ్యాత్మిక గురువు 14వ దలైలామా 90వ జన్మదిన వేడుకలు ఆదివారం ధర్మశాలలో వైభవంగా జరిగాయి. ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "140 కోట్ల భారతీయులతో పాటు నేను కూడా దలైలామాకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నా. దలైలామా ప్రేమ, కరుణ, సహనం, నైతిక క్రమశిక్షణకు మారుపేరు. ఆయన దీర్ఘాయువు కలిగి ఉండాలని ప్రార్థిస్తున్నా" అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

రద్దు చేసిన రైలు టికెట్లపై రీఫండ్ పెంపు!

న్యూఢిల్లీ, జూలై 6: రైలు టికెట్లను రద్దు చేసినప్పుడు ఇచ్చే రీఫండ్ మొత్తాన్ని పెంచేందుకు భారతీయ రైల్వే యోచిస్తోంది. టికెట్లపై 'క్లర్కేజీ' చార్జీ తగ్గింపు లేదా పూర్తిగా తొలగించే అంశాన్ని పరిశీలిస్తోంది. వెయిటింగ్ లిస్టు, ఆర్ఏసీ టికెట్లను రద్దు చేసుకున్నప్పుడు ఈ చార్జీలు మినహాయించుకొని ప్రయాణికులకు డబ్బులు వాపసు ఇస్తున్నారు.

ఎలాన్ మస్క్ 'అమెరికా పార్టీ'

అన్నట్టుగానే కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తున్నట్టు ప్రకటించిన ప్రపంచ కుబేరుడు

▸▸ ఇప్పుడున్న పార్టీలు చెత్త నిర్ణయాలతో అమెరికాను దివాలా తీయిస్తున్నాయి

▸▸ ప్రజలకు స్వేచ్ఛను తిరిగి అందిస్తా..: మస్క్

వాషింగ్టన్, జూలై 6: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నంత పనీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి విజయం సాధించేందుకు తోడ్పడి, అదే ట్రంప్‌తో విభేదాలతో బయటికొచ్చిన మస్క్.. కొద్దిరోజులుగా చెబుతున్నట్టుగా 'అమెరికా పార్టీ' పేరిట కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో వరుసగా పోస్టులు పెట్టారు. అమెరికాలో ఇప్పుడున్న రెండు పెద్ద పార్టీలు డెమొక్రటిక్, రిపబ్లికన్ పార్టీలతో ఎలాంటి ప్రయోజనం లేదని.. ప్రజలు నిజమైన రాజకీయ మార్పును కోరుకుంటున్నారని మస్క్ పేర్కొన్నారు. ఇటీవల తాను నిర్వహించిన పోల్‌లో మూడింట రెండొంతుల మంది కొత్త పార్టీ అవసరమని తేల్చారని చెప్పారు. "మీ స్వేచ్ఛను తిరిగి మీకు అందజేసేందుకు ఈ రోజు అమెరికా పార్టీ ఏర్పాటైంది. చెత్త, పనికిరాని నిర్ణయాలతో మనదేశాన్ని దివాలా తీయించే పరిస్థితి నెలకొంది. మనం ఈ ఏక పార్టీ వ్యవస్థను తుత్తునీయలు చేయబోతున్నాం" అని మస్క్ పేర్కొన్నారు. అమెరికాలో నిజానికి రెండు పెద్ద రాజకీయ పార్టీలు ఉన్నా.. అవి ఒకే తీరులో పనిచేస్తున్నాయన్న ఉద్దేశంతో ఏక పార్టీ వ్యవస్థగా ఆయన అభివర్ణించారు.



ట్రంప్‌ను గెలిపించి.. విభేదించి..

వాస్తవానికి గత అధ్యక్ష ఎన్నికలకు ముందు ట్రంప్‌కు మస్క్ గట్టి మద్దతుదారుగా నిలిచారు. ట్రంప్ గెలవడం కోసం ప్రచారం చేయడమేకాదు.. వందల కోట్ల డాలర్లు ఖర్చుపెట్టారు. ట్రంప్ అధ్యక్షుడిగా గెలిచాక ప్రభుత్వ వ్యయాలను తగ్గించడం కోసం ఏర్పాటు చేసిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్)'కు ఎలాన్ మస్క్ చీఫ్‌గా కూడా వ్యవహరించారు. కానీ ట్రంప్ ప్రభుత్వం తలపెట్టిన 'బిగ్ బ్యూటీఫుల్ యాక్ట్'ను మస్క్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ డోజ్ నుంచి బయటికి వచ్చారు. ఈ క్రమంలో ట్రంప్, మస్క్ మధ్య తీవ్ర విమర్శల యుద్ధం నడిచింది. ఒకదశలో మస్క్‌ను దేశం నుంచి గెంటివేయడానికి సిద్ధమన్నట్టుగా కూడా ట్రంప్ మాట్లాడారు. ఈ క్రమంలోనే కొత్త రాజకీయ పార్టీ పెడతానని మస్క్ చెబుతూ వచ్చారు. తాజాగా 'అమెరికా పార్టీ'ని స్థాపిస్తున్నట్టు ప్రకటించారు. అయితే పార్టీకి సంబంధించి ఎలాంటి వివరాలనూ మస్క్ వెల్లడించలేదు. కొత్త పార్టీ పెట్టాలంటే అమెరికా ఫెడరల్ ఎన్నికల కమిషన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇటీవలికాలంలో ఎన్నికల కమిషన్‌కు వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కడా అమెరికా పార్టీ పేరిట దరఖాస్తు లేదని సీఎన్ఎన్ వార్తా సంస్థ పేర్కొంది.

ట్రంప్‌కు దెబ్బపడుతుందా?

ఎలాన్ మస్క్ కొత్త రాజకీయ పార్టీతో రిపబ్లికన్ పార్టీకి, ట్రంప్‌కు దెబ్బతగులుతుందా? అన్న అంశం చర్చనీయాంశంగా మారింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. టెక్నాలజీని ఎక్కువగా వినియోగించే యువతతోపాటు పలు వర్గాల ఓటర్లలో మస్క్‌కు మద్దతు ఉంది. దానికి తోడు ట్రంప్ వ్యతిరేకులు, తటస్థ ఓటర్లు మస్క్ పార్టీ వైపు చూస్తే... రిపబ్లికన్ పార్టీపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఇదే సమయంలో డెమొక్రటిక్ పార్టీకి సెనేట్, ప్రతినిధుల సభల్లో ప్రాతినిధ్యం తగ్గితే.. బలమైన ప్రతిపక్షం లేకుండా పోతుందని, ఇది ట్రంప్‌కు కలిసి వస్తుందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

కొత్త పార్టీ.. అంత సులువేం కాదు!

అమెరికా రాజకీయ విధానం చాలా వరకు రెండు పార్టీల వ్యవస్థకే అనుకూలంగా ఉంటుంది. ఇంతకుముందు గ్రీన్ పార్టీ, లిబర్టేరియన్ పార్టీ వంటివి వచ్చినా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. మస్క్‌కు ఎంత ప్రతిష్ఠ, సంపద ఉన్నా కొత్త పార్టీ అంత సులువుకాదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఇక అమెరికాలో పుట్టినవారికి మాత్రమే అధ్యక్ష పదవికి పోటీపడే అవకాశం ఉంటుంది. మస్క్ దక్షిణాఫ్రికాలో జన్మించారు కాబట్టి తన పార్టీ ప్రజల్లో మద్దతు పొందినా కూడా మస్క్ అధ్యక్షుడు అయ్యే అవకాశమే లేదు. నిజానికి మస్క్ వ్యూహాలు కూడా భిన్నంగా ఉన్నాయి. గతంలో పలుమార్లు ఆయన చెప్పిన అంశాల మేరకు.. అమెరికా చట్టసభలైన సెనేట్, ప్రతినిధుల సభల్లో కొన్ని సీట్లను మస్క్ పార్టీ గెలుచుకుంటే చాలు. ఏవైనా బిల్లులను వ్యతిరేకించేందుకు, ఆమోదించేందుకు ఆ బలం సరిపోతుందని ఆయన ఆలోచన.

23.30 లక్షలు చెల్లిస్తే గోల్డెన్ వీసా

▸▸ భారతీయులకు యూఏఈ బంపర్ ఆఫర్



దుబాయి, జూలై 6: భారతీయులకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇస్తోంది. కొత్త రకం గోల్డెన్ వీసాను అందిస్తోంది. స్థిరాస్థి లేదా వ్యాపారంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేకుండా ఈ వీసాను పొందే అవకాశం కల్పిస్తోంది. నామినేషన్ ప్రాతిపదికన ఈ వీసాను ఇస్తోంది. ఇప్పటి వరకు దుబాయ్ గోల్డెన్ వీసాను భారతీయులు పొందడానికిగాను కనీసం రెండు మిలియన్ ఏఈడీల (రూ.4.66 కోట్లు) విలువైన ప్రాపర్టీలో పెట్టుబడి పెట్టాలి లేదా దేశంలోని వ్యాపారంలో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఒక మార్గంగా ఉంది. అయితే ఇప్పుడు కొత్తగా నామినేషన్ ఆధారిత వీసా విధానం కింద భారతీయులు లక్ష ఏఈడీలు (దాదాపు రూ.23.30 లక్షలు) రుసుముగా చెల్లిస్తే జీవిత కాలానికి యూఏఈ గోల్డెన్ వీసా పొందవచ్చు. ఈ వీసాను పరీక్షించే నిమిత్తం మొదటి విడతలో భారత్, బంగ్లాదేశ్‌ను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. భారత్‌లో ఈ వీసా దరఖాస్తులను పరిశీలించేందుకు కన్సల్టెన్సీ సంస్థ రయాద్ గ్రూప్ ఎంపికైంది. ఈ గోల్డెన్ వీసా కోసం ఎవరైనా దరఖాస్తు చేయగానే మొదట తాము వారి నేపథ్యాన్ని పరిశీలిస్తామని, మనీలాండరింగ్, క్రిమినల్ రికార్డులతోపాటు వారి సోషల్ మీడియాను తనిఖీ చేస్తామని రయద్ గ్రూప్ ఎండీ రయాద్ కమల్ అయుబ్ పేర్కొన్నారు. ఆ తర్వాత రయాద్ గ్రూప్ ఆ దరఖాస్తును ప్రభుత్వానికి పంపుతుందని, అనంతరం నామినేషన్ ఆధారిత గోల్డెన్ వీసాపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నామినేషన్ కేటగిరీలో యూఏఈ గోల్డెన్ వీసా పొందాలనుకునే వారు దుబాయ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. గోల్డెన్ వీసాను పొందిన వారు తమ కుటుంబ సభ్యులను దుబాయికి తీసుకువెళ్లవచ్చు. ప్రాపర్టీ ఆధారితంగా తీసుకునే గోల్డెన్ వీసా సదరు ప్రాపర్టీని విక్రయిస్తే దాని కాలం ముగిసిపోతుంది. కానీ నామినేషన్ ఆధారిత వీసా జీవిత కాలం చెల్లుబాటు అవుతుంది.

లోకం తీరు



జమిలి ఎన్నికలు రాజ్యాంగబద్ధమే!

▸▸ కానీ ఈసీకి అపరిమిత అధికారాలు సముచితం కాదన్న మాజీ సీజేఐలు

న్యూఢిల్లీ, జూలై 6: లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపేందుకు ఉద్దేశించిన 'ఒక దేశం-ఒకే ఎన్నిక' విధానం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు (సీజేఐలు) పేర్కొన్నారు. అయితే ఈ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘాని(ఈసీ)కి అపరిమిత అధికారాలు కట్టబెట్టడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. విచక్షణాధికారాల వినియోగానికి కమిషన్‌కు తగు మార్గదర్శకాలు అవసరమన్నారు. మాజీ సీజేఐలు జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ జేఎస్ కేహర్.. జమిలి ఎన్నికల బిల్లుపై మాజీ మంత్రి పీపీ చౌధురి ఆధ్వర్యంలో ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి తమ తమ అభిప్రాయాలను తెలియజేశారు. జస్టిస్ లలిత్ ఫిబ్రవరిలో, జస్టిస్ కేహర్ మార్చిలో కమిటీని కలిసి బిల్లులోని వివిధ అంశాలపై చర్చించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ గొగోయ్ ఈ నెల 11న సదరు కమిటీతో సమావేశం కానున్నారు. ఏకకాలంలో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికల నిర్వహణ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించడమేనని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను జస్టిస్ చంద్రచూడ్ తోసిపుచ్చారు. వేర్వేరుగా ఎన్నికలు జరపాలని రాజ్యాంగం ఎక్కడా చెప్పలేదని జేపీసీకి లిఖితపూర్వకంగా తెలియజేశారు. అయితే ప్రతిపాదిత రాజ్యాంగ సవరణలో ఈసీకి అత్యధిక అధికారాలు ఇవ్వడాన్ని ఆయన, జస్టిస్ గొగోయ్ ప్రశ్నించారు. చట్టప్రకారం అసెంబ్లీల కాలపరిమితి ఐదేళ్లు. లోక్‌సభతో పాటే ఎన్నికల పేరుతో.. ఈ గడువును కుదించేలా, పెంచేలా హద్దుల్లేని అధికారాన్ని ఈసీకి కట్టబెట్టడం సముచితం కాదన్నారు.

మాజీ సీజేఐ చంద్రచూడ్‌ను ఖాళీ చేయించండి

▸▸ కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు లేఖ

న్యూఢిల్లీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ చంద్రచూడ్‌ను వెంటనే ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసం నుంచి ఖాళీ చేయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు పాలనా విభాగం కోరింది. 2024 నవంబరు 10న సీజేఐగా పదవీ విరమణ పొందిన జస్టిస్ చంద్రచూడ్.. గత 8 నెలలుగా టైప్-8 అధికారిక బంగ్లాలోనే ఉంటున్నారని తెలుపుతూ కేంద్ర హౌజింగ్, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శికి లేఖ రాసింది. రిటైర్ అయ్యాక టైప్-7 ప్రభుత్వ బంగ్లాలో ఆరు నెలల పాటు అద్దె చెల్లించకుండానే ఉండొచ్చని, ఆ గ్రేస్ పీరియడ్ కూడా ఇప్పటికే గడిచిపోయిందని ఆ లేఖలో గుర్తు చేసింది. ప్రస్తుతం సీజేఐగా ఉన్న వారికి టైప్-8 అధికారిక బంగ్లాను కేటాయించాల్సి ఉన్నందున, దాన్ని వెంటనే ఖాళీ చేయించాలని కోరింది. అధికారిక బంగ్లాలో నివసించేందుకు మాజీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు ఇచ్చిన గడువు మే 31తోనే ముగిసిందని గుర్తు చేసింది. కాగా.. జస్టిస్ చంద్రచూడ్ తర్వాత జస్టిస్ ఖన్నా సీజేఐగా నియమితులయ్యారు. అయితే, ఆయన 6 నెలలు మాత్రమే ఆ పదవిలో ఉన్నారు. అలా ఉన్నప్పుడు.. 2024 డిసెంబరు 18న జస్టిస్ ఖన్నాకు జస్టిస్ చంద్రచూడ్ ఒక లేఖ రాశారు. ఇప్పటికే తనకు తుగ్లక్ రోడ్డులోని బంగ్లా నంబర్ 14ను కేటాయించారని, అక్కడ మరమ్మతులు జరుగుతున్నాయని.. పనులు పూర్తయిన వెంటనే సీజేఐ అధికారిక నివాసాన్ని ఖాళీ చేస్తానని లేఖలో స్పష్టం చేశారు. ఆ లేఖకు జస్టిస్ సంజీవ్ ఖన్నా సానుకూలంగా స్పందించారు. జస్టిస్ ఖన్నా సీజేఐ అధికారిక నివాసంలో ఉండకుండానే పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత సీజేఐగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ బీఆర్ గవాయికి సైతం జస్టిస్ చంద్రచూడ్ ఇదే విజ్ఞప్తి చేశారు. జస్టిస్ చంద్రచూడ్‌కు మే 31 వరకు అనుమతి లభించింది. అయితే, గడువు పొడిగించకూడదనే షరతుపైనే అనుమతి ఇచ్చారు. ఆ సమయం కూడా గడిచిపోయి మరో నెల పూర్తయింది. కానీ, జస్టిస్ చంద్రచూడ్ అధికారిక నివాసాన్ని ఖాళీ చేయలేదు.

బెంగళూరుకు హైస్పీడ్ కారిడార్

▸▸ రహదారి విస్తరణకు ఎట్టకేలకు మోక్షం

▸▸ నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు నిర్మించే.. రహదారిని బెంగళూరు వరకు కొనసాగింపు

హైదరాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్- బెంగుళూరు హైవేకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న ఈ రహదారి విస్తరణ సమస్యకు కేంద్రం ఎట్టకేలకు తెరదించింది. హైదరాబాద్-బెంగుళూరు మార్గంలో హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించాలని నిర్ణయించింది. దీని నిర్మాణానికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపకల్పన బాధ్యతలను టెండర్ ద్వారా ఓ సంస్థకు అప్పగించింది. కాగా, డీపీఆర్ కోసం రూ.12.63 కోట్లు వెచ్చించనున్నట్టు ఎన్‌హెచ్ఏఐ పేర్కొంది. మరోవైపు నాగ్‌పూర్-హైదరాబాద్ వరకు కూడా మరో హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించాలని కేంద్రం ఇదివరకే నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి అవసరమయ్యే డీపీఆర్ రూపకల్పన బాధ్యతను కూడా ఓ సంస్థకు కట్టబెట్టింది. తాజాగా డీపీఆర్ రూపకల్పనకు అవసరమైన 'లెటర్ ఆఫ్ అగ్రిమెంట్' కూడా చేసుకున్నారు. ఈ డీపీఆర్ కోసం రూ.14.99కోట్లు వెచ్చించనున్నారు. ఈ రెండు మార్గాలను 'విజన్-2047' జాతీయ రహదారుల మాస్టర్ ప్లాన్‌లో కూడా చేర్చినట్టు ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. త్వరలోనే ఈ మార్గాలకు సంబంధించిన సర్వే పనులు మొదలు కానున్నాయి. జాతీయ రహదారుల విభాగంలో ఉన్న నార్త్‌సౌత్ కారిడార్ (ఎన్‌హెచ్-44)లో భాగంగా నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వరకు నిర్మించబోయే జాతీయ రహదారినే బెంగళూరు వరకు కొనసాగించాలని నిర్ణయించింది. అందుకోసం ఈ రహదారిని రెండు సెక్షన్లుగా విభజించింది. నాగ్‌పూర్-హైదరాబాద్ వరకు ఒకటి, హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు మరో సెక్షన్‌గా చేపట్టనుంది. ఈ హైస్పీడ్ కారిడార్‌ను 6 లేన్లుగా నిర్మించనుండగా, భవిష్యత్తులో 8లేన్లు, ట్రాఫిక్ రద్దీని బట్టి 12 లేన్లుగా విస్తరించే అవకాశం ఉంది. ఈ క్రమంలో 12 లేన్ల విస్తరణకు అవసరమైన స్థాయిలోనే భూసేకరణ చేయనున్నట్టు అధికార వర్గాలు అంటున్నాయి. ఈ రోడ్డు తెలంగాణలో 195 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 260 కి.మీ, కర్ణాటకలో 106 కి.మీ మేర నిర్మాణం కానుంది. మొత్తం 1,150 కిలోమీటర్ల మేర నిర్మితమయ్యే ఈ రహదారికి రూ.35వేల కోట్లకు పైగా అవసరమవుతాయని అంచనా. నాగపూర్-హైదరాబాద్- బెంగుళూరు వరకు ప్రతిపాదించిన హైస్పీడ్ కారిడార్‌పై గంటకు 120 కి.మీ కన్నా ఎక్కువ వేగంతో వాహనాలు ప్రయాణించేలా రోడ్డును నిర్మించనున్నట్టు తెలిసింది. ఆ మేరకే సర్వే నిర్వహించనున్నట్టు సమాచారం.

వర్ధమాన దేశాలకు ప్రాతినిధ్యమేదీ?

▸▸ ప్రస్తుత పరిస్థితులకు సరిపోని ఐరాస

▸▸ బడుగు దేశాల సమస్యలపై చర్చే లేదు

▸▸ బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ వ్యాఖ్యలు



బ్రిక్స్ సదస్సు సందర్భంగా వివిధ దేశాల అధినేతలతో కలిసి ప్రధాని మోదీ మానవహారం

రియో డి జనెరో, జూలై 6: ప్రపంచస్థాయి సంస్థల్లో వర్ధమాన, వెనుకబడిన దేశాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడంపై భారత ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని మరింత సమ్మిళితంగా, బహుళ ధ్రువ సంస్థలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'గ్లోబల్ సౌత్'గా వ్యవహరిస్తున్న వెనుకబడిన దేశాలకు మరింత ప్రాధాన్యం లభించాల్సి ఉందని తెలిపారు. ఆదివారం బ్రెజిల్‌లోని రియో డి జనెరో నగరంలో జరిగిన 17వ బ్రిక్స్ కూటమి సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సదస్సుకు కీలక నేతలైన రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గైర్హాజరు కావడం గమనార్హం. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలు అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు కారణంగా ప్రపంచ స్థాయి సంస్థల్లో గ్లోబల్ సౌత్ దేశాలు బాధితులుగా మిగులుతున్నాయని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, వనరుల పంపిణీ, భద్రత వంటి విషయాల్లో చిన్నచూపునకు గురవుతున్నాయని తెలిపారు. 20వ శతాబ్దంలో ఏర్పాటయిన ప్రపంచస్థాయి సంస్థల్లో మూడింట రెండో వంతు మానవ జాతికి తగిన ప్రాతినిధ్యమే లేకుండా పోతోందని ఆరోపించారు. "ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఎంతగానే సహకరిస్తున్న దేశాలకు విధాన నిర్ణయాలు తీసుకునే సమయంలో తగిన స్థానం ఉండడం లేదు. ఇది కేవలం ప్రాతినిధ్యానికి సంబంధించిన సమస్యే కాదు.. ఆయా సంస్థల విశ్వసనీయత, సమర్థతకు సంబంధించినది కూడా. గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రాతినిధ్యం లేని సంస్థలను ప్రపంచస్థాయి సంస్థలు అంటే..అవి సిమ్ కార్డు ఉండి నెట్ వర్క్‌లేని మొబైల్ ఫోన్లు లాంటివి" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచస్థాయి సంస్థ అయిన ఐక్యరాజ్యసమితిపై అభిప్రాయం చెబుతూ అది 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కొనలేకపోతోందని చెప్పారు. "ప్రపంచంలో పలుచోట్ల జరుగుతున్న యుద్ధాలు, కరోనా వంటి మహమ్మారులు, ఆర్థిక సంక్షోభం, సైబర్ నేరాలు, అంతరిక్షంలోని సమస్యలకు ఈ సంస్థల వద్ద సమాధానాలు లేవ"ని ప్రధాని అన్నారు. నూతన సమ్మిళిత ప్రపంచ వ్యవస్థను నెలకొల్పాలంటే ముందుగా ఇప్పుడున్న ప్రపంచస్థాయి సంస్థలను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాల్సి ఉందని అన్నారు. పరిపాలన వ్యవస్థ, ఓటింగ్ హక్కులు, నాయకత్వ స్థానాల్లో మార్పులు ఉండాలని చెప్పారు. బ్రిక్స్‌లో కూడా మరిన్ని దేశాలను కలుపుకోవాలని, కాలానికి తగ్గట్టుగా ఈ కూటమి కూడా మారుతుందని నిరూపించాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ(ఏఐ)ను అన్ని దేశాలకు అందుబాటులో ఉంచడంపైనా ప్రధాని మోదీ మాట్లాడారు. "సాంకేతిక పరిజ్ఞానం ప్రతి వారం మారుతోంది. కానీ ఓ ప్రపంచ స్థాయి సంస్థ మాత్రం దీనిని ఎనిమిదేళ్లకు ఒకసారయినా అప్‌డేట్ చేసేందుకు ఇష్టపడడం లేదు. 20వ శతాబ్దపు టైప్‌రైటర్ల మీద 21వ శతాబ్దం సాఫ్ట్‌వేర్ పనిచేయదు" అని వ్యాఖ్యానించారు. భారత్ మాత్రం నిర్మాణాత్మక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ పరిపాలన, శాంతి, భద్రత, కృత్రిమ మేధ రంగాల్లో సహకారం అందిస్తుందన్నారు.


పహల్గామ్ ఉగ్రదాడి ప్రస్తావన

ఉగ్రవాదం పహల్గామ్ దాడి అంశాలనూ మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఉగ్రవాదం ప్రపంచమానవాళి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ అని పేర్కొన్న ఆయన, పహల్గామ్ ఉగ్రదాడి సమస్త మానవాళిపై జరిగిన దాడి అన్నారు. కాగా, అర్జెంటీనా పర్యటన ముగించుకొని బ్రెజిల్ చేరుకున్న మోదీకి రియో డి జనైరోలో భారతీయులు ఘనంగా స్వాగతం పలికారు.

ఏఐతో నిండు 150 ఏళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

దక్షిణ కొరియా పౌరులు 85 ఏళ్ల సగటు జీవితకాలంతో ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచారు. మరి తదుపరి దశ ఏమిటి? ఏ టెక్నాలజీ సాయంతో మనిషి జీవితకాలాన్ని మరింత పెంచవచ్చు? ..అంటే, ఈ ప్రశ్నలకు సమాధానం 'కృత్రిమమేధ' అని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఏఐ వల్ల 2030 నాటికి.. అంటే కేవలం వచ్చే ఐదేళ్లలోనే మానవ జీవితకాలం రెట్టింపు అవుతుందని వారు అంచనా వేస్తున్నారు. రెట్టింపు అంటే.. దాదాపుగా 150 సంవత్సరాలు! మనం అనుకునే పూర్ణాయుష్షు కన్నా యాభై ఏళ్లు ఎక్కువ!! ఆధునిక వైద్యం వల్ల జీవితకాలం పెరిగిందంటే.. దాంట్లో ఒక అర్థం ఉంది. మరి కృత్రిమ మేధతో జీవితకాలం ఎలా రెట్టింపు అవుతుంది? అంటే.. వేలాది పత్రాలను సైతం వేగంగా పరిశీలించి క్షణాల్లో విశ్లేషించే శక్తి ఏఐకి ఉందని శాస్త్రజ్ఞులు గుర్తుచేస్తున్నారు. ఆ శక్తిని వినియోగించుకోవడం ద్వారా.. సరైన చికిత్స లేని పలు ఆరోగ్య సమస్యలకు కొత్త కొత్త పరిష్కారాలను కనుగొనవచ్చని, కొన్ని సమస్యలు అసలు తలెత్తకుండా ముందుజాగ్రత్త పడొచ్చని తద్వారా మనుషుల లైఫ్‌స్పాన్‌ను పెంచడం సాధ్యమని వారు ప్రతిపాదిస్తున్నారు. ఉదాహరణకు.. మన శరీరంలోని క్రోమోజోముల చివరి భాగంలో ఉండే టెలోమియర్ల పొడుగు మన వయసు పెరిగేకొద్దీ తగ్గిపోతుందని, ఆ ప్రక్రియను నిరోధించగలిగితే వృద్ధాప్యాన్ని జయించవచ్చని శాస్త్రజ్ఞులు ఇప్పటికే గుర్తించారు. కొన్ని ఇంజెక్షన్లు, మందుల ద్వారా టెలోమియర్ల పొడుగును తగ్గించకుండా ఆపొచ్చని వారి పరిశోధనల్లో వెల్లడైంది. కానీ.. వాటివల్ల కణవిభజన అపరిమితంగా జరిగి క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని తెలిసింది. దీంతో.. ఆ ముప్పు లేకుండా టెలోమియర్ల పొడుగు తగ్గిపోయే ప్రక్రియను నిరోధించే దిశగా శాస్త్రవేత్తలు చాలాకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ఆ పరిశోధనలకు ఏఐని ఊతంగా వాడుకోగలిగితే ఇంకా వేగంగా ఫలితాలను సాధించవచ్చని కొందరు శాస్త్రజ్ఞులు అభిప్రాయపడుతున్నారు.



మెడికల్ నానోబోట్లు..

ఏఐ సాయంతో మానవ జీవితకాలాన్ని వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయొచ్చని.. అమెరికాలోని క్యాలిఫోర్నియాకు చెందిన ప్రముఖ ఏఐ సంస్థ 'ఆంత్రోపిక్' వ్యవస్థాపకుడు డేరియో పదేపదే చెబుతున్నారు. మరో నిపుణుడు.. రే కర్జ్‌వెయిల్‌ది కూడా ఇదే మాట. మానవుల్లో వయసుమీరే ప్రక్రియను 2032 నాటికి ఏఐ నియంత్రించగలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అప్పటికి కృత్రిమమేధతో పనిచేసే మెడికల్ నానోబోట్లు అందుబాటులోకి వస్తాయని, మనకు ఏదైనా రోగం వచ్చినప్పుడు ఏఐ సాయంతో సమస్య ఏమిటో గుర్తించి.. ఈ మెడికల్ నానోబోట్లను శరీరంలోకి పంపిస్తే అవి కణ స్థాయిలో మరమ్మతులు చేస్తాయని చెప్పారు. అలాగే.. ఏఐ సాయంతో అప్పటికి మన మెదడులోని సమాచారాన్ని బ్యాకప్ తీయడం కూడా సాధ్యమవుతుందని ఆయన అంచనా. అలా బ్యాకప్ తీయగలిగితే మనిషి భౌతికంగా లేకపోయినా మానసికంగా చిరంజీవిగానే మిగిలినట్టు!!

ఇంత త్వరగానా?

కృత్రిమ మేధ సామర్థ్యం గురించి కొందరు శాస్త్రజ్ఞులు ఆశావహ దృక్పథంతో ఆలోచిస్తుండగా.. మరికొందరు మాత్రం ఇవన్నీ ఐదేళ్లలో సాధ్యమవుతాయనకోలేమంటున్నారు. "సినిమాల్లో చూపించినట్టుగా ఏఐ మనల్ని హద్దుల్లేని శక్తులుగా తయారుచేసేయలేదు. కాకపోతే, మనల్ని మరింత ఆరోగ్యంగా, చురుగ్గా ఉంచగలుగుతుంది. మరీ 150 ఏళ్లు కాదుగానీ.. ఏఐ మనుషులు కనీసం వందేళ్లు జీవించడం మన జీవితకాలంలోనే చూడగలుగుతాం" అని 'డేటా సొసైటీ' కంపెనీ చీఫ్ సైంటిస్ట్ ద్మిత్రీ అడ్లెర్ తెలిపారు.

జన్యు పరిశోధనలకు..

జన్యులోపాలను సరిచేయడానికి ప్రస్తుతం క్రిస్పర్ అనే జీన్ ఎడిటింగ్ టెక్నాలజీ అందుబాటులో ఉన్న సంగతి తెలిసిందే. కానీ, అది ఇంకా చాలా ప్రాథమిక స్థాయిలో ఉంది. లోపం ఉన్న చోట సవరణకే ఉపయోగిస్తున్నారు. కానీ.. మన శరీరంలోని జన్యువులు కాలక్రమంలో రకరకాల ప్రభావాలకు లోనై మార్పులు చెందుతుంటాయి. వాటన్నింటినీ ఊహించి (లేదా) ముందే అంచనా వేసి జన్యుసవరణ చేసే వెసులుబాటు ప్రస్తుతానికి అందుబాటులో లేదు. ఈ ప్రక్రియలో ఏఐ సాయం తీసుకుంటే.. కాలక్రమంలో ఒక జన్యువులో ఎలాంటిమార్పులు సంభవించే అవకాశం ఉందో సమగ్రంగా విశ్లేషించి అంచనా వేస్తుంది. దానివల్ల చాలారకాల అనారోగ్యాలను రాకుండా అడ్డుకునే అవకాశం ఉందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో హమాస్ కమాండర్ మృతి

▸▸ మరో ఇద్దరు హమాస్ కీలక నేతలు కూడా

▸▸ అమెరికాలో నేడు ట్రంప్‌తో నెతన్యాహు భేటీ

గాజా, టెల్ అవీవ్, జూలై 6: గాజాపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హమాస్ కమాండర్ అలీ సలేహ్ మృతిచెందాడు. హమాస్‌కు చెందిన మరో ఇద్దరు కీలక సభ్యులు మన్సూర్, సులేమాన్ కూడా హతమయ్యారు. గాజా నగరంతో పాటు మొత్తం వంద చోట్ల దాడులు ఇజ్రాయెల్ దాడులు చేయగా 61 మంది మృతిచెందారు. నగరంలోని శతి శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ దాడులు జరిపింది. అయితే పక్కనే ఉన్న అబు అసీ పాఠశాల లక్ష్యంగా దాడి జరిగిందని, ఈ దాడుల్లో చిన్నారులు పెద్ద సంఖ్యలో చనిపోయారని పాలస్తీనా వర్గాలు తెలిపాయి. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సోమవారం అమెరికా వెళ్తున్నారు. కాల్పుల విరమణ ఒప్పందంపై అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చిస్తారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చించేందుకు ఖతార్‌కు తమ ప్రతినిధులను పంపుతామని ఇజ్రాయెల్ ఇప్పటికే ప్రకటించింది.

2,800 ఏళ్లా.. 2,300 ఏళ్లా?

- తమిళ 'నాగరికత'పై రాజకీయం!
- తమిళనాడులోని కీళడి నాగరికతపై ఎడతెగని వివాదం
- ఆ నాగరికత 2,800 ఏళ్లకన్నా ముందటిదని
- పరిశోధనల్లో తేలిందంటున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం
- సాక్ష్యంగా పురావస్తు శాఖ తవ్వకాల నివేదిక
- ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ భావజాలాన్ని తోసిరాజ నేలాఉందనే తొక్కిపెడుతున్నారని మండిపాటు

చెన్నై, జూలై 6(ఆంధ్రజ్యోతి): పురాతన నాగరికత ఆనవాళ్లు, చరిత్ర ఏ సంస్కృతికైనా గర్వకారణమే. అందులోనూ తమ భాషను, సంస్కృతిని విపరీతంగా ప్రేమించే తమిళుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలా వారు వెలుగులోకి తెచ్చిన కీళడి నాగరికత, అది కొనసాగిన కాలం విషయంలో ఆ రాష్ట్రానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఎడతెగని వివాదం నెలకొంది. కీళడి తవ్వకాలలో లభించిన ప్రాచీన వస్తువులు, నగర శిథిలాలను బట్టి అక్కడి తమిళుల నాగరికత కాలం 2,800 సంవత్సరాలకు మునుపటిదని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా.. అది 2,300 ఏళ్ల మునుపటిదేనని కేంద్రం అంటోంది. అంతేకాదు కీళడి నాగరికతకు సంబంధించి భారత పురాతత్వ శాఖ (ఏఎస్ఐ) రూపొందించిన నివేదికను పక్కన పెట్టింది. దీనిపై తమిళ రాజకీయపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలానికి, వారు చెప్పే సిద్ధాంతాలను తోసిరాజనేలా కీళడి నాగరికత ఉండటంతోనే వివక్షాపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నాయి. ఇప్పుడీ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

500 సంవత్సరాలకు కోత పెట్టి!

అమర్‌నాథ్ రామకృష్ణన్ నివేదిక, కీళడిలో లభ్యమైన వస్తువులను బట్టి చూస్తే తమిళుల నాగరికత కాలం 2,300 సంవత్సరాల క్రితం నాటిది మాత్రమేనని అవగతమవుతోందని కేంద్రం పేర్కొంది. ఈ నాగరికత కాలాన్ని 500 సంవత్సరాలు



కీళడి తవ్వకాల్లో బయల్పడిన కట్టడ నిర్మాణం


తగ్గించాలని సూచించింది. అయితే కీళడి వద్ద తవ్వకాలు, పురాతన ఆధారాల గుర్తింపు అంతా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో చేపట్టామని, ఆ వస్తువులన్నీ ఏ కాలానికి చెందినవో పరిశోధకులు నిర్ధారించారని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి స్పష్టం చేసింది. కీళడి పురావస్తు పరిశోధనలపై ఏఎస్ఐ, రాష్ట్ర పురావస్తు శాఖ సమర్పించిన నివేదికలను అధికారికంగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేసింది. "పురావస్తు తవ్వకాల్లో లభించే పెంకులు, బంగారం, వెండి, ఇనుము వంటి వస్తువులు ఎన్నేళ్ల క్రితం నాటివో క్షణాల్లో తేల్చి చెప్పగల స్కానింగ్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి ఈ వస్తువుల కాలాన్ని తమిళనాడులోనే కాదు, ఇతర రాష్ట్రాల్లో కూడా స్కానింగ్ చేసి నిర్ధారించాం. అశోక చక్రవర్తి గురించి పుస్తకాల్లో చదువుకుంటున్నాం. చెట్లు నాటారని, ధర్మసత్రాలు కట్టారని చదువుతున్నాం. అసలు అశోకుడి పేరుతో ఓ రాజు ఉండేవాడని లోకానికి తొలుత తెలియజేసింది జేమ్స్ ప్రిట్సెప్ అనే చరిత్రకారుడే. ఆ చరిత్రకారుడు కనుగొని చెప్పినదే తమిళ బ్రహ్మీ లిపి. అన్ని నాగరికతల కంటే తమిళుల నాగరికత అత్యంత ప్రాచీనమైనదని లోకానికి ఎలుగెత్తి చాటేందుకు సిద్ధమవుతున్నాం" అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, చారిత్రక పరిశోధకుడు బాలకృష్ణన్ చెప్పారు.

సంగ సాహిత్యమే ఆధారం!

సింధు, హరప్పా నాగరికతలకు సంబంధించి బయటపడిన పురాతన వస్తువులను పోల్చదగిన సాహిత్యం అంటూ ఏదీ లేదు. అయితే తమిళ సంగ సాహిత్యంలో వర్ణించిన నగరాలు, నివాసగృహాలు, ఆభరణాలు, పనిముట్లు వంటివి కీళడి తవ్వకాల్లో బయటపడ్డాయని తమిళనాడు ప్రభుత్వం చెబుతోంది. అమర్‌నాథ్ రామకృష్ణన్ రెండు విడతలుగా కీళడి వద్ద పురావస్తు తవ్వకాలను సమర్థవంతంగా నిర్వహించారని.. కానీ కేంద్రం ఆయనను మరో చోటికి బదిలీ చేసిందని గుర్తు చేస్తోంది. తర్వాత వచ్చిన ఏఎస్ఐ అధికారి.. తమిళ ప్రాచీన నగరాల నాగరికతకు సంబంధించి ఎలాంటి వస్తువులు లభ్యం కాలేదని ప్రకటించి చేతులు దులుపుకొన్నారని పేర్కొంది. దీనితో రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి పురావస్తు తవ్వకాలను కొనసాగించిందని.. తవ్వకాల్లో లభించిన పురాతన వస్తువులతో మ్యూజియం కూడా ఏర్పాటు చేశామని తెలిపింది.

కీళడి తవ్వకాల నివేదికను ఆమోదించాల్సిందే: స్టాలిన్

సంగ సాహిత్యంలో వివరించిన జీవన విధానం కీళడి ఆవిష్కరణలతో శాస్త్రీయంగా నిర్ధారణ అయిందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. కీళడి పురా



తవ్వకాల్లో బయల్పడిన బావి

వస్తు తవ్వకాలపై బ్రిటన్‌లోని లివర్‌పూల్ జాన్ మూర్స్ విశ్వవిద్యాలయం తాజాగా నిర్వహించిన పరిశోధనలు కూడా తమిళుల సంస్కృతి ప్రాచీనతను గుర్తించాయని తెలిపారు. కేంద్రం ఏ మాత్రం జాప్యం చేయకుండా కీళడి తవ్వకాల నివేదికను ఆమోదించాలని డిమాండ్ చేశారు. కీళడిలో లభించిన పుర్రెలను పరిశీలించిన జాన్‌మూర్స్ విశ్వవిద్యాలయం.. త్రీడీ సాంకేతిక పరిజ్ఞానంతో 2,500 ఏళ్లకు పూర్వంనాటి ప్రజల ముఖకవళికలను పునర్నిర్మించటం పట్ల తాము గర్వపడుతున్నామని చెప్పారు. 5,300 ఏళ్లకు ముందే తమిళనాట ఇనుప, ఇతర లోహపు వస్తువులను ఉపయోగించేవారని పురావస్తు తవ్వకాల్లో వెల్లడైందని, దక్షిణ భారతం అప్పట్లోనే ఇనుప లోహాన్ని వాడేవారని నిర్ధారణ అయిందని స్పష్టం చేస్తున్నారు. కీళడి నాగరికత కాలాన్ని 500 సంవత్సరాలు తగ్గించాలన్న కేంద్రం సూచనపై తమిళనాడులోని రాజకీయ పార్టీలన్నీ మండిపడుతున్నాయి. డీఎంకే, అన్నాడీఎంకే, టీవీకే సహా ప్రధాన పార్టీల నేతలంతా కేంద్రం తీరును తప్పుపడుతున్నారు. కీళడి నగర నాగరికతను సింధు నాగరికతతో పోల్చటాన్ని కేంద్రంలోని పాలకులు ఏ మాత్రం సహించలేక పోతున్నారని ఆరోపిస్తున్నారు.

మరింత విస్తృతంగా తవ్వకాలు జరగాలి: అమర్‌నాథ్ రామకృష్ణన్

కీళడిలో మరింత విస్తృతంగా పరిశోధనలు జరపాలని సిఫార్సు చేశానని అమర్‌నాథ్ రామకృష్ణన్ తెలిపారు. వైగై వంటి చిన్న నది సమీపాన పెద్ద నాగరికతల ఆనవాళ్లు లభించడమేంటన్న విమర్శలు సరికాదని చెప్పారు. సింధు నాగరికత కూడా ఆ నదికే పరిమితం కాకుండా 13 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉందని.. ఇక్కడ వైగై నది నాగరికత కూడా చాలా విస్తరించి ఉండవచ్చని తెలిపారు. కీళడికి చేరువగా ఉన్న మరికొన్ని ప్రాంతాల్లో తవ్వకాలు జరిపితే ఆధారాలు బయటపడతాయని పేర్కొన్నారు.

'కీళడి నాగరికత' ఏంటి?

తమిళనాడులోని మదురై ప్రాచీన నగరం. తమిళ సాహిత్యానికి, సంస్కృతికి పుట్టినిల్లు. ఆ నగరం చుట్టూ తమిళ శిలా శాసనాలు, కుడ్య శాసనాలు, తిరుప్పరం కుంద్రం, అళగన్‌కుళం శాసనాలు వంటివెన్నో లభించాయి. ఈ క్రమంలో మదురై చేరువగా తమిళ ప్రాచీన నాగరికత ఆనవాళ్లు ఉండవచ్చన్న ఆలోచనతో ఆ రాష్ట్ర పురావస్తు శాఖ 2014లో తవ్వకాలు చేపట్టింది. అక్కడి వైగై నది తీరాన ప్రాచీన కట్టడాలు, ఆభరణాలు వంటివెన్నో బయటపడ్డాయి. దీనిపై తమిళనాడు ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపింది. కీళడిలో నగర నాగరికత 2,800 సంవత్సరాలకు పూర్వమే ఆవిర్భవించిందని పేర్కొంది. మరోవైపు కీళడిలో భారత పురావస్తుశాఖ(ఏఎస్ఐ)కి చెందిన అమర్‌నాథ్ రామకృష్ణన్ బృందం తవ్వకాలు జరిపి 2,800 సంవత్సరాలకు పూర్వం ఈ నాగరికత ఆవిర్భవించిందని పేర్కొంది.



రొట్టెలు మార్చుకునేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసిన స్వర్ణాల చెరువు ఘాట్

రొట్టెల పండగకు పోటెత్తిన భక్తజనం

- తొలిరోజే కిటకిటలాడిన బారాషహీద్ మైదానం
- భక్తిశ్రద్ధలతో సందల్‌మాల్..

నేటి అర్ధరాత్రి గంధమహోత్సవం



రొట్టెలు మార్చుకుంటున్న మహిళలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 6 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండగ ఆదివారం నెల్లూరులో అట్టహాసంగా ప్రారంభమైంది. బారాషహీద్ దర్గాలో దర్శనం కోసం తొలిరోజే భక్తులు బారులుతీరారు. స్వర్ణాల చెరువు ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించి, వరాల రొట్టెలను మార్చుకున్నారు. అర్ధరాత్రి మత పెద్దలు, ముస్లిం నేతలు, ప్రజాప్రతినిధులు, పోలీసు బందోబస్తు మధ్య సందల్‌మాల్ భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. 10వ తేదీ వరకు జరిగే పండగ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కేరళ, కర్నాటక, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ప్రధాన ఘట్టమైన గంధమహోత్సవం సోమవారం అర్ధరాత్రి తర్వాత జరగనుంది. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, మహ్మద్ ఫరూక్, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే బీసీలకు పునర్వైభవం

బీసీ ఆత్మగౌరవ భరోసా సభలో మంత్రులు అనగాని, సత్యకుమార్, సవిత



బీసీ ఆత్మగౌరవ భరోసా సభలో సంఘీభావం ప్రకటిస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు, బీసీ సంఘాల నాయకులు

తిరుపతి (ఉపాధ్యాయనగర్), జూలై 6 (ఆంధ్రజ్యోతి): 'గత పాలకులు బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే బీసీలకు తగిన ప్రాతినిధ్యం దక్కుతోంది. ఈ ప్రభుత్వంలోనే బీసీలకు పునర్వైభవం వచ్చింది' అని మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, సవిత పేర్కొన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం, అంబేడ్కర్- పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో జరిగిన 'బీసీ ఆత్మగౌరవ భరోసా' సభలో వీరు మాట్లాడారు. రాష్ట్రంలో 67 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తే అందులో 29.7 లక్షల మంది బీసీలు, 11 లక్షల మంది ఎస్సీలు ఉన్నారని మంత్రి అనగాని అన్నారు. మైనారిటీలతో కలుపుకొని 53 లక్షల మంది వెనుకబడిన తరగతులవారు ఉన్నారని వివరించారు. చంద్రబాబు అడిగినందువల్లే ప్రధాని మోదీ దేశంలో కులగణన చేపట్టనున్నారన్నారు. మనం పోరాటం చేయాల్సిన అవసరం లేకుండానే కూటమి ప్రభుత్వం బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తోందని చెప్పారు. 'అధికారంలో ఉన్నన్నాళ్లు బీసీల బాగోగులు పట్టించుకోలేదు. దౌర్జన్యాలు, దాడులు చేశారు. 15 సంవత్సరాల అమర్‌నాథ్‌గౌడ్‌ను నడిరోడ్డుమీద పెట్రోలుపోసి తగులబెట్టారు. అలాంటి వారు ఇప్పుడు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు బీసీలకు న్యాయం చేస్తామంటున్నారు' అం టూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వైసీపీపై ధ్వజమెత్తారు. 'తన మంత్రివర్గంలో సమర్థులనే కొనసాగించి మిగిలినివారిని తీసేస్తానన్న జగన్.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మార్చలేదుగానీ పక్కజిల్లాలోని అనిల్‌కుమార్ యాదవ్‌ను మార్చారు. బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని మార్చలేదుగానీ బోయ కులానికి చెందిన బొమ్మన జయరామ్‌ను మార్చారు. పార్థసారధిని మార్చి.. తన కులానికి చెందినవారిని మార్చలేదు' అని గుర్తు చేశారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తర్వాతే అన్ని రంగాల్లో బీసీలు ముందున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపా రు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆరు రోజులైనా తెలియని ఆచూకీ

- మాలిలో ఇద్దరు ఏపీ వాసుల కిడ్నాప్
- సిమెంట్ ఫ్యాక్టరీపై దాడి చేసిన అల్‌ఖైదా అనుబంధ సంస్థ ఉగ్రవాదులు
- రక్షించాలని కుటుంబ సభ్యుల వేడుకోలు



అమరలింగేశ్వరరావు

మాచర్ల రూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఆఫ్రికాలోని మాలి దేశం వెళ్లి ఆరు రోజుల క్రితం ఉగ్రవాదుల చేతిలో కిడ్నాప్‌కు గురైన ఇద్దరు ఆంధ్రప్రదేశ్ వాసుల ఆచూకీ ఇంకా తెలియరాలేదు. కిడ్నాప్ అయిన వారిలో పల్నాడు జిల్లా మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన కూరాకుల అమరలింగేశ్వరరావు, ఒడిసాలోని గంజాంలో స్థిరపడిన ఏపీ వాసి వెంకటరమణ ఉన్నారు. ఆరు రోజులు కావస్తున్నా సమాచారం తెలియకపోవడంతో అమరలింగేశ్వరరావు, వెంకటరమణ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఉగ్ర చెర నుంచి విడిపించి స్వదేశం రప్పించాలని కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అమరలింగేశ్వరరావు పుట్టినరోజు నాడే కిడ్నాప్‌కు గురైనట్టు తెలుస్తోంది. ఆయన భార్య, పిల్లలు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. అమరలింగేశ్వరరావుకు సుమారు 20 ఏళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన వెంకటరమణతో వివాహం జరిగింది. ఆయన పదేళ్ల క్రితం మాలి దేశానికి ఉపాధి కోసం వెళ్లారు. అక్కడ డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో మెకానికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. గంజాంలో స్థిరపడ్డ వెంకటరమణ కూడా ఇదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. గతేడాది ఆయన మాలికి వెళ్లినట్టు సమాచారం. ఈ నెల 1న ఫ్యాక్టరీలోకి అల్‌ఖైదా అనుబంధ సంస్థ జేఎన్ఐఎం ఉగ్రవాదులు చొరబడి అమరలింగేశ్వరరావు, వెంకటరమణతో పాటు మహారాష్ట్రకు చెందిన వెంకటేశ్వరరావును కిడ్నాప్ చేశారు.



మొహర్రం సందర్భంగా నంద్యాల జిల్లా బనగానపల్లెలో మాతం నిర్వహిస్తున్న షియా ముస్లింలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారాయణ

సీఎంలు మారినా అవినీతి అలాగే..

- సీపీఐ నారాయణ

తిరుపతి(ఆటోనగర్), జూలై 6: రాష్ట్రంలో ముఖ్యమంత్రులు మారినా అవినీతి మాత్రం మారలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. తిరుపతిలో ఆదివారం జరిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో అవినీతి పెరగబట్టే జగన్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక అధికారులు, ఉద్యోగులు బదిలీల్లో అవినీతి చోటు చేసుకోవడం దారుణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇళ్లకు స్మార్టు మీటర్లు అమర్చితే పగలకొట్టండని ప్రస్తుత మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారని.. ఆ ప్రకారం సీపీఐ నాయకులు, కార్యకర్తలు స్మార్ట్ మీటర్లను పగలకొడతారని నారాయణ చెప్పారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బనకచర్ల, పోలవరం, నగరి-గాలేరు, హంద్రీ-నీవా ప్రాజెక్టులనూ పూర్తి చేసి ప్రజలకు నీరందించాలని ఆయన డిమాండు చేశారు. మామిడి రైతును ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మాజీ సీఎం జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని నారాయణ విమర్శించారు.

తుని రైలు ఘటన కేసు ఉపసంహరణపై కాపు జేఏసీ హర్షం

విజయవాడ (గాంధీనగర్), జూలై 6(ఆంధ్రజ్యోతి): తుని రైలు దహన ఘటనపై నమోదైన కేసును ఉపసంహరించుకోవడం పట్ల రాష్ట్ర కాపు జేఏసీ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జేఏసీ సమావేశం జరిగింది. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలని, కాపులపై దాడులను అరికట్టాలని, కృష్ణాజిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని సమావేశం తీర్మానించింది. కాపు కార్పొరేషన్‌కు ఏటా రూ.3 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని, కాపుల జనాభా దామాషా మేరకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని తీర్మానించారు.

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

దాశరథి శతజయంతి సదస్సు

కేంద్రసాహిత్య అకాడమీ, తెలుగు శాఖ ప్రభుత్వ సిటీ కళాశాల (హైదరాబాద్) సంయుక్త నిర్వహణలో జూలై 9 ఉ.10 నుంచి సా.5.30 వరకు సిటీ కళాశాల ఆజామ్ హాల్లో 'దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి సదస్సు' జరుగుతుంది. ప్రారంభ సమావేశంలో సి. మృణాళిని స్వాగతోపన్యాసం, నందిని సిధారెడ్డి కీలకోపన్యాసం చేస్తారు. ముఖ్య అతిథి ప్రిన్సిపాల్ పి. బాలభాస్కర్, గౌరవ అతిథి దాశరథి కుమార్తె ఇందిరా గౌరీశంకర్, అధ్యక్షత కోయి కోటేశ్వరరావు. పత్ర సమర్పణ– గంగ్ర లక్ష్మణ రావు, ఏనుగు నరసింహారెడ్డి, ఆర్. సీతారామ్, కె. ప్రభాకర్, సిద్ధంకి యాదగిరి, సమ్మెట విజయ, గరిపెల్లి అశోక్.

కోయి కోటేశ్వరరావు

కార్టూనిస్ట్ శేఖర్ స్మారక అవార్డులు

కార్టూనిస్ట్ శేఖర్ స్మారకార్థం అవార్డుల ప్రదానం జూలై 13 ఉ.10.30 గం.లకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. 2025కు గాను కార్టూనిస్ట్ మృత్యుంజయ, ఆర్టిస్ట్ చిత్ర ఈ అవార్డు కింద రూ.10,116 నగదు, ప్రశంసాపత్రం స్వీకరిస్తారు. ముఖ్యఅతిథి ఎస్. వినయకుమార్; స్మారకోపన్యాసం కూర్మనాథ్; విశిష్ట అతిథులు తిప్పర్తి యాదయ్య, చింతల యాదగిరి, శంకర్, కూరెళ్ళ శ్రీనివాస్ తదితరులు వివరాలకు: 9052116323.

కంభాలపల్లి కృష్ణ

రజనిశ్రీ సాహిత్య పురస్కార ప్రదానం

రజనిశ్రీ సాహిత్య పురస్కార ప్రదానం జూలై 12 మ.1.30గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. 'నిశాచరుడి దివాస్వప్నం' కవితా సంపుటికి గాను మల్లారెడ్డి మురళీమోహన్ పురస్కారాన్ని స్వీకరిస్తారు. కార్యక్రమంలో సి. పార్థసారథి, కసిరెడ్డి వెంకటరెడ్డి, మామిడి హరికృష్ణ, ఎస్. రఘు, అన్నవరం దేవేందర్ తదితరులు పాల్గొంటారు.

గాజుల రవీందర్



కవి కులాబ్ధి సోముడు!

"ఒకడు నాచన సోమన్న" అన్నారు విశ్వనాథ. అద్వితీయుడు (unique) అని ఆయన భావన. "మాట నేర్పు మీద, మానవ ప్రకృతి మీద, గడుసుదనం మీదనే సంవిధాన సౌధాన్ని నాచన సోమన్న నిర్మించాడు. ఇంతగా గడుసుతో సంవిధాన నిర్వహణ చేసిన తెలుగు కవులు లేనేలేరని చెప్పవచ్చు," అని కూడా విశ్వనాథ వ్యాఖ్యానించారు.

నాచన సోమన క్రీ.శ.1344ప్రాంతంవాడు. ఎఱ్ఱాప్రగడకు సమకాలికుడు; ఒకరకంగా కొద్దిగా చిన్నవాడు. సోమన రాసిన 'ఉత్తర హరివంశం' ఒక ప్రబంధం. కాగా అప్పటికే ఎర్రన రాసిన 'హరివంశం' ఉన్నది. ఎర్రనది పురాణ కావ్యమైతే సోమనది ప్రబంధ శైలి. ఎఱ్ఱాప్రగడ తన 'హరివంశా'న్ని ప్రోలయ వేమారెడ్డికి అంకితం ఇచ్చాడు. కాని సోమన తన ప్రబంధాన్ని నరాంకితం చేయకుండా తిక్కన లాగా హరిహరనాథుడికి సమర్పించాడు.

నిజానికి హరివంశం భారతానికి ఖిలం. అంటే పరిశిష్టం. సంస్కృత హరివంశాన్ని తిక్కన తన అనువాదంలో చేర్చలేదు. ఇది కలిపితేనే భారతం మహాభారతం ఔతుందని పెద్దలంటారు. వ్యాసకృతంగా పేర్కొనే ఈ పవిత్ర గ్రంథాన్ని ఇప్పటికీ నేపాల్ న్యాయస్థానాల్లో సాక్షులు తల మీద పెట్టుకుని ప్రమాణం చేస్తారు. హరివంశంతో భారతం సంపూర్ణతను సంతరించుకుంటుంది.

అప్పటికే ఎర్రన రాసిన హరివంశం ఉండగా, నాచన సోముడు మళ్ళీ రాయడం ఎందుకు? కారణాలు ఊహించాల్సిందే. ఎర్రన హరివంశం సోమన దృష్టికి వచ్చి ఉండకపోవచ్చు; వచ్చినా సంతృప్తిని ఇవ్వకపోయివుండవచ్చు; పురాణంగా కాక, ప్రబంధ ధోరణిలో రాయాలని భావించి వుండవచ్చు. ఇక పోతే, మనకు లభ్యమవుతున్న సోమన 'ఉత్తర హరివంశం'లో సాధారణంగా ఉండాల్సిన అవతారిక, కావ్యం చివరలో గద్య లేవు. ఇవి వుంటే ఎన్నో వివరాలు తెలిసేవి. అందువల్ల సోముడు పూర్వహరివంశం, ఉత్తర హరివంశం– రెండూ రాసాడని ఊహించడానికి చాలా అవకాశం వున్నది.

సంస్కృత హరివంశంలో వున్న ఎన్నో విషయాలు మనకు ఈ 'ఉత్తర హరివంశం'లో కనిపించవు. ఎర్రన వదిలేసిన హంసడిభోపాఖ్యానం ఇందులో కనిపిస్తుంది. అందువల్ల పూర్వహరివంశం సోమన రాసి వుండవచ్చు. నిజానికి ఉత్తర హరివంశం కూడా మనకు పూర్తిగా దొరకడం లేదు. సోమన 'హరవిలాసం', 'వసంత విలాసం', 'ఆదిపురాణం' అనే రచనలు చేసాడని లాక్షణికులు అన్నారు. కాగా, ఇవేమీ ఇప్పుడు లభ్యం కావు.

సోమన ఎన్నో ప్రక్రియలకు ఆద్యుడు. వీటిని తదనంతర కవులు ఎన్నిటినో అనుసరించారు. మచ్చుకు సోముని మొదటి పద్యం – "శ్రీ సర్వమంగళాకుచవాసంతీ" అని ప్రారంభమవుతుంది. ఇందులో అమ్మవారి వక్షోజాల ప్రశంస వున్నది. ఇలాంటిది పూర్వ కవుల్లో అగుపించదు. కావ్యం మొదట్లో అమ్మవారి పాలిండ్లను స్తుతించడం సోమన ఒరవడి దిద్దిందే. అందువల్ల మొట్టమొదటి 'చంటబ్బాయ్' నాచన సోముడే అని చెప్పాలి.

సోమన రాసిన 1487 సద్యాల్లో సామెతలు, జాతీయలు, పలుకుబళ్ళు మనకు బళ్ళనిండా దొరుకుతాయి. సజీవమైన జాతీయాల్ని, నిత్యజీవితంలోని మాటల్ని వాడాడు. 'లంజ', 'మిండరికం' లాంటి శబ్దాలు సైతం కనిపిస్తాయి. పురాణ ధోరణి నుంచి తన కావ్యాన్ని ప్రబంధ ధోరణిలో తీర్చిదిద్దాడు సోమన. ఇతని పాత్రలు సమకాలీన మనస్తత్వాలతో కానవస్తాయి. సారస్వతం కన్నా ఈయన రచనలో చమత్కారమే ఎక్కువ.

అందుకే – "ఈ కథలు వ్రాయుటలో నాచన సోమన్న తన కావ్యమునకొక మహాప్రయోజనమభిలషించెను. ఇట్టి దానికి ప్రబంధ ధ్వనియని పేరు. ఈ ప్రబంధ ధ్వని విషయము మహోత్తాలమైన కొలది ప్రధానముగా కవి మహాకవి యగుచున్నాడు" అని విశ్వనాథ వివరించారు. అందువల్లే ఇతణ్ణి చాలా మంది అనంతర కవులు పద్య రచనా విధానంలో పూర్తిగా అనుసరించారు. నరకాసుర వధ వృత్తాంతంలో సత్యభామ యుద్ధం చేస్తూండగా నాచన ఆమెను ఇలా వర్ణించాడు:

మ. అరిజూచున్ హరిజూచు జూచుకములందందంద మందార కే
సరమాలా మకరంద బిందు సలిలస్యందంబులందంబులై
తొరుగం, బయ్యెదకొం గొకింత దొలగన్ దోడ్తో శరాసారమున్
దరహాసామృతపూరముం గురియుచుం దన్వంగి కేళీగతిన్
(హరివంశం – 1 – 162)

– ఇదే ఘట్టంలో తన భాగవతంలో బమ్మెర పోతన ఇలా అనుకరించారు:

మ. పరుజూచున్ వరుజూచు నొంప నలరింపన్ రోష రాగోదయా
విరత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్
జరగన్ గన్నుల గెంపు సొంపు బరగన్ జండాస్త్ర సందోహమున్
సరసాలోక సమూహమున్ నెఱపుచున్ జంద్రాస్య హేలాగతిన్
(భాగవతం – 10 – ఉత్తర – 178)

నాచన క్రమాలంకారాన్ని సైతం పోతన అందంగా అనుసరించాడు. రచనాశిల్పపరంగా 'సంవిధాన చక్రవర్తి' అనే బిరుదు నాచన సోమునికి సార్థకమవుతుందని విశ్వనాథ వ్యాఖ్యానించారు. అత్యంత దుష్కర ప్రాసను వాడి కంద పద్యానికే వన్నె తెచ్చిన విధానం "ప్రాగ్జ్యోతిషంబు గదిసి దృగ్జ్యోంటకృతులు లేక దితిజుల మీదన్ దృగ్జ్యోత్స్న జేవురింపగ దిగ్జ్యాగగనాంతరంబు దివురగ నార్చెన్" (1-143) అనే దాంట్లో మనకు కనపడుతుంది.

పురాణ అంశాన్ని తాత్త్విక దశలోకి తీసుకెళ్ళి, శివకేశవుల్ని పోలుస్తూ, ఛేకానుప్రాసం, విషయం, అంత్యానుప్రాసాలంకారాలలో ఒక విచిత్రమైన సీస పద్యాన్ని రాసాడు సోమన (2-180). పెంచడం, తుంచడం హరిహరులు ఇద్దరూ సమానంగా చేస్తున్నారని చెప్పాడు:

అభ్రంకషంబైన ఆలపోతు నితండు త్రుంచినాడీతండు పెంచినాడు
సాధుసమ్మతముగా సామజంబు నితండు కాచినాడీతండు త్రోచినాడు
బర్హిర్ముఖార్థమై పర్వతేశు నితండు తాల్చినాడీతండు వ్రాల్చినాడు
ఫణ పరంపర తోడి పన్నగేంద్రునితండు మెట్టినాడీతండు చుట్టినాడు
నేడు నాడును నాడును నేడు మనకు చూపచెప్పంగ చెప్పంగ చూపగలిగె
ననుచు కొనియాడ సంయమిజనుల కొదవె రజతగిరి మీద
హరిహరారాధనంబు

–కృష్ణుడు వృషభాసురుణ్ణి చంపాడు. కాగా, శివుడు ఎద్దును పెంచి వాహనంగా చేసుకున్నాడు. హరి ఏనుగును రక్షించాడు. ఐతే, శివుడు గజాసురుణ్ణి వధించాడు. విష్ణువు దేవతల కోసం కూర్మంగా పర్వతాన్ని మోసాడు. శివుడు మాత్రం త్రిపురాసురుల సంహారంతో మేరుపర్వతాన్ని విల్లుగా చేసుకుని, దాన్ని వంచాడు. హరి పామును పాన్పుగా చేసుకుంటే హరుడు మెడకు చుట్టుకున్నాడు. నాడూ నేడూ వీటిని కథలుగా విన్నాం – ఇప్పుడు చూస్తున్నాం – అని శివకేశవుల సమాగమంలోని పద్యం.

సీసపద్య రచనకు శ్రీనాథుణ్ణి ఎంతో స్తుతిస్తారు కాని, నాచన సోముడి రచనాశిల్పం అగ్రగణ్యమని తోస్తుంది (శ్రీనాథుడు క్రీ.శ.1370 ప్రాంతంవాడు). పద్యాల్లో సారస్వతం కన్నా చమత్కారమే ఎక్కువగా ఆయన సాహిత్య ధర్మంగా మారింది అనవచ్చు. వక్రోక్తికి ఉదాహరణగా ఒక గొప్ప పద్యం మనకు రెండో ఆశ్వాసంలో తటస్థిస్తుంది (176):

సీ. కుజము కుంజరముచే కూలునో కూలదో? కూల్చు కుంజరము
నీ కుజము గూల్చె
ప్రాను పేరేటిచే మడుగునో మడుగదో? మడుచు పేరేటి
నీ ప్రాను మడచె
కాలునో కాలదో ఒకనిచే సాలంబు? కాలు నీ సాలంబు కాల్చె నొకని
తునియునో పరశుచే తునియదో వృక్షంబు? తునియు
నీ వృక్షంబు తునిమె పరశు

గీ. వనుచు తమలోన చర్చించు అమర వరుల కభిమతార్థ
ఫలార్థమై ఉండవచ్చు
పారిజాతంబు నా మ్రోల పండియుండ నంద గంటి నా కోర్కెల నంద గంటి

– ఇక్కడ పునరుక్తులైన శబ్దాలతో అర్థభేదం కల్పించి క్రీడ సల్పాడు సోమన. "లోకంలో ఏనుగు చెట్టును కూలుస్తుందో లేదో కాని, ఈ వృక్షం (శివుడు) గజాసురుణ్ణి కూల్చేశాడు. పెద్ద నది చెట్టును చుట్టేస్తుందో లేదో కాని, ఈ చెట్టు (శివుడు) గంగను తలలో చుట్టేశాడు. ఒకడి వల్ల చెట్టు కాలుతుందో లేదో కాని, కాలుడు (శివుడు) మన్మథుణ్ణి కాల్చేశాడు. గొడ్డలి చెట్టుని నరుకుతుందో లేదో కాని, శివుడు పరశువు అనే దైత్యుణ్ణి నరికేశాడు." దేవతలకు ఆయన ఫలవృక్షం కదా! అందుకే ఇక్కడ శివుణ్ణి వృక్షంతో పోల్చాడు.

ఉత్తర హరివంశం ఒక లోకోత్తర కావ్యం. కొద్దిపాటి కథలతో ప్రబంధ రచన చేయడం నాచన సోముడితోనే మొదలైంది. అయిదు కథల్లోని అంతరార్థాన్ని వివరించడంలో ఆయన మహాశిల్పాన్ని కనబరిచాడు. ప్రతి పద్యంలో శబ్దాలంకారమో చమత్కార వర్ణనో, పాండితీ శౌర్యమో మనకు గోచరిస్తుంది. మనసుకు హాయిని కలిగిస్తాయి సోముని పద్యాలు.

నాచన సోముడికి క్రమాలంకారం ఇష్టమని ఎన్నో పద్యాల వల్ల తెలుస్తుంది. అలా రాస్తూనే, చమత్కారాన్నీ, విరోధాభాసనీ ప్రదర్శిస్తాడు. మచ్చుకి:

పన్నగంబులరాజు పగవాడు కూడి నీ శయనంబు పయనంబు సంతరింప
దుగ్ధ వారాశి కూతురు ఆలు కూడి శరణంబు చరణంబు సవదరింప
తామర పగవాడు దయితుండు కూడి నీ బడిచూపు కుడిచూపు పరిఢవింప
చందురు చెలికాడు సయిదోడు కూడి నీ ఉల్లంబు మొల్లంబు ఉపచరింప
కంపమాన మనోధ్యానగతుల మానకేకతంబున్న మునులకు ఏకతంబు
లేక పొడగాన వచ్చు నీ లీల కాన అన్యులేనాట ధన్యులే అంబుజాక్ష!

మునులు కృష్ణుణ్ణి స్తుతించే పద్యం ఇది. ఇందులో శబ్దాల్ని ఒక ఆట ఆడించాడు సోమన. యథాసంఖ్యాలంకారంతో అలంకరించాడు. దీని భావం ఇది– "శత్రువులైన సర్పరాజు, గరుత్మంతుడు నీకు పాన్పు వాహనం అయ్యారు. తల్లీ కూతుళ్లైన లక్ష్మి, గంగ నీ వక్షస్థలాన్ని పాదాల్ని ఆశ్రయించారు. విష్ణువుకు సూర్యచంద్రాదులు కళ్లు. రెండింటికీ పడని తామరలు, కలువలు నీ చూపులు అయ్యాయి. మన్మథుడు, కౌస్తుభం నిన్ను సేవిస్తున్నాయి– రెండూ తోబుట్టువులు. నీ లీలలు ధ్యానించే మునులకు నిర్హేతుకంగా ఇలా తోస్తున్నాయి."

సుకుమార మధుర శైలితో మనల్ని అలరించే నాచన సోముడిని ఆలంకారికులు, లాక్షణికులు ఎన్నో విధాలుగా శ్లాఘించారు. అయితే, రావాల్సినంత కీర్తిప్రతిష్ఠలు ఆయనకు రాలేదు. వస్తుకళ, సమకాలీన జీవన చిత్రణ, శబ్దార్థాల చిత్రరచన వున్న 'ఉత్తర హరివంశం' అసంపూర్తిగా వుండటం దీనికి కారణం కావచ్చు. కాగా, సాహిత్యోపాసకులు, భాషాభిజ్ఞులు తప్పక చదవాల్సిన కావ్యం ఇది.

■ అప్పరుసు విజయ రామారావు

✆ 91770 86363



ఉత్తర హరివంశం ఒక లోకోత్తర కావ్యం. కొద్దిపాటి కథలతో ప్రబంధ రచన చేయడం నాచన సోముడి తోనే మొదలైంది. సోమన ప్రతి పద్యంలో శబ్దాలంకారమో చమత్కార వర్ణనో, పాండితీ శౌర్యమో మనకు గోచరిస్తుంది. సోమన రాసిన 1487 సద్యాల్లో సామెతలు, జాతీయలు, పలుకుబళ్ళు మనకు బళ్ళనిండా దొరుకుతాయి.

వాక్యం ఒక విత్తనాల మూట

ఎవరు రాసిన వాక్యాలో?
అద్భుతమైన శక్తివంతమైన వాక్యాలు,
ఎక్కడ ఎవరు రాస్తే మాత్రం?
ఏ సిరాతో రాస్తే మాత్రం?
వరుసలు వరుసలుగా కవాతు చేసే వాక్యాలు,
అడుగుల్లో పిడుగులు ధ్వనించే అరుదైన వాక్యాలు,
పగిలిన పాదాల కింద మెత్తని
పచ్చగడ్డి పరుపుల్లాటి వాక్యాలు,
పిల్లగాలి లాలిపాటలకు అలలు అలలుగా
ప్రవహించే నారుమళ్ళలాటి వాక్యాలు,
వానాకాలపు వరదలప్పుడు ఎగిసిపడే
నాగావళి కెరటాల్లాటి వాక్యాలు,
ఎప్పుడు ఏ కలంతో రాస్తే మాత్రం?
ఏ గుండెల్లో ఐతేనేం? ఏ బండల్లో ఐతేనేం?

✣✣✣

అక్షరాల పుట్టుక కుట్ర కాదు
పదాలు ప్రాణగీతాలు కావడం కుట్ర కాదు,
అక్షరాలు పదాల్లో వొదగడమూ కుట్ర కాదు,
పదాలు వాక్యాలు వాక్యాలుగా ప్రవహించడం
కుట్ర కానే కాదు,
వాక్యరహిత సమాజాన్ని ఊహించడమే అసలు కుట్ర.

✣✣✣

చీకటి గుండెల్లో మండే సూర్యుడై ప్రకాశించాలనే
తపన పడుతుంది ప్రతిసిరాచుక్కా,
పదంలో పదం కలిపి కదంతొక్కి
నినాదమైన వాక్యాన్ని ప్రేమించనిదెవరు?
అమితమైన విద్వేషాన్ని గుండెలో నింపుకున్నవాడు తప్ప.

ఎత్తుపల్లాల్ని సరిచేసి హృదయకేదారాల్లో
పాటల పంటలు పండించాలనుకునే వాక్యాల్ని
ముక్కలు ముక్కలుగా నరికి, ఉక్కుపాదాల కింద నలిపి,
వికటాట్టహాసం చేసే కుట్రదారులెప్పుడూ ఉంటారు,
అక్షరాలెక్కడైనా మిగిలివుంటే అవి
ప్రశ్నలకొడవళ్ళై కళ్ళముందు వేలాడుతాయని
వాటిని చీకటిగుహల గోడలకు వేలాడదీసి
ఆనందిస్తుంటారు,
అక్షరాల్లేని కాలాన్ని కలగంటుంటారు.

ప్రశ్నలై కళ్ళకడ్డంపడే వాక్యాల్ని తునాతునకలు చేసి,
ఏకఛత్రచ్ఛాయలో నిశ్చింతగా నిద్రపోవాలని
కొందరి ఆశ కావొచ్చు,
అక్షరరహిత సమాజాన్ని స్వప్నిస్తూ
వాక్యాల్ని చుట్టచుట్టి నేలపొరల్లోకి నెట్టేస్తూ
సాధించిన దానికి సంబరపడొచ్చు,
కెరటాలై ఎగిసిపడే వాక్యప్రవాహాల్ని ఎవరైనా
ఏ ఎడారుల్లో ఇంకింప జేయగలరు?
వాక్యాల్ని నిషేధించి అదృశ్యమైపోయినవారే గానీ
చిగుళ్ళు చిక్కినా, వేళ్ళు తెగనరికినా
వాక్యాలు మాత్రం చిగురిస్తూనే ఉంటాయి,
రాలిపడిన అక్షరం వాక్యాలుగా మొలకెత్తడం
సహజాతిసహజం.

అక్షరమంటే జీవం తొణికిసలాడే విత్తనం,
వాక్యం నిలవచేసిన విత్తనాల మూట
వాక్యం ఒక ముగింపు లేని పాట.

■ లాంగుల్య

జ్వర లాలస లాంటి మైకాన్ని ఇచ్చిపోయింది!

నా మొదటి పుస్తకం

రఘు

కవిత్వం లలిత సంగీతంలా అందరికీ అర్థం కావాలని తీర్మానించే మనుషుల్ని చూసి నవ్వుకోవటం, వాళ్ళను కవ్విస్తూ మరింత గాఢంగా రాయటం సరదా నాకు. వాక్యానికి వాక్యానికి మధ్య చీమలా దూరి పదాలను కొరకటంలోని మజా గుజ్జుమామిడి తిన్నా రాదని, పొడి వచనంతో కవిత పలచపడుతుందని నమ్ముతాను. అలా అని ప్రబంధ భాష కూడా వాడను. చకోరాలు, పక్షుల సంగీతాలు, పరిమళ జ్ఞాపకాలు నాకు వస్తువులు. వాటికి ఉద్వేగాలు జోడించి రాసుకుంటాను. దానికి సరిపోయే భాషనే వాడాలనుకుంటాను. ఈ నేపథ్యంతో నేను తెచ్చిన మొదటి కవితా సంపుటి 'ఒక స్వాప్నికుడి శ్వేత సంతకం'.



1997 జూన్ నెలలో జ్ఞాన్ బాగ్ వెళ్ళినప్పుడు నా పొయెట్రీ నోట్‌బుక్ శేషేంద్ర శర్మ గారి టీపాయ్ మీద పెట్టి, "దీనిని అచ్చేయమంటారా లేదా నిష్కర్షగా చెప్పండి," అన్నాను. అకవిత్వానికి ఆయన బద్ధశత్రువు కనుక అంతంత మాత్రంగా ఉంటే కవితల్ని తిరగరాయమని అడుగుతాడని తెలుసు. ఏ వాక్యమూ మార్చాల్సిన అవసరం లేదనుకున్నారేమో వారం తరువాత 'స్వాప్నికుడి జెండా' అనే టైటిల్‌తో ముందుమాట రాసి పంపారు. ఇలా: "ఆపాద మస్తకమూ భావావేశ విద్యుల్లతలు పాకుతున్న వ్యక్తి నుండి ఝుంఝా మారుతంలా వీచే మాటలే పుడతాయి. అవి గొర్రె మందల్లాంటి మాటలుగా ఎప్పుడూ ఉండవు. రసోన్మిశ్రితంగా, శ్రోతల్ని చకచ్చకితులను చేసే అనుపమాన శక్తియుక్తాలై ఉంటాయి. ఎంత అద్భుత శక్తి ఉందో రఘు గొంతులో! ఆయన కవిత మనల్ని వశీకరించుకునే సాంద్ర చంద్రిక."



నా పొయెట్రీ నోట్‌బుక్ శేషేంద్ర శర్మ గారి టీపాయ్ మీద పెట్టి, "దీనిని అచ్చేయమంటారా లేదా నిష్కర్షగా చెప్పండి," అన్నాను. అకవిత్వానికి ఆయన బద్ధశత్రువు కనుక అంతంత మాత్రంగా ఉంటే కవితల్ని తిరగ రాయమని అడుగుతాడని తెలుసు.

ఆ ఉత్తరం నా అంతర్లోకాల్లో రేపిన తుఫాను నుండి తేరుకునేందుకు చాలా కాలం పట్టింది. శేషేంద్ర శర్మ అభిప్రాయం చెప్పకుంటే అచ్చు జోలికి పోయేవాడ్నే కాదు.

అప్పటికి ఖమ్మంలో జూనియర్ లాయర్‌ని. పావలా బేడా పోగేసుకొని బెజవాడ పోయి కవర్ పేజీకి బొమ్మేయమని బాలి గారిని అడిగాను. గంట తర్వాత ఆయన గీసిన ముఖచిత్రం చూసి కృతజ్ఞతతో చేతులు పట్టుకొని నొక్కినప్పుడు, "ఉద్వేగాలు బాగా పట్టుకుంటారు మీరు. దానినే బొమ్మ చేసే ప్రయత్నం చేశాను," అని మెచ్చుకున్నారు. కట్ చేస్తే ఆగస్ట్ 17. జిల్లా గ్రంథాలయంలో జ్వాలాముఖితో పుస్తకవిష్కరణ. వెన్నెల సొనకు పరవశించే రఘు కవిత్వానికి లావా లాంటి జ్వాలాముఖితో ఆవిష్కరణ సరిపడదని మిత్రులు పెదవి విరిచినా పట్టుపట్టి పిలిచాను. ఆ రోజు జ్వాలాముఖి ఉపన్యాసంలో శుద్ధ కవిత్వ ప్రేమికుడిని చూసింది ఖమ్మం. 70వ దశకంలో ఆయన ఉపన్యాసాలు విని ఉర్రూతలూగిన తరం ఆ సభ లోనే ఉంది. వాళ్ళ ఎర్ర చొక్కాలకు, ఉద్యమ గీతాలకు జ్వాలాముఖి రెండో పార్శ్వం తెలీదు.

"ముడుచుకున్న మునివేళ్ళ కలం తంత్రులు బిగించాను కాలం పొత్తిళ్ళపై కొత్తగీతం రాద్దామని," వంటి నా పంక్తుల్ని ఉటంకిస్తూ నడిచింది సభ. ఆ తరువాత ఇంకో తొమ్మిది పుస్తకాలు వచ్చినా, వాటి గురించి వక్తలెంత గొప్పగా మాట్లాడినా మొదటి సభలోని తాజాదనం ఎప్పటికీ ప్రత్యేకం.

కొన్ని రోజుల్లో బోలెడు సమీక్షలు..! "ఇతని కవిత్వ శరీరం నిండా మెరుపులు గుబాళిస్తాయి. విరుపులు తళుక్కున మెరుస్తాయి. కొత్త కొత్త పదబంధాలు, భావగంధాలు అత్తరు వాసనలతో ప్రభాసిస్తాయి. ఈ కవిది నిజంగా అభివ్యక్తిలో కొత్త జెండా!" అని మెచ్చుకున్నారు నాగ భైరవ.

"రఘు అద్దం లాంటి కవి. పూలతీగ లాంటి కవి. అతనిలో ప్రతిక్షణాన్నీ కళాత్మకం చేసే కళాకారుడున్నాడు. ప్రపంచం లోని గొప్ప కవుల ఊహల్తో సమానమైన ఊహలు ఆయన చేశాడు," అని రాశారు సౌభాగ్య.

నా కవిత్వ జీవితానికి పునాదులు వేసిన శేషేంద్ర శర్మ గారికి మొదటి ప్రతిని భక్తితో సమర్పించుకున్నాను. ఒక జ్వర లాలస లాంటి మైకాన్ని ఇచ్చిపోయింది నా మొదటి సంపుటి.

✆ 96761 44904

"కవి అక్షరాల్లో పాఠకుడు దృశ్యాన్ని చూడగలగడం గొప్ప అనుభూతి"

చదువు ముచ్చట

జాబేర్ పాషా



మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

ఒక పుస్తకం అని చెప్పలేను కానీ, నిజానికి బాల్యం నుండే నాలో పుస్తక పఠనంపై అమితాసక్తిని పెంచింది మాత్రం వివిధ పత్రికల సండే మ్యాగజైన్స్. ఏ ఒక్క మ్యాగజైన్‌నూ విడిచి పెట్టకుండా చదివేవాడిని. అందులో వచ్చే కథలను కట్ చేసి దాచిపెట్టుకునే వాడిని. టీనేజ్‌లో యండమూరి 'యుగాంతం' నవల చదవడం గుర్తుంది. నేను అత్యంత ఇష్టంగా చదివిన మొదటి నవల అదే. ఆ నవలలోని పాత్రలూ సన్నివేశాలూ ఇంకా గుర్తున్నాయి. ఆ నవల చదివి 'ప్రాక్సిమా సెంటారీ' అనే నక్షత్రం గురించి అప్పటి మా స్కూల్ టీచర్ సుజాత నాంపల్లి (కవయిత్రి) గారిని అడిగి తెలుసుకున్న జ్ఞాపకం ఇప్పటికీ మెదులుతుంది.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?


టీనేజ్ కథలు, నవలలు విరివిగా చదివే అలవాటుండేది. ఎప్పుడైతే కవితలు రాయడం మొదలయ్యిందో నన్ను నేను ఇంకాస్త సానబెట్టుకునే క్రమంలో, సమకాలీన కవులు కవిత్వాన్ని రాసే విధానాన్ని గమనిస్తూ, వస్తు ఎంపిక, శైలి, వాక్య నిర్మాణం ఇలాంటి వాటిపై అధ్యయనానికి ఉపయోగపడే పుస్తకాలను ఎక్కువగా చదువుతున్నాను.

ముస్లిం అస్తిత్వవాద కవిత్వపరంగా మీపై ఉన్న ప్రభావాలు ఏమిటి?

ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' కవితా సంపుటి నుంచి ఇటీవల స్కై బాబా సంపాదకత్వంలో వచ్చిన 'దర్ద్' సంకలనం వరకూ అనేక విపత్కర పరిస్థితుల్లోనూ అణచివేతపై తిరుగుబాటుగా రావాల్సిన మేరకు సాహిత్యం వచ్చిందనే భావిస్తున్నాను. నేను కవిత్వం రాసే ప్రారంభ దశలో ఈ ప్రభావం నాపై చాలా ఉండేది, ఆ స్ఫూర్తి తోనే 'నాపై ఎందుకీ కక్ష..?', 'బహిరంగ రహస్యం' లాంటి కవితల్ని రాయగలిగాను. ముస్లిం అమ్మలపై ప్రముఖ కవి అన్వర్ సంపాదకత్వంలో వచ్చిన 'అమ్మీజాన్' అనే ముస్లింవాద కవిత్వ సంకలనానికి ప్రేరణ నా కవిత 'అమ్మీజాన్' అని తెలిసినప్పుడు, ఆ విధంగా నేనూ ఎంతోకొంత ముస్లిం వాద కవిత్వంలో భాగమైనందుకు ఆనందంగా అనిపిస్తుంది. కానీ వివక్షను ఎండగడుతూ, పీడకుల్ని వ్యతిరేకించడ తోనే సమాజంలో సామరస్యాన్ని నెలకొల్పలేం అనే విషయం త్వరగానే అవగతమైంది. మతాల మధ్య సఖ్యత, మనుషుల మధ్య మమకారాలు చిగురించాలంటే భయాలు, అభద్రతను పక్కకునెట్టి, విద్వేషగాలులు ఎప్పుడూ లేనంత బలంగా వీస్తున్న ఈ తరుణంలోనూ అస్తిత్వాన్ని నిలుపుకుంటూనే, సమాజంలో సోదర భావాన్ని, లౌకికత్వాన్ని పెంచే దిశగా కలాలు కదలాల్సిన సందర్భమిది.

రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి ఇష్టపడ్డారు?

కవికుల గురువు కె. శివారెడ్డి సర్ రాసిన 'ode to love అను ప్రేమ గీతం' అనే కవితా సంపుటి అమితంగా ఆకట్టుకుంది. మన సుల్ని ప్రేమతో ఎలా జయించవచ్చో, భుజం మీద చెయ్యేసి పక్కనే నడుస్తూ బోధించినట్టనిపించిన గొప్ప సందేశాత్మక కవిత్వం. అలాగే ఈ మధ్య కాలంలో నాగిళ్ళ రమేష్ అన్న రాసిన 'నల్లకొడిసె వన్నెకాడు' అనే కవితా సంపుటి కూడా బాగా నచ్చింది. కనుమరుగవుతున్న పల్లె పదాలను, మట్టి మనుషులు మాట్లాడుకునే స్వచ్ఛమైన యాసను సజీవంగా ముందు తరాలకు అందించే ప్రయత్నం ఈ పుస్తకం ద్వారా జరిగింది.



ఏ తరహా కవిత్వం మీకు నచ్చుతుంది? మీరు ఎక్కువసార్లు చదువుకున్న కవిత్వ సంపుటి?

తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని సునిశితంగా పరిశీలిస్తూ, ప్రతిస్పందనగా తన భావోద్వేగాలను సృజనాత్మకంగా ప్రకటించే సందర్భంలో కవి రాసిన అక్షరాల్లో పాఠకుడు దృశ్యాన్ని చూడగలగడం ఒక గొప్ప అనుభూతి. అలాంటి కవిత్వానికి నేను త్వరగా ఆకర్షితుడినవుతాను. సరళమైన పదాల్లోనే లోలోపలి సంఘర్షణను తాత్వికంగా వ్యక్తపరిచే కవిత్వంతో పాటు, చూస్తున్న, అనుభవిస్తున్న జీవితాలను లయాత్మకంగా వర్ణించగలిగే కవిత్వం నాకు బాగా నచ్చుతుంది.


సుంకర గోపాలయ్య 'మా నాయిన పాట' పుస్తకాన్ని ఎక్కువసార్లు చదివిన జ్ఞాపకముంది.

మీరు తరచు మననం చేసుకునే కవిత్వ పంక్తులు?

ఈ ప్రశ్న చదివిన వెంటనే మదిలో మెదిలిన కవిత– అఫ్సర్ రాసిన 'అసమ్మతి వాచకం'. ఐదున్నరేళ్ళ క్రితం 'వివిధ'లో అచ్చయిన ఈ కవితను కట్ చేసి పేపర్ ముక్కను నా పర్సులో దాచుకున్నాను. కాస్త నిరుత్సాహంగా అనిపించిన ప్రతిసారీ ఈ కవితను తీసి చదువుకోవడం అలవాటు. ఐదు భాగాలుగా సాగే ఈ కవిత, జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా మొండిగా బతికి, విజయాన్ని సాధించాలనే కాంక్షను రేకెత్తిస్తుంది. కవితలోని ఈ వాక్యాలు తరచుగా గుర్తొస్తూ ఉంటాయి: "నడుస్తూ, నడుస్తూ పడిపో, దెబ్బ తగల్నే లేదని సంతోషిస్తూ కూర్చోకు, ఇంకాసింత దూరం నడిచి ఈసారి కచ్చితంగా దెబ్బ తగిలేట్టే పడిపో... పడిపోవడంలోని భయం అనేదొకటి ఉందే, దాని కళ్ళల్లోకి పది చూపుల బాణాలు వదులు."

(జాబేర్ పాషా తొలి కవితా సంపుటి 'అగరు ధూపం, ఊదు పొగ' ఇటీవల విడుదలైంది)

✆ 95730 43596





ప్రత్యేక అలంకారంలో అమ్మవారు, తెనాలి వైకుంఠపురంలో బారులు తీరిన భక్తులు



● పాలాభిషేకం



● పసుపుతో..



● కుంకుమతో..



● విభూదితో..



● అభిషేకాల అనంతరం కోటప్పకొండ త్రికోటేశ్వరుడు

భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి

● కోటప్పకొండలో భక్తుల కోలాహలం

● ఘనంగా స్వామివార్లకు అభిషేకాలు.. పూజలు

గుంటూరు(తూర్పు), తెనాలి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు ఆదివారం జిల్లావ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివార్లకు వివిధ రకాల అభిషేకాలు చేశారు. తొలిఏకాదశి సందర్భంగా శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు కొండకు వేలాదిగా తరలివచ్చి కోటయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. త్రికోటేశ్వరునికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. గుంటూరులోని పలు ఆలయాల్లో స్వామివార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. విష్ణు, లలితసహస్రనామ పారా యణాలు జరిగాయి. తెనాలి వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సంకీర్తన బృందాల మహిళలు స్వామివారిని కీర్తిస్తూ కీర్తనలు ఆలపించి భక్తులను అలరించారు.



నిండు కుండలా శ్రీశైలం జలాశయం

కృష్ణమ్మ పరవళ్లు

● రెండు రోజుల్లో నిండనున్న శ్రీశైలం

● సాగర్‌కు 56,674, శ్రీశైలానికి 1.34 లక్షల క్యూసెక్కులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నదీ పరివాహక ఎగువ రాష్ట్రాల్లో వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాజెక్టుల గేట్లను ఎత్తి దిగువనకు భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయం దిశగా వరద పోటెత్తుతోంది. డ్యాంకు 1.34 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో జలకళ సంతరించుకుంది. రెండు రోజుల్లో శ్రీశైలం గేట్లు తెరిచి నీటిని విడుదల చేసేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే నీటి మట్టం 879 అడుగులకు చేరింది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్ జలాశయానికి 67,399 క్యూసెక్కులు విడు దల చేస్తున్నారు. సాగర్‌కు ఆదివారం 56,674 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. సాగర్‌లో నీటి నిల్వ గంటగంటకు గణనీయంగా పెరుగుతోంది. వారం రోజుల్లో సాగర్ నీటి మట్టం 13 అడుగుల మేర పెరిగింది. సాగర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం 162 టీఎంసీలకు చేరింది. దీంతో సాగర్ కుడి కాల్వ అయకట్టులో పంటల సాగుకు అన్నదాతలు సమా యత్తమవుతున్నారు.

ఇంజనీరింగ్ ప్రవేశాలకు నోటిఫికేషన్

● నేటి నుంచి ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్లు

● 13 నుంచి 18 వరకు వెబ్ కౌన్సెలింగ్

గుంటూరు(విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు 7 నుంచి 16వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకుని కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 17 వరకు విద్యార్థులు అప్లోడ్ చేసిన సర్టిఫికెట్లు ఆన్‌లైన్లో పరిశీలన జరగనున్నది. 13 నుంచి 18వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ ఇచ్చుకునే అవకాశం ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు మార్చుకునే అవకాశాన్ని ఈ నెల 19వ తేదీకి కేటాయించారు. విద్యార్థులకు ఈ నెల 22న సీట్లు కేటాయిస్తారు. అనంతరం వారు 23న తమకు సీట్లు వచ్చిన కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని నోటిఫికేషన్లో అధికారులు స్పష్టం చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇది పరిస్థితి

ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఈ ఏడాది ఏపీఈఏపీ సెట్‌కు 33,063 మంది విద్యార్థులు హాజరయ్యారు. గత నెల 8న విడుద లైన ఫలితాల్లో 23,536 మంది అర్హత సాధించారు. సాం కేతిక విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని రెండు ప్రభుత్వ యూనివర్సిటీలు (ఏఎన్‌యూ, జేఎన్టీ యూ నరసరావుపేట), 34 ఇంజనీరింగ్ కళాశాలల్లో 32,240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 6,700 సీట్లు అదనంగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలల్లో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయా లేదా అని వేచి చూడాలి.

మత్తుతో యువత నిర్వీర్యం

● మార్పు తెచ్చేందుకు కార్యక్రమాలు

● గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికడతాం

● అవగాహన సదస్సులో ఈగల్ వింగ్ హెడ్, ఐజీ ఆకే రవికృష్ణ



ప్రసంగిస్తున్న ఈగల్ వింగ్ హెడ్ ఐజీ ఆకే రవికృష్ణ

గుంటూరు(తూర్పు), జూలై 6 (ఆంధ్రజ్యోతి): నల్లమందు, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలవుతు న్నారని ఈగల్ వింగ్ హెడ్, ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. 'డ్రగ్స్ నివారణ- యువతకు అవగాహన' అనే అంశం పై స్థానిక బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. మత్తులోనే ఎక్కువ నేరాలు జరుగుతున్నాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే వారు కూడా మత్తుకు బానిసలుగా మారడం దురదృష్టకర మ న్నారు. నిషేధిత మత్తు పదార్థాలను, మాదక ద్రవ్యాలను విని యోగించినా, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చ రించారు. మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు మాట్లాడుతూ ఈగల్ వింగ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మత్తుకు బానిస అవుతున్న వారిలో పురుషుల కన్నా మహిళలు అధికంగా ఉండటం దురదృష్టకరమన్నారు. పిల్లల ప్రవర్తన, అలవాట్లపై తల్లిదండ్రులు నిరంతరం గమనించాల న్నారు. మత్తు నుంచి బయటకు రావడం కష్టమని, దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించా రు. మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రవికృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఈగల్ పోలీస్ వింగ్ ఎస్పీ నగేష్‌బాబు, డీఎస్పీ అరవింద్, తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

32 చెరువులు రూ.92.29 కోట్లు

● అమృత్ 2.0 పథకం కింద నిధులు

● మునిసిపాలిటీల్లోని చెరువుల ఆధునికీకరణ ● టెండర్లకు ఆహ్వానం..

రెండు నెలల్లో పనులు !



నరసరావుపేటలో ఎంపిక చేసిన కత్తవ చెరువు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాల్లోని చెరువులకు మహర్దశ పట్టనుంది. భూగర్భ జలాలు పెంపునకు చెరువులను ఆధునికీకరించనున్నారు. అమృత్ 2.0 పథకం కింద ఈ పనులు చేపడుతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో 32 చెరువులను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రూ.92.29 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు టెండర్ల ప్రక్రియను పబ్లిక్ హెల్త్ శాఖ నిర్వహిస్తోంది. ఈ నెల 21న టెండర్ల ప్రక్రియ ముగియనుంది.

గుంటూరు కార్పొరేషన్ సహా మునిసిపాలిటీల్లో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. పూడికతో రూపురేఖలు కోల్పోయాయి. ఈ నేపథ్యంలో పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించడమే.. అమృత్ పథకం లక్ష్యం. దీని కోసం చెరువుల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే సర్వే చేయించి చెరువుల హద్దులను నిర్ణయించారు. అలాగే ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించేందుకు చర్యలు చేపడుతు న్నారు. పల్నాడు జిల్లాలో 13 చెరువులను రూ.32.72 కోట్లు, గుంటూరు జిల్లాలో కార్పొరేషన్ సహా 12 చెరువులు రూ.45.38 కోట్లు, బాపట్ల జిల్లాలో7 చెరువులను రూ.14.10 కోట్ల వ్యవయంతో అభివృద్ధి చేయనున్నారు.

అభివృద్ధి ఇలా..

ఆధునికీకరణకు ఎంపిక చేసిన చెరువులకు హద్దులు నిర్ణయిస్తారు. చెరువుల స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తారు. పూడిక తీసి, కట్టల ను పటిష్ట పరుస్తారు. రాతితో రిటైనింగ్ వాల్ నిర్మిస్తారు. కట్టలపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, చెరువు వైపు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారు. పౌరులు నడిచేందుకు వీలుగా కట్టలను అభివృద్ధి చేస్తారు. సంబంధిత పనుల టెండర్ ఈ నెల 21న ముగియనుంది. రెండు నెలల వ్యవధిలో పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

నిధుల మంజూరు ఇలా..

మునిసిపాల్టీ	చెరువులు	నిధులు
పల్నాడు జిల్లా :		రూ కోట్లలో
● నరసరావుపేట	1	5.60
● చిలకలూరిపేట	5	3.68
● మాచర్ల	1	6.60
● పిడుగురాళ్ల	1	11.52
● సత్తెనపల్లి	1	0.72
● దాచేపల్లి	2	2.50
● గురజాల	2	2.10
గుంటూరు జిల్లా :		
● గుంటూరు	2	17.80
● మంగళగిరి, తాడేపల్లి	7	11.70
● పొన్నూరు	1	3.04
● తెనాలి	2	10.34
బాపట్ల జిల్లా :		
● చీరాల	2	3.05
● బాపట్ల	1	1.94
● రేపల్లె	3	4.10
● అద్దంకి	1	5.10

సమన్వయంతో ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలి

● శంకర్ విలాస్ ఆర్వోబీ పనుల పరిశీలనలో ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన సమాచార వ్యవస్థ, సమన్వయంతో ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని ఎస్పీ సతీష్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. శంకర్ విలాస్ బ్రిడ్జి వద్ద బ్రాడీపేట వైపు, కంకరగుంట రైల్వే అండర్ బ్రిడ్జి, మూడు వంతెనలు, కొత్తపేట శివాలయం వద్ద ట్రాఫిక్ మళ్లింపులను ఆదివారం ఎస్పీ పరిశీలించారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో



శంకర్‌విలాస్ సెంటర్‌లో బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల మళ్లింపునకు ప్రత్యామ్నాయ మార్గాలను చూసి వాటిలోకి వాహనాలను దారి మళ్లించాలని పోలీసులకు పలు సూచనలు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే రహదారులు, ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ మళ్లింపుల వద్ద తగినంత మంది ట్రాఫిక్ సిబ్బందిని కేటాయించి ప్రణాళికబద్ధంగా ట్రాఫిక్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వర్షం వచ్చినప్పుడు కంకరగుంట ఆర్‌యూబీ, మూడు వంతెనల మార్గాల్లో రాకపోకలు కష్టంగా ఉంటున్నాయని ట్రాఫిక్ పోలీసులు ఎస్పీ దృష్టికి తీసుకు వెళ్లారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో చర్చించి, మరోసారి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ప్రజలు, వాహనదారులు కూడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, అరవింద్, సీఐలు అలహరి శ్రీనివాస్, అశోక్, సింగయ్య, నజీర్‌బేగ్, ఆరోగ్యరాజు, ట్రాఫిక్ ఎస్ఐలు రవీంద్రబాబు, సాంబ శివరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు.. కొర్రీలు

● పొగాకు కేంద్రాల్లో మందకొడిగా సేకరణ

● నాలుగు జిల్లాల్లో 1952.50 ఎంటీల కొనుగోళ్లు

● ప్రభుత్వం రూ.270 కోట్లు విడుదల చేసినా పెరగని వేగం

● తేమ శాతం అధికంగా ఉందని ధరలో కోతతో రైతుల్లో ఆగ్రహం

● మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నత స్థాయిలో సమీక్షించాలని కోరుతున్న రైతులు

గుంటూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కొనుగోళ్లలో ఉదారంగా ఉండాలి.. నిధులకు ఇబ్బంది లేదు.. రైతులు ఎక్కడా నష్టపోకూడదు. సాగుదారులందరూ సంతృప్తి చెందాలి.. అని ప్రభుత్వం పొగాకు కొనుగోళ్లకు సంబంధించి ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వం సూచించినట్లుగా.. రైతులు ఆశించినంతగా బర్లీ పొగాకు కొనుగోళ్లు జరగడంలేదు. పొగాకు సేకరిస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్, ఏఎంసీలు, డీసీఎంఎస్‌ల సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం లేదు. ఎక్కడికక్కడ కొర్రీలతో సక్రమంగా కొనుగోళ్లు చేపట్టడం లేదు. ఈ కారణంగానే దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్న చందంగా బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాలో పొగాకు కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు తెరిచి ప్రాంతాన్ని బట్టి 20 నుంచి నెల రోజులు కావొస్తున్నా ఇంకా 10 శాతం కొనుగోళ్లు మా త్రమే జరిగాయి. ఏఎంసీ చిలకలూరిపేటలో చాలా తక్కువగా 73.22 మెట్రిక్ టన్నుల పొగాకు మాత్రమే ఇప్పటివరకు కొనుగోలు జరిగింది. ఇదే విధంగా ఏఎంసీ పంగులూరు, ఎస్‌డబ్ల్యూసీ పర్చూరులోనూ కొనుగోళ్ల వేగం పెరగడం లేదు. నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు కేవలం 21,367 బేళ్లు తీసుకురాగా 1952.50 మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలు (మిగతా 6వ పేజీలో)



పర్చూరు మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం

సంక్షేమానికి.. నిబంధనలు

● నిబంధనలతో అనర్హులుగా లబ్ధిదారులు

● పలు పథకాలు కోల్పోయి బాధితులు గగ్గోలు

● అమలుకు నోచుకోని 'షరతులు లేని సంక్షేమం' హామీ

● కొనసాగుతోన్న గత వైసీపీ ప్రభుత్వ సిక్స్‌స్టెప్ వడపోత

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు మించి ఆస్తి ఉందని.. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని.. కుటుంబంలో ఉద్యోగులు ఉన్నారని.. గతంలో ఎప్పుడో ఐటీ దాఖలు చేశారని.. ఇలా రకరకాల కారణాలతో సంక్షేమ పథకాలకు పలువురు దూరమయ్యారు. ఉండేందుకు ఇల్లు లేకపోయినా అధికారుల తప్పుగా వివరాల నమోదుతో మరికొందరు ఇటీవల తల్లికి వందనం అందుకోలేకపోయారు. గుంటూరులో ఓ కుటుంబానికి నివాసం ఉండేందుకు సరైన ఇల్లు లేకపోయినా వారి పేరుతో 15 విద్యుత్ మీటర్లు ఉన్నాయని తల్లికి వందనం పథకానికి అనర్హులు చేశారు. ఇదే పరిస్థితి గత వైసీపీ ప్రభుత్వంలో కొనసాగింది. సిక్స్‌స్టెప్ వడపోత పేరుతో పలువురు పథకాలకు దూరమయ్యారు. ఈ పరిస్థితుల్లో కూటమి నేతలు చెప్పినట్లుగా షరతులు లేని సంక్షేమం అమలు కాలేదు. లబ్ధిదారులు సంక్షేమ పథకాలు వస్తాయని ఆశించిన వారు ఇటీవల విడుదలైన తల్లికి వందనం అందుకోలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఈ ప్రభుత్వంలో కూడా వడపోత, ఏరివేత కార్యక్రమం కొనసాగుతుండడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల భారాన్ని తగ్గించుకోవడానికి నిబంధనల వడపోతకు శ్రీకారం చుట్టి పలువుర్ని అనర్హులను చేసింది. ప్రత్యేకించి ప్రత్యర్థి పార్టీలకు చెందిన కార్యకర్తలే టార్గెట్‌గా అప్పటి అధికార పక్షం ఈ విధానాలను అమలు చేసింది. దీంతో వారంతా కూటమి ప్రభుత్వం రాకకోసం ఎంతగానో ఎదురు చూశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అలాంటివారికి ఏమాత్రం ఊరట లభించలేదు. గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో హడావుడి చేసి ఆ తర్వాత సంక్షేమ పథకాల భారాన్ని తగ్గించుకునేందుకు సిక్స్‌స్టెప్ వెరిఫికేషన్‌ను అమలు చేసింది. దీంతో ఎందరో సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. దీంతో ఆ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురి కావాల్సి వచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం కూడా అవే విధానాలను ఇప్పుడు కొనసాగించడం విశేషం. ఎన్నికల ప్రచారంలో షరతులు లేని సంక్షేమాన్ని అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ ఇచ్చిన మాట పక్కకు పెట్టి గత వైసీపీ ప్రభుత్వం చేపట్టినట్లుగానే నిబంధనలు అమలు చేస్తుండటంతో కూటమి శ్రేణుల్లోనూ ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. షరతులు లేని సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నీళ్లు వదలడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

తప్పులు సరి చేయకుండానే..

గత వైసీపీ ప్రభుత్వ బాధితుల్లో ప్రధానంగా పింఛన్లు, తల్లికి వందనం కోల్పోయి నవారే ఎక్కువగా ఉన్నారు. వారంతా కూటమి ప్రభుత్వంలో మేలు జరుగుతుందని ఆశించారు. గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తుంది.. పథకాలు అందుతాయని ఎదురుచూశారు. కానీ కూటమి ప్రభుత్వం వాటిని సరిదిద్దకపోగా, కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించలేదు. పైగా అవే విధానాలను కొనసాగిస్తోంది. త్వరలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయనున్న నేపథ్యంలో తమకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చూడాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.



రాజకీయ లబ్ధి కోసమే

వైసీపీ తప్పుడు ఆరోపణలు

● యాదృచ్ఛిక ఘటనను మాపై రుద్దాలని కుట్రలు

● నాగమల్లేశ్వరరావు చనిపోవాలని కోరుకుంటున్న వైసీపీ

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

ఉగ్రవాదుల చెరలో మాచర్ల వాసి

● మాలిలో ముగ్గురు భారతీయుల కిడ్నాప్

విచారణకు హాజరైన వైసీపీ నేతలు

6

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయాల ద్వారా ప్రతిపాదనలను ఈ నెల 13లోగా పంపాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం నేషనల్ అవార్డ్ టు టీచర్స్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఎరువుల కొరత రానివ్వొద్దు

● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు నేపథ్యంలో జిల్లాలో రైతులకు ఎక్కడా ఎరువుల కొరత రానివ్వకుండా చూసుకోవాలని గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు సూచించారు. గుంటూరు కోర్టు రోడ్డులోనున్న డీసీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ హరిబాబు, పక్కన బీఎం హరిగోపాలం

జిల్లా బ్రాంచ్‌ల ఇన్‌చార్జ్‌లు, ఉద్యోగులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని రైతులకు సకా లంలో ఎరువులు అందజేస్తూ ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితు ల్లోనూ సొసైటీ నిర్వహించే వ్యాపారాల్లో అవినీతిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గత దారిలో ఎవరైనా.. ఉంటే వెంటనే ప్రవర్తన మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్రాంచ్‌లలో ఖచ్చితంగా పురోగతి రావాలని ఆదేశించారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ఉండబోతుందన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాలం, ఇస్కో జిల్లా మేనేజర్ రఘు సురేంద్ర, మేనేజర్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

రైస్ మిల్లుపై దాడి.. పీడీఎస్ బియ్యం గుర్తింపు



పట్టుబడిన పీడీఎస్ రైస్ నిల్వల వద్ద డీఎస్పీ భానూదయ, తహసీల్దార్ క్షమారాణి, సీఐ రమా నాయక్ తదితరులు

వట్టిచెరుకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అనంతవరప్పాడు గ్రామంలోని శ్రీవల్లి రైస్ మిల్లులో భారీ ఎత్తున పీడీఎస్ నిల్వలు ఉన్నట్లు ఆదివారం అధికారులు గుర్తించారు. అద్దె ప్రాతిపదికన గుంటూరుకు చెందిన వ్యక్తులు ఈ మిల్లును నిర్వహిస్తున్నారు. మిల్లుకు గుంటూరు నుంచి పెద్దఎత్తున పీడీఎస్ బియ్యం చేరినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌కు సమాచారం అందడంతో.. సౌత్ జోన్ డీఎస్పీ భానూదయ అప్రమత్తమయ్యారు. ఆమె మఫ్టీలో మిల్లు ఆవరణలోకి చేరుకొని వట్టిచెరుకూరు సీఐ రమానాయక్, తహసీల్దార్ క్షమారాణి, సీఎస్ డీటీ శివ శంకర్‌కు సమాచారం అందించారు. అనంతరం మిల్లులో ఉన్న బియ్యం నిల్వలను అధికారులు పరిశీలించారు. పీడీఎస్ బియ్యం భారీగా ఉన్నట్లు గుర్తించారు. 70 టన్నులకు పైగా నిల్వలు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి వివరాలను సోమవారం వెల్లడిస్తామని తహసీల్దార్ క్షమారాణి, సీఎస్ డీటీ శివశంకర్ వెల్లడించారు.

రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ తప్పుడు ఆరోపణలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

- యాదృచ్ఛిక ఘటనను మాపై రుద్దాలని కుట్రలు
- నాగమల్లేశ్వరరావు చనిపోవాలని కోరుకుంటున్న వైసీపీ
- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గం మన్నవ గ్రామంలో జరిగిన యాదృచ్ఛికమైన, ఊహించని ఘటనను అడ్డం పెట్టుకొని రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. నాగమల్లేశ్వరరావుపై దాడి జరిగిన టీ స్టాల్ ప్రదేశం వైసీపీకి చెందిన వారిదేనన్నారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన ఐదుగురు కార్యకర్తలు ఘటనా స్థలంలో ఎందుకు ఉన్నారో పోలీసులు దర్యాప్తు చేయాలన్నారు. సీసీ టీవీ పుటేజీలో గొల్ల చౌదరితో పాటు మరో ఇద్దరు కూడా కనిపిస్తున్నారని చెప్పారు. ఈ ఘటనలో వాస్తవాలను దాచిపెట్టి కేవలం టీడీపీకి చెందిన వారే ఉన్నారని పోలీసులకు సమాచారం ఎవరిచ్చారని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఘటన జరిగాక అంబులెన్స్‌ను కాదని ఆటోలో.. వైసీపీ నాయకురాలు ఆసుపత్రికి ఎందుకు తీసుకువెళ్లారన్నారు. వైసీపీ నాయకులు నీచస్థాయికి దిగజారుతున్నారనేదానికి ఈ ఘటనే ఉదాహరణ అని పేర్కొన్నారు. అంబటి సోదరులతో పాటు, వైసీపీలోని పలువురు నేతల ఆరోపణలు చూస్తే ఏదో విధంగా టీడీపీ నేతలను ఈ ఘటనలో ఇరికించాలని, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలన్న కుట్ర కనిపిస్తోందన్నారు. 25 ఏళ్ల శాసనసభ సభ్యుడిగా తన ప్రయాణంలో పొన్నూరు నియోజకవర్గంలో రాజకీయ కక్షలు తగ్గిపోయాయని, వైసీపీ ఎమ్మెల్యే గెలిచిన నాటి నుంచి అరాచకాలు పెరిగిపోయాయన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ అక్రమాలకు ఎదురు నిలిచినందుకు టీడీపీ నేత బండ్లమూడి బాబురావు కుటుంబంపై 9 కేసులు, అదే మన్నవ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలపై 20 కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అప్పిరెడ్డి, అంబటి రాంబాబు, అంబటి మురళి వంటి మేధావులంతా... కలిసి చికిత్స పొందుతున్న నాగమల్లేశ్వరరావుకు మెరుగైన వైద్యం అందకుండా చేసి, అతను చనిపోయేలా చేయడం ద్వారా అల్లర్లు సృష్టించాలన్న కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో దాసరి రాజా మాస్టారు, కసుకుర్తి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, బొల్లెద్దుల సుశీలరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల చెరలో మాచర్ల వాసి

- మాలిలో ముగ్గురు భారతీయుల కిడ్నాప్
- బాధితుల్లో ఒకరు ఏపీకి చెందిన అమరలింగేశ్వరరావు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి
- తామే కిడ్నాప్ చేశామని ప్రకటించిన జేఏఎన్ఐఎం

మాచర్లటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో ఉగ్రవాదులు పంజా విసిరారు. అక్కడ డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ముగ్గురు భారతీయులను అపహరించారు. వారిలో పల్నాడు జిల్లాలోని మాచర్ల మండలం, జమ్మలమడక గ్రామానికి చెందిన కూరాకుల అమరలింగేశ్వరరావు ఉన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లో నివసిస్తున్న ఆయన కుటుంబం అమరలింగేశ్వరరావును సురక్షితంగా విడిపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ విషయంపై కిషన్ రెడ్డి తక్షణమే స్పందించి.. మాలిలోని భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడారు. బాధితులను విడిపించేందుకు వేగంగా చర్యలు చేపట్టాలని కేంద్ర విదేశాంగ శాఖకు లేఖ కూడా రాశారు. అమరలింగేశ్వరరావు 11 ఏళ్లుగా మాలిలోని డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. హైదరాబాద్ కొండాపూరులోని ప్రసాదిత్య కంపెనీ ద్వారా ఆయన అక్కడకు వెళ్లారు. అతనితో పాటు కిడ్నాప్‌కు గురైన వారిలో ఒడిశాకు చెందిన పి.వెంకటరమణ, రాజస్థాన్‌కు చెందిన ప్రసాద్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల ఒకటిన బైకులపై వచ్చిన సాయుధ మిలిటెంట్లు సిమెంట్ ఫ్యాక్టరీలోకి చొరబడి ముగ్గురిని అపహరించుకుపోయారు. ఈ కిడ్నాప్ వెనుక తమ హస్తముందని ఆల్‌ఖైదా అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్ ఇస్లాం వాల్ ముస్లిమిన్ (జేఏఎన్ఐఎం) ప్రకటించింది. ఈ ఘటన జరిగి ఆరు రోజులు గడిచినా ఉగ్రవాదుల నుంచి ఎలాంటి డిమాండ్‌లు రాలేదు. ఒడిశాకు చెందిన వెంకటరమణను కాపాడాలని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. తమ కుమారుడిని సురక్షితంగా రక్షించి స్వదేశానికి తీసుకురావాలని అమరలింగేశ్వరరావు తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి భారత ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు. కాగా, మాచర్ల రూరల్ పోలీసులు వారిని కలిసి తాజా పరిణామాలను విచారించారు.



అమరలింగేశ్వరరావు తల్లిదండ్రుల నుంచి సమాచారం సేకరిస్తున్న మాచర్ల పోలీసు

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.17.09 కోట్లు చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమీక్షించాలని రైతులు కోరుతున్నారు.

రైతులపై భారం..

ప్రభుత్వం రూ.270 కోట్లు విడుదల చేసినా ప్రొక్యూర్‌మెంట్ వ్యవస్థలు స్పీడు పెంచడంలేదు. బర్లీ పొగాకు సాగు చేసి కొనుగోళ్లు జరగక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సాయం కోరింది. కేంద్రం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. దేశంలో ఎక్కడా ఎప్పుడూ లేనట్లుగా రాష్ట్ర ప్రభుత్వమే గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి పొగాకు కొనుగోళ్లు చేపట్టింది. మొత్తం 11 కేంద్రాలను ఏర్పాటు చేసి పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఏ తేదీన సరుకు తీసుకురావాలనే దానిపై అధికారులు షెడ్యూల్ ఇచ్చారు. సాంకేతిక కారణాలతో పొగాకు కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా ప్రాసెసింగ్ జరగడం లేదు. 20 శాతం వరకు తేమని అనుమతిస్తామని అధికారులు చెప్పారు. అయితే ఏ రైతు పొగాకు తీసుకొచ్చినా తేమ శాతం అధికంగా ఉందని ధరలో కోత పెడుతున్నారు. హైక్వాలిటీకి క్వింటాల్ రూ.12 వేలు, మీడియం క్వాలిటీకి రూ.9 వేలు, లోగ్రేడ్ రకానికి రూ.6 వేలు చెల్లిస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. ఇప్పుడు రైతులు మీడియం క్వాలిటీలు తీసుకొస్తున్నా లోగ్రేడ్‌గా ముద్ర వేస్తున్నారు. కాగా పెదనందిపాడు పరిసర ప్రాంతాల్లో రైతులు దాదాపుగా 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరులోని సీడబ్ల్యూసీ గోడౌన్‌కు తీసుకురావడానికి వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తున్నది. దీని వల్ల రవాణా చార్జీలు పెరిగిపోతున్నాయి. నిబంధనల ప్రకారం అన్‌లోడింగ్ చార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. అయినప్పటికీ బేలుకు రూ.130 రూ.160 వరకు వసూలు చేస్తున్నారు. ఇందుకు అధికారులు ఎలాంటి అడ్డు చెప్పడం లేదు. ఈ కారణంగానే ఈ వా రంలో రైతులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుని రెండుసార్లు ప్రశ్నించారు. పొగాకు రైతులు అధికసంఖ్యలో ఉన్న పెద నందిపాడులో కూడా మరో కేంద్రం ఏర్పాటు చేయాలని సాగుదారులు కోరుతున్నారు.

ఇప్పటి వరకు కొనుగోళ్లు ఇలా...

జిల్లా	సెంటర్	బేళ్ల సంఖ్య	కొనుగోళ్లు (టన్నుల్లో)	చెల్లింపు (రూ.లలో)
బాపట్ల	ఇంకొల్లు	1083	100.229	98,58,150
,,	పంగులూరు	613	52.31	47,14,890
,,	పర్చూరు	3863	368.11	3,60,17,250
,,	బీకేపాలెం	1295	136.22	1,33,90,110
,,	చీరాల	29012	281	2,27,39,430
,,	పర్చూరు	786	75.78	68,86,590
గుంటూరు	గుంటూరు	2747	260.96	2,15,54,064
,,	పెదకాకాని	1515	132.88	98,74,350
పల్నాడు	చిలకలూరిపేట	817	73.22	59,05,620
,,	యడ్లపాడు	2443	205.04	1,68,50,070
ప్రకాశం	గుండ్లపల్లి	3303	266.7624	2,31,26,496

నూతన ఒరవడితో రంగస్థలాన్ని తీర్చిదిద్దాలి

❖ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అధునిక సమాజంలో ఆదరణ తగ్గుతున్న రంగస్థలాన్ని నూతన ఒరవడితో తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలను ఆదివారం రెండవ రోజు జ్యోతి ప్రజ్వలన గావించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ.. కళాకారులకు నిలయమైన తెనాలిలో రంగస్థలా న్ని ఆదరిస్తూ ప్రోత్సహిస్తున్న వారు ఎంతో మంది ఉన్నారన్నారు. కొత్తతరం రంగస్థలం పట్ల ఆసక్తి చూపేలా మార్పులు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు ప్రదర్శించిన అనుకున్నదొక్కటి అయినదొక్కటి నాటిక సరదాగా సాగింది. పెళ్లైన వారికే ఇల్లు అద్దెకు ఇస్తామని చెప్పిన వారిని నమ్మించి.. అద్దెకు దిగిన బ్యాచ్‌లర్ పడిన తంటాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా పేదల స్థితిగతులు మారకపోవడం ఇతివృత్తంగా సాగిన నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. విజయవాడ న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. విశాఖపట్నం చైతన్య కళా స్రవంతి కళాకారులు అసత్యం నాటిక మంచి సందేశమిచ్చింది. రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నాటిక పోటీల్లో సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, కాకతీయ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, ఈదర వెంకటపూర్ణచంద్, న్యాయవాది జగదీశ్వరాంబ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి నాటికలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

విద్యార్థుల భవిష్యత్తుపై సెల్‌ఫోన్ ప్రభావం

◆ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

తెనాలి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తుపై సెల్‌ఫోన్ తీవ్ర ప్రభావం చూపుతోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెనాలి ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. పాఠశాలల్లో సెల్‌ఫోన్ లేని విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల బోధనపై కూడా సెల్‌ఫోన్ ప్రభావం పడుతుందని, రోజువారీ యాప్‌లు, సమాచారాల నివేదన, శిక్షకులతో సమయం సరిపోతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకంతో పంపించే విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలని పేర్కొన్నారు. ప్రచురణ విభాగం చైర్మన్ హనుమంతరావు మాట్లాడుతూ పీటీఎం నిర్వహణలో ఫిట్‌నెస్ అధికారి ఆదేశాలు ఉపసంహరించుకోవాలన్నారు. ఆడిట్ కన్వీనర్ మల్లేశ్వరరావు, కళాదర్, దౌలా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.విచారణకు హాజరైన వైసీపీ నేతలు

విచారణకు హాజరైన వైసీపీ నేతలు

సత్తెనపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెంటపాళ్ళ పర్యటన సందర్భంగా సత్తెనపల్లి రూరల్, పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించి పోలీసులు 113 మంది వైసీపీ నేతలకు ఆదివారం 41ఏ నోటీసులు అందించారు. జగన్ పర్యటన సందర్భంగా ర్యాలీ, డీజే సౌండ్ ఏర్పాటు చేసి ప్రజలకు, పాఠశాలలకు, ఆస్పత్రులకు ఇబ్బంది కలిగించిన అంశంలో జూన్ 19న పోలీసులు కేసులు నమోదు చేశారు. మాజీ మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, దేవినేని అవినాష్, గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి తదితరులు నిందితులుగా ఉన్నారు. నోటీసులు అందుకున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, అన్నాబత్తుని శివ కుమార్, డాక్టర్ గోపిరెడ్డి, తలశిల రఘురామ్ తదితరులు పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్‌లకు హాజరై తమ వివరణ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఫిరంగిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరికపూడి వద్ద రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీను(45) గ్రామంలోని ఈతరం పబ్లిక్ స్కూల్ బస్సుకు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం మేరికపూడి దర్గా వద్ద మొహర్రం వేడుకల కోసం శ్రీను మరో ముగ్గురు కలసి ఆటోలో వచ్చారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను.. మేరికపూడి వద్ద నరసరావుపేట వైపు నుంచి వస్తున్న దోస్త్ వ్యాన్ డ్రైవర్ ముందు వెళ్తున్న బస్సును ఓవర్ టేక్ చేయబోయి ఢీకొట్టాడు. ఆటో బోల్తా కొట్టడంతో.. దానిని నడుపుతున్న డ్రైవర్‌కు, దాసరి శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనును వేరే ఆటోలో చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. డాక్టర్ పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె ఉన్నారు.

కల్లుగీత కార్మికుడి మృతి

నిజాంపట్నం(రేపల్లె) జూలై 6(ఆంధ్రజ్యోతి): తాడిచెట్టుపై కల్లు గీస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గీత కార్మికుడు కారం కి పూర్ణ చంద్రరావు(56) మృతి చెందాడు. కొమరవోలు గ్రామానికి చెందిన మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కుమా ర్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

నేడు డయల్ యువర్ కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీఎంసీ విభాగాధిపతులతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

వృద్ధులకు పెన్షన్లు పంపిణీ

గుంటూరు (విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి): అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఆవోపా అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కోట సురేష్ కుమార్, చార్టెర్డ్ అకౌంటెంట్ తూనుగుంట్ల అప్పారావు పాల్గొన్నారు. డాక్టర్ కోటా సురేష్ కుమార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో వచ్చే మానసిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, మిరియాల మోహన్, కాళంగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

13న హిందీ సినీ గీతాల విభావరి

గుంటూరు(తూర్పు), జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఆర్కెస్ట్రా వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న పాత హిందీ సినీ గీతాల విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.రామచంద్ర రాజు, అమ్మ పండు తెలిపారు. స్థానిక భారతీయ విద్యా భవన్ ప్రాంగణంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాడుతా తీయగా ఫెమ్ సింగర్ లలితా పాల్గొని గీతాలు ఆలపిస్తారన్నారు. ఉచిత ఎంట్రీ పాసుల కొరకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం కార్యాలయంలో గాని, బ్రాడీపేట గీతాంజలి ఆర్కెస్ట్రా కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 98489 65751లో సంప్రదించాలని సూచించారు.

మౌనం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), జూలై 6(ఆంధ్రజ్యోతి): గాజా కోసం మౌనం పేరిట ప్రపంచ వ్యాప్తంగా ఇచ్చిన నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి కోరారు. బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి 9 గంటల నుంచి 9.30 గంటల వరకు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి సంఘీభావం తెలపాలని కోరారు. అంతర్జాతీయ సమాజం ఈ రకమైన టెక్నికల్ బంద్‌కి పిలుపు నివ్వడం జరిగిందని చెప్పారు.

వాసవి క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), జూలై 6 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు పింఛన్, పేదలకు బియ్యం పంపిణీతో పాటు ఇతర సామాజిక సేవలు నిర్వహిస్తున్న వాసవి క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ కొనియాడారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ఎన్టీఆర్ జిల్లా, వేదాద్రిలోని శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. వాసవిక్లబ్ అధ్యక్షుడు రాయవరపు అశోక్ కుమార్ మాట్లాడుతూ దాదాపు 5 వేల మందికి అన్న ప్రసాదాన్ని అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దేవరశెట్టి చిన్ని, పారేపల్లి చెన్నకేశవ బాబ్జి, దొరెడ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంపునకు కృషి : డీఈవో

గుంటూరు (విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు సీఆర్పీలు ఉపాధ్యాయులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు డీఈఓ సీవీ రేణుక ఆదివారం ఒక ప్రకటన తెలిపారు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 170 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్‌పై ఆమె వివరణ ఇచ్చారు. అనేక పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్‌లో తప్పుల కారణంగా యు డేస్‌లో నమోదు కాలేదని, ఫలితంగా అడ్మిషన్లలో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉందన్నారు. అనేకమంది విద్యార్థినీ, విద్యార్థులు ఒకటో తరగతిలో చేరారని వారికి విద్యా కిట్లు అందజేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో కొరతను మెగా డీఎస్సీ ద్వారా తీరుస్తామన్నారు.

రొట్టెల పండుగకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో బారా షహీద్ దర్గాలో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు జరిగే రొట్టెల పండుగకు ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ప్రతి ఏటా రొట్టెల పండుగకు గుంటూరు నుంచి భక్తులు తరలివెళుతున్నారని, ఈ దఫా కూడా భక్తుల రద్దీని బట్టి ఏర్పాటు చేస్తామన్నారు. గుంటూరు నుంచి తిరుపతికి ఆరు సర్వీసుల వరకు వెళుతున్నాయని, ఆయా సర్వీసులతో పాటు భక్తుల రద్దీ ఉంటే అదనపు సర్వీసులు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కీళ్ళవాతంపై అవగాహన కలిగి ఉండాలి

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): అన్ని రకాల వయసుల వారిలో వస్తోన్న కీళ్ళవాతంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ యలవర్తి రాకేష్ కిరణ్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరాం,వివి రావు,టి సుబ్బారావు, ఏవి రామారావు, బషీర్, జునాయిడ్ బాషా తదితరులున్నారు.

కూటమి పాలనలో ప్రతి ఇంటా సంతోషమే


● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుంటూరులోని పదో డివిజన్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. గత ఐదేళ్లలో తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నామని, అభివృద్ధి అనేది ఆమడ దూరంలో నిలిచిపోయిందని తెలిపారు. ఏడాది కాలంలోనే మా ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, సంక్షేమ పథకాలు చక్కగా అందుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యేకి వివరించారు. పాఠశాల విద్యార్థులను పలకరించి, పుస్తకాలు అందించారా? మీకు తల్లికి వందనం డబ్బులు పడిన విషయం తెలుసా అని వారిని అడిగి తెలుసుకున్నారు. తమకు కొత్త పుస్తకాలు బ్యాగులు ఇచ్చారంటూ పిల్లలు ఎమ్మెల్యేకి ఆనందంగా తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పింఛన్ల పెంపు, తల్లికి వందనం వంటి పథకాలే కాకుండా రాబోయే రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అందించబోతున్నామని, వచ్చే నెలలో రేషన్ కార్డులు పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గాలి సతీష్ బాబు, రియాజ్, జమీర్, గౌస్, దుర్గాప్రసాద్, హేమంత్ గుప్తా, వెంకటేశ్వరరావు, కిరణ్,సత్యనారాయణ, రమేష్, రామ బ్రహ్మం, రబ్బానీ, అస్గర్, ఆఖని, శేఖర్ బాబు, బాబు, నాగ మల్లిక, గోపి కృష్ణ, ఆరీఫ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే నసీర్

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పండుగ



బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

గుంటూరు(తూర్పు), జూలై 6(ఆంధ్రజ్యోతి): నగరంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో మూల విరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు అందుకున్నారు. పలు దేవాలయాల్లో విష్ణు సహస్రనామ పారాయణ, లలిత సహస్రనామ పారాయణం జరిగింది. దేవాలయాల వద్ద పేదలకు అన్నదాన వితరణ జరిగింది. పూజలలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు స్వామి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమాలను పాలకవర్గ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శ్రీ రామలింగేశ్వరస్వామికి తొలి ఏకాదశి అభిషేకాలంకరణ

స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వరస్వామికి అభిషేకార్చనలు, అమ్మవారికి శాకాంబరీ అలంకారం, విశేష పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ పర్వతవర్ధిని, శ్రీ విద్యా సరస్వతి అమ్మవార్లను కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాల్ని మెట్టు కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

వైకుంఠ శ్రీనివాసమూర్తి దేవాలయంలో...

గుంటూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్థానిక శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులోని వైకుంఠ శ్రీనివాసమూర్తి ఆలయ ప్రాంగణంలో వైభవంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదివారం వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో కొలువైవున్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని అర్చనలు చేయించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు నిమ్మల రమణ, తోట రామకృష్ణ, సెంట్రింగ్ బాబు పాల్గొన్నారు.

విద్య ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి సాధ్యం

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు నూతలపాటి

గుంటూరు విద్య, జూలై 6 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ వారసులుగా ఉన్న విశ్వబ్రాహ్మణులు విద్యతో అభివృద్ధిలో ముందడుగు వేయాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, రావూరి భరద్వాజ అవార్డు గ్రహీత నూతలపాటి నాగేశ్వరరావు అన్నారు. శ్రీ విశ్వకర్మ పేద విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. వ్యవస్థాపకులు గోనుగుంట శేషగిరిరావు మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వేదోపాధ్యాయుడు ఆలూరి సుబ్రహ్మణ్య శర్మ, ప్రముఖ చిత్రకారుడు పాములపాటి శివరామకృష్ణలను గౌరవ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్నాల శివప్రసాద్, ఉపాధ్యక్షుడు కందేపు వెంకట్రావు, కార్యదర్శి కట్టెవరపు కృష్ణారావు, కోశాధికారి చిర్రావూరి సుధీర్ బాబు, సీహెచ్ వసంతరావు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు యలమర్తి ధర్మారావు, గన్నే వాసుదేవరావు, పూసపాటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పౌర నిఘాతోనే నగర సమస్యల పరిష్కారం



సమావేశంలో ప్రసంగిస్తున్న నారాయణరెడ్డి

గుంటూరు కార్పొరేషన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం ఎదుర్కొంటున్న తాగునీటి, పారిశుధ్య సమస్యలకు పరిష్కారం పౌర నిఘాతోనే సాధ్యమని ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ది గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశం సామాజిక విశ్లేషకులు టి. ధనుంజయ రెడ్డి అధ్యక్షతన జరిగింది. నారాయణరెడ్డి ప్రసంగిస్తూ పది సంవత్సరాలుగా నగరంలో గల 62 మంచినీటి ట్యాంకులను నిశితంగా పరిశీలించి ట్యాంకులలో పేరుకుపోయిన మురికిని తొలగించడంలో రేట్ పేయర్స్ అసోసియేషన్ విశేష కృషి చేసిందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నగర ప్రజలకు టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచి ఫిర్యాదులు స్వీకరించి, సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించాలన్నారు. మానవత కార్యదర్శి కె.సతీష్ బాబు, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి మానవత ఛైర్మన్ పావులూరు రమేష్, రేట్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.అంజిరెడ్డి, సంయుక్త కార్యదర్శి వి. సదాశివరావు, శ్యామలనగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ నేత కనపర్తి రాఘవరావు, విశ్రాంత ఫార్మసిస్ట్ అన్న పూర్ణమ్మ, విశ్రాంత అధ్యాపకులు సూరం నారాయణరెడ్డి, మానవత నేతలు చావా శివాజీ, టి.సుందరరామయ్య, ఎన్.సాంబశివరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ నారాయణ తీర్థుల తరంగ గానార్చన

గుంటూరు(తూర్పు), జూలై 6(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, త్యాగరాజస్వామి కళావేదికపై ఆదివారం గాయత్రి మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శ్రీ నారాయణ తీర్థుల జయంతి మహోత్సవాలు జరిగాయి. తొలుత భారతీయ విద్యాభవన్ గౌరవ కార్యదర్శి పి.రామచంద్రరాజు, శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీ నారాయణ తీర్థ తరంగాలను ఏంవై శేషురాణి, పి.లలితాదేవి, డాక్టర్ కే.మృణాళిని, ఏం.మాధవి కృష్ణ, జీ.శ్రీవల్లి శ్రావ్యంగా గానం చేశారు. గానార్చనకు వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై కిషోర్ వాయిద్య సహకారాన్ని అందించారు. సన్మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి శేషురాణి పర్యవేక్షించారు.

వెబ్‌సైట్ల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం...పెన్షనర్ల పాట్లు

● ఈదర వీరయ్య

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల పిల్లల ఉద్యోగ ఉపాధి ఉన్నత విద్యా అవకాశాల ప్రయత్నాల కోసం ఉపయోగించే వెబ్‌సైట్ల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో ఆరోపించారు. దరఖాస్తులు పూరించటంలో నెలకొన్న సాంకేతిక స్వయంకృతాపరాధ సమస్యలు అభ్యర్థులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుంటే తల్లిదండ్రులను, యువతను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో వెబ్‌సైట్లలో పొందుపరిచిన ఫోన్‌కాల్స్ జాబితాలు అలంకార ప్రాయంగా మారగా, ఫిర్యాదుల విభాగం కూడా స్పందనకు దూరంగా ఉంటుందని తెలిపారు. విద్యా సంవత్సరం ముగియగానే యువత ముందుంచే అనేక రకాల పరీక్షల దరఖాస్తులకు ఆన్‌లైన్ వేదికగా మారుతుందని, పరీక్షలు నిర్వహించే విద్యాశాఖ, యూనివర్సిటీలు సంబంధిత శాఖల పరీక్షలకు ఒక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి అందులోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫీజులు వసూలు చేయటంతో పనులు సులువైపోతున్నాయన్నారు. ప్రవేశ పరీక్షలకు నిర్వహించే పిజిసెట్, ఐసెట్, లాసెట్, ఎల్.పి.సెట్, అసెట్, పీజీ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలు ఎంసెట్, డైట్ సెట్ విద్యార్థుల ప్రవేశ పరీక్షలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ పాలిటెక్నిక్ పలు సర్టిఫికెట్ కోర్సులు దాదాపు అన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయన్నారు. ఫలితంగా దరఖాస్తుల కోసం పరుగులు తీసే రోజులు పోయాయని, అంతర్జాలం ముందు కూర్చుంటే గంటలో పూరించిన దరఖాస్తు మన చేతికి వస్తుందన్నారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో యువతకు అన్ని రకాలుగా అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. దీంతో సమయం ఆదాతో పాటు కొంత ఇబ్బందులు తొలగిపోతున్నాయన్నారు. ఆయా శాఖల అధికారులు వీటి నిర్వహణకు ఒక వెబ్‌సైటు ఏర్పాటు చేస్తున్నాయి.... కానీ, నిర్వహణపై దృష్టి పెట్టకపోవటంతో యువతకు ఇబ్బందులు తప్పటం లేదని అభ్యర్థులు వాపోతున్నారన్నారు. గతంలో ప్రతి దరఖాస్తుకు సబ్‌మిట్ చేసిన కొన్ని రోజుల వరకు ఎడిట్ అవకాశం ఇచ్చేవారన్నారు. అధికారులు స్పందించి సక్రమంగా వెబ్‌సైట్‌ల నిర్వహణను జరిపి టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయగానే స్పందించే విధంగా చర్యలు తీసుకొని యువత నష్టపోకుండా చూడాలని వీరయ్య కోరారు.

నవ సమాజ నిర్మాణానికై పోరాడిన యోధుడు బాబు జగ్జీవన్‌రామ్

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాదు

గుంటూరు(తూర్పు), జూలై 6 (ఆంధ్రజ్యోతి): నవ సమాజ నిర్మాణానికై అహర్నిశలు పోరాడిని చైతన్యమూర్తి బాబు జగ్జీవన్‌రామ్ అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు కొనియాడారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం హిందూ కళాశాల కూడలి వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్తగా బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. వర్గీకరణ చేసి బాబు జగ్జీవన్‌రామ్ కలలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజం చేసారని అన్నారు. వర్గీకరణపై వైసీపీ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చావలి బాలస్వామి, జోసఫ్, కొరివి వినయ్‌కుమార్, నల్లపు నీలంబరం, సముద్రాల కోటేశ్వరరావు, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు ముఖర్జీ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకం

గుంటూరు(తూర్పు), జూలై 6(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రత కు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. స్థానిక లాలుపురంలో ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 124వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ బీజేపీకి సైద్ధాంతిక పునాది వేసింది ముఖర్జేనని అన్నారు. కార్యక్రమంలో బిట్ర శివన్నారాయణ, మకుటం శివ, భీమినేని చంద్రశేఖర్, రవికు మార్, వెలగలేటి గంగాధర్, మంత్రి సుగుణ, సరోజని, వాణి వెంకట్, సురేష్ జైన్ పాల్గొన్నారు.

హక్కుల కోసం బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లంతా ఏకం కావాలి

● ఏఐబీఎస్పీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ జె.పూర్ణచంద్రరావు

గుంటూరు (విద్య) జూలై 6, (ఆంధ్రజ్యోతి): హక్కుల కోసం బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అంతా ఏకం కావాలని, రాష్ట్రస్థాయిలో నిర్వహించే భారీ బహిరంగ సభను అంతా కలిసి విజయవంతం చేయాలని, మాజీ డీజీపీ, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ జె. పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం అమరావతి రోడ్డులోని మండల్ స్టడీ సర్కిల్‌లో బీసీ సంఘం నాయకులతో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజ్యాధికారం రావాలన్నదే మన ఏకైక లక్ష్యం అన్నారు. ఆ దిశగా పోరాడేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని, తమిళనాడు తరహాలో మన దగ్గర కూడా బ్లాక్ షర్ట్ ఉద్యమం ప్రారంభం కావాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఛైర్మన్ మాదాసు రంగ నాయకులు, నల్లబోతుల శ్రీనివాసరావు, డి.బాలయ్య, అల్లూరయ్య, టీవీ రమణయ్య, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ ఆధ్వర్యంలో భాగవతుల వెంకట రామశర్మ, సౌమ్య దంపతుల శిష్య బృందం శ్రీ నృత్య ఆర్ట్ అకాడమీ, విజయవాడ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. అనంతరం క్యాన్సర్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చిట్టినేని అఖిలేష్ మాట్లాడారు. కార్యక్రమాల్ని దేవస్థానం అధ్యక్షుడు మస్తానయ్య ప్రారంభించగా, కార్యక్రమంలో సాంబశివరావు, సేవ సంస్థ వ్యవస్థాపకులు గుళ్లపల్లి సుబ్బారావు, గుళ్లపల్లి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

జోనో సిస్ డే వి'చిత్రాలు'

ప్రపంచ జోనో సిస్ డే ను పురస్కరించుకొని ఆదివారం గుంటూరు కొత్త పేటలోని పాలీ క్లినిక్‌లో ప్రత్యేక టీకాల కార్యక్రమం నిర్వహించారు. పెంపుడు కుక్కలు, పిల్లులకు రాబీస్ టీకాలు వేస్తామని ప్రకటించటంతో నగరంలోని జంతు ప్రేమికులు పాలీ క్లినిక్ బాట పట్టారు. అసలే వేసేది సూది మందు కావటం అక్కడ సీన్ చూసి మారం చేసిన కుక్కలను బలవంతంగా ఎత్తుకొని తెచ్చి మరీ టీకాలు వేయించిన దృశ్యాలను కెమెరా కళ్లు పట్టేశాయి. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)



నల్లచెరువులో గుర్తు తెలియని యువకుడి మృతి

గుంటూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లచెరువు 12వ లైను వద్ద గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి భద్రపరచారు.

సంగడిగుంటలో గుర్తు తెలియని వృద్ధుడు...

స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగడిగుంట చిన్నమసీద్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సదరు మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీకి తరలించి భద్రపరచారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు లాలాపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్

● ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యం కోసమే ఆంధ్ర ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. గోరంట్ల రామాలయం వద్ద ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా డేగల ప్రభాకర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో సుమారు 430 మంది ప్రజలు వైద్యసేవలు పొందారు. అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఛైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ గోరంట్ల వాస్తవ్యులైన డాక్టర్ తేజస్వి జల్లేపల్లి పేదలకు సేవ చేయాలనే గొప్ప ఉద్దేశంతో ఈ క్యాంప్ నిర్వహించారని తెలిపారు. సాధారణంగా ఓపీ ఫీజు కనీసం వెయ్యి రూపాయల వరకు ఉండే హాస్పిటల్స్ ఉన్న ఈ కాలంలో, ప్రైమ్ హాస్పిటల్ ద్వారా ఈ శిబిరం ద్వారా ఉచితంగా డయాగ్నోసిస్, ఈసీజీ, మెడిసిన్ వంటి సేవలు అందించబడుతున్నాయన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ జల్లేపల్లి తేజస్వి మాట్లాడుతూ శిబిరంలో గుండె సంబంధిత ఈసీజీ, 2డీ ఎకో వంటి టెస్టులు ఉచితంగా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కార్పొరేటర్ నూకవరపు బాలాజీ, ఎర్రంశెట్టి పద్మావతి, ఎర్రంశెట్టి వేణు, రాజేష్ తదితరులు సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జల్లేపల్లి తేజస్వి, కాసుల సాయి రాజశేఖర్, చెరుకూరి జగదీష్, బడుగు పవన్ కుమార్, గుంటుపల్లి నవీన్, జీ.మాధవిలత, పేరం కుప్పుస్వామి, నాయకులు యర్రగోపు నాగేశ్వరరావు, ఘంటసాల శేఖర్, వై.శ్రీను, ఎం.బాలు, రాగం సదాశివరావు, బొక్కినం శివరాం, మేకల బాబురావు, పొన్నెగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి

గుంటూరు (విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వృత్తికి పునరంకితమై తల్లిదండ్రుల అభీష్టం మేరకు పని చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పరిరక్షించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు అన్నారు. ఏపీటీఎఫ్ గుంటూరు మండల శాఖ ఆధ్వర్యంలో గుంటూరు జోన్ ఆధ్వర్యంలో ఆదివారం మాజేటి గురవయ్య ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి ఏపీటీఎఫ్ నాయకులు శివన్నారాయణ అధ్యక్షత వహించారు. బసవలింగారావు మాట్లాడుతూ పాఠశాల విద్యారంగం పలు సంక్షోభంలో ఉందని సంక్షోభం నుండి బయటపడాలంటే ఉపాధ్యాయుల అంకితభావంతో పనిచేయాలన్నారు. గుంటూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయ సంఘమని అన్నారు. ఎంఈఓలు ఎండి ఖుద్దుస్, జ్యోతికిరణ్, ఉర్దూ డిఐ మహమ్మద్ ఖాసీంలు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని, వాటిని ఉపయోగించుకుని విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పదవీ విరమణ చేసిన, పదోన్నతులపై వెళ్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా కమిటీ సభ్యులు మూర్తి, దాస్, లక్ష్మీనారాయణ, గుంటూరు మండల బాధ్యులు శివరామకృష్ణ, బాలరాజు, గురుమూర్తి, సుబ్బారావు, రమాదేవి, నిర్మల, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిషియన్‌కు రూ.1.40 లక్షల ఆర్థిక సాయం

● సేవా నిరతికి 'పూర్వ విద్యార్థుల' చిరు సాయం

గుంటూరు మెడికల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల మెన్స్ హాస్టల్‌లో గత 53 ఏళ్లుగా దినసరి వేతనంపై ఎలక్ట్రిషియన్‌గా సేవలు అందిస్తున్న చంద్రారెడ్డికి వైద్య ఖర్చులు, పోషణార్థం హాస్టల్ 1977వ సంవత్సరం పూర్వ విద్యార్థులు రూ.1.40 లక్షలు నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. స్థానిక అమరావతి రోడ్‌లోని జీఎంసీ పురుష వసతి గృహంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఈ ఆర్థిక సాయం అందజేశారు. ఇదే హాస్టల్‌లో ఉంటూ విద్య నభ్యసించి వైద్య ఆరోగ్య శాఖలో ఎడిషనల్ డైరెక్టర్ హోదాలో ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ నక్కా విజయరామరాజు రచించిన 'మా హాస్టల్ కథలు' పుస్తకాన్ని వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీ శ్రీధర్ ఆవిష్కరించారు. అనంతరం జీఎంసీలో విద్య నభ్యసిస్తూ మెన్స్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కేశవ్ (ఒంగోలు), ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కాలేషావలి (విజయవాడ), నెల్లూరు వైద్య కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీ, అమ్మ హాస్పిటల్, చీరాలకు చెందిన డాక్టర్ అమృతపాణి, గుంటూరు జీజీహెచ్ రిటైర్డ్ ఆర్ఎంవో డాక్టర్ ఆదినారాయణ, రిటైర్డ్ జనరల్ సర్జరీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జీ.విజయసారధి తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ టీ శివయ్య కార్యక్రమం నిర్వహించగా, మెన్స్ హాస్టల్ అసిస్టెంట్ వార్డెన్ డాక్టర్ శివగోపాల్ వందన సమర్పణ చేశారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీధర్, డాక్టర్ విజయరామరాజు

పవన్ కల్యాణ్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష

● 'ఛాయ్ విత్ జనసైనిక్స్'లో జననేతల వెల్లడి

గుంటూరు మెడికల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేశం మీద భక్తి, సమాజం పట్ల బాధ్యతతో ప్రజల్ని కంటికి రెప్పలా కాపాడుకున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని జనసేన నాయకులు తెలిపారు. ఆదివారం జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోటలో జరిగిన ఛాయ్ విత్ జనసైనిక్స్ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పలువురు జనసేన నాయకులు తమ అభిప్రాయాలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పలు సూచనలు చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించేలా అధినాయకత్వం చొరవ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అడపా మాణిక్యాలరావు, కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, సంకూరి శ్రీనివాసరావు మాట్లాడారు. జనసేన నాయకులు మెహబూబ్ బాషా, కొత్తకోట ప్రసాద్, పుల్లంశెట్టి ఉదయ్, రాజనాల నాగలక్ష్మి, మారుతీ కిషోర్, యర్రంశెట్టి సూరి, యిర్రి సాయి, అయిశెట్టి శ్రీనివాసరావు, దాసరి వాసు, తాడివాక రమణ, భూషయ్య, దాసరి వెంకటేశ్వర్లు, పీ.నరసింహారావు, మధులాల్, కదిరి సంజీవ్, కొండూరు ప్రతాప్, శానం రమేష్, కోనేటి ప్రసాద్, జక్కా రాఘవులు పాల్గొన్నారు.



ఛాయ్ విత్ జనసైనిక్స్‌లో పాల్గొన్న పార్టీ నాయకులు

దిక్సూచి

ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్లు

ఖాళీలు 541

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 541 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎస్సీ: 80, ఎస్టీ: 73, ఓబీసీ: 135, ఈడబ్ల్యూఎస్: 50, యూఆర్: 203

అర్హత: గ్రాడ్యుయేషన్. ఫైనలియర్ విద్యార్థులూ దరఖాస్తు చేయొచ్చు. అయితే 2025 సెప్టెంబర్ 30వ తేదీలోగా డిగ్రీ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. మెడిసిన్, ఇంజనీరింగ్, సీఏ తదితర విద్యార్థులూ అర్హులే.

వయస్సు: 2025 ఏప్రిల్ 1 తేదీ నాటికి వయస్సు 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 14

వెబ్‌సైట్: https://sbi.co.in/

బ్యాంకింగ్ ఉద్యోగాలు

ప్రొబేషనరీ ఆఫీసర్/ మేనేజ్‌మెంట్ ట్రైనీ

ఖాళీలు 5208



ప్రొబేషనరీ ఆఫీసర్లు/ మేనేజ్‌మెంట్ ట్రైనీల కోసం ఐబీపీఎస్ (ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్) నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో దాదాపు 5208 పోస్టులు ఉన్నాయి.

అర్హత: గ్రాడ్యుయేషన్

వయస్సు: 2025 జూలై 1 తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు.

చివరి తేదీ: 2025 జూలై 21

వెబ్‌సైట్: https://www.ibps.in/

స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 1007

పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో 1007 స్పెషలిస్ట్ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: పోస్టులను అనుసరించి బీఎస్సీ, బీటెక్, ఎల్ఎల్‌బీ, ఎంఏ, ఎంఆర్క్., ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయస్సు: 2025 జూలై 1 తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 21

వెబ్‌సైట్: https://www.ibps.in/

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జాబ్స్

మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్)

పోస్టులు 1075

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్), హవల్దార్(సీబీఐసీ అండ్ సీబీఎన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 1075 పోస్టులు ఉన్నాయి. పదో తరగతి పాసైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. శారీర సామర్థ్యం, రాత పరీక్షల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 24 **వెబ్‌సైట్:** ssc.gov.in

జూనియర్ ఇంజనీర్లు

పోస్టులు 1340

వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న 1340 జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీ కోసం ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజనీరింగ్ డిప్లొమా, గ్రాడ్యుయేషన్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఖాళీల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రిల్ ఇంజనీర్ల పోస్టులు ఉన్నాయి(డిపార్ట్‌మెంట్ వారీగా ఖాళీల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు). **వయస్సు:** పోస్టులను బట్టి కొన్నింటికి 30, మరికొన్నింటికి 32 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితి ఉంది. **చివరి తేదీ:** 2025 జూలై 22

వెబ్‌సైట్: ssc.gov.in/

కోర్ బ్రాంచెస్‌లో కీలకం మెకానికల్ ఇంజనీరింగ్

కోర్ ఇంజనీరింగ్‌లో ప్రధానమైన వాటిలో మెకానికల్ ఒకటి. యాంత్రీకరణతో కలిగిన ప్రయోజనాలు ఎన్నో. మానవ నాగరికతలో అది చెప్పుకోదగ్గ మైలురాయి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలియాలంటే మెకానికల్ ఇంజనీరింగ్‌పై అవగాహన ఉండాలి. ఈ డిసిప్లిన్‌పై అవగాహనకు తోడు అధ్యయనంతో వచ్చే ఉద్యోగాలు, కెరీర్ పరంగా ఎదుగుదల ఎలా ఉంటుందో చూద్దాం.



కదలిక ఉన్న పరికరాల డిజైన్, అభివృద్ధి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు సహా సమస్తం మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి వస్తాయి. రోజువారి జీవితం ఈ సబ్జెక్టుతో ముడిపడి ఉంది. బహుళ అంతస్తుల భవనం మొదలుకుని డ్రైవ్ చేసే వాహనం వరకు మెకానికల్ ఇంజనీరింగ్ ఉనికికి ఉదాహరణలే. ప్రాబ్లమ్ సాల్వింగ్ కూడా ఇందులో భాగం. సైన్స్ మేథ్స్ ఉపయోగించి మెకానికల్ ఇంజనీర్లు పలు సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటారు. ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలకు టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌తో మంచి పరిష్కారం చూపిస్తారు. అందుకే మెకానికల్ ఇంజనీర్లు బయోమెడికల్, మాన్యుఫాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, ఆటోమేటివ్ రంగాల్లో ఉపాధిని పొందగలుగుతున్నారు.

వివిధ బ్రాంచ్‌లు

మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి పలు బ్రాంచీలు వస్తాయి. ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమేషన్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఆటోమొబైల్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఆటోమేటివ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్(ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్), మెకానికల్ అండ్ రైల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(ఆటోమొబైల్), మెకానికల్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ ఇంజనీరింగ్(మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్), మెకానికల్ ఇంజనీరింగ్(ప్రొడక్షన్), మెకానికల్ ఇంజనీరింగ్(వెల్డింగ్ టెక్నాలజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమొబైల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిజైన్, మెకట్రానిక్స్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆటోమేటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమొబైల్ సర్వీసింగ్ వంటివన్నీ మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకే వస్తాయి.

కెరీర్ అవకాశాలు

కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్: పెద్ద పెద్ద నిర్మాణాల్లో కూడా మెకానికల్ ఇంజనీర్ అవసరం ఉంటుంది. వెంటిలేషన్, కూలింగ్, హీటింగ్ వంటి పనులు అక్కడ ఉండేవారికి ఎలాంటి అపాయం కలుగని రీతిలో ఉండేందుకు మెకానికల్ ఇంజనీర్ల సూచనలు, సలహాలు అవసరం.

ఆటోమేటివ్ ఇంజనీర్: ఆటోమోటివ్ ఇండస్ట్రీలో వివిధ వాహనాల ఉత్పత్తి, డిజైనింగ్‌లో వీరి సేవలు అవసరం. ఇందులో మళ్ళీ కస్టమర్, మిలిటరీ వాహనాలంటూ ప్రత్యేకంగానూ ఉంటాయి. సురక్షితంగా కొత్త ఫీచర్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఏరోడైనమిక్స్ తదితరాల్లో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర ఉంటుంది.

రోబోటిక్ ఇంజనీర్: రోబోటిక్స్ నిర్మాణం, ప్లాన్, నిర్వహణలో పాలుపంచుకోవాలి. డిజైన్, టెక్నాలజీకి తోడు హెల్త్‌కేర్, మెడికల్ డివైజ్‌ల కోసం రోబోట్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ప్రాసెస్ ఇంజనీర్: తార్కికంగా ఆలోచించడం, సరికొత్తగా చేయాలన్న ఆలోచన - అమలుపై ఆసక్తి ఉన్న మెకానికల్ ఇంజనీర్లు బీటెక్ తరవాత ప్రాసెస్ ఇంజనీరింగ్‌ను ఎంచుకోవాలి. సంబంధిత విధానాల మెరుగుదలలో ప్రాసెస్ ఇంజనీర్ల పాత్ర ఇతోధికంగా ఉంటుంది. వాటర్ అండ్ పవర్ సప్లయ్, ఫార్మాస్యూటికల్స్, డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో వీరి అవసరం చాలా ఉంటుంది.

మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్: వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మెషీన్ల డిజైనింగ్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్ పరిధిలోకి వస్తుంది. మెషీన్ విభాగాలు వేటినైనా వీరే రూపొందిస్తారు. అప్లయిన్సెస్ నుంచి ఫుడ్ వరకు వాటికి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్ట్ మేనేజర్: వివిధ పనులను ప్రాజెక్టులుగా మలిచి టీమ్‌లను సదరు సంస్థలు నియమిస్తాయి. వారందరితో సక్రమంగా పనిచేయిస్తేనే సదరు ప్రాజెక్ట్ పని పూర్తవుతుంది. ప్రాజెక్టుకు మేనేజర్‌గా అనుభవం బాగా ఉన్న వ్యక్తులను నియమిస్తారు. తమ టీమ్‌లోని సభ్యులతో సమర్థంగా పనిచేయించడమే కాదు, ఫలితాలను రాబట్టే పనిని వీరు చేయాల్సి ఉంటుంది.

సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: కస్టమర్ బిల్డింగ్‌లో వీరుంటారు. యంత్రాలు సమర్థంగా, నిరంతరాయంగా పనిచేసే విషయంలో నిమగ్నమై ఉంటారు. క్లయింట్ విజిట్స్, మెషీన్ల చెకింగ్, పనికిరానివాటిని తొలగించి కొత్తవాటిని ఉంచడం వంటి పనులు ఉంటాయి.

మెటీరియల్స్ ఇంజనీర్: వివిధ యంత్రాల ఉత్పత్తిలో మెటీరియల్ సేకరణ, పరీక్షించడం, మోడిఫై, ఎవాల్యుయేషన్ పనులు ఉంటాయి.

కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: ఫ్యాక్టరీ లేదంటే పనిచేసే చోట పరిశోధన, డిజైన్, డెవలప్‌మెంట్, సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్ పనులు ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే.

ప్రొఫెసర్స్, లెక్చరర్స్: మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ లేదంటే యూజీసీ నెట్/ సీఎస్ఐఆర్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయితే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బోధకులుగా రాణించవచ్చు. అంటే అకడమిక్ వాతావరణంలో ఉండొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు: యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి ఎంపికైతే ఆరంభంలోనే మంచి జీతం, అధికారిక హోదా తద్వారా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థలు మొదలుకుని పలు ఇతర విభాగాల్లో మెకానికల్ ఇంజనీర్లు అవసరమవుతారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్: బాస్‌గా మారడం అన్నమాట. సొంతంగా పైకి ఎదగాలన్న ఆకాంక్ష ఉంటే అందుకు సొంత ఆలోచనలు తోడైతే ఇండిపెండెంట్‌గా యూనిట్ పెట్టుకోవచ్చు. ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. తానే మరికొందరికి ఉపాధి కల్పించవచ్చు.

ప్రయోజనాలు

మనిషి దైనందిన జీవితంతో ముడిపడినది మెకానికల్ ఇంజనీరింగ్. అందులో భాగంగా వివిధ పరిశ్రమల్లో తలెత్తే సమస్యల పరిష్కారంలో మెకానికల్ ఇంజనీర్లు విశిష్ట పాత్రను పోషిస్తారు. మెషీన్స్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్, మెయింటెనెన్స్, అనాలిసిస్ కాన్సెప్టులు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో భాగం. ఈ నాలుగేళ్ళ కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉజ్వల కెరీర్‌కు రహదారిని నిర్మిస్తుంది. మేథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, థియరీ ఆఫ్ మెకానిక్స్, మెషీన్ డ్రాయింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తదితరాలు కోర్సులో ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్, రీసెర్చ్, డిజైన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించి నైపుణ్యాల పెంపునకు పై అంశాల అధ్యయనం ఉపయోగపడుతుంది. సంబంధిత నైపుణ్యాలకు పదునుపెట్టుకోవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది.



ప్రొ. ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

యాక్షన్ థ్రిల్లర్



'సప్త సాగరాలు దాటి' చిత్రంతో చక్కని గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్‌రావు. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో డాలీ ధనంజయ కథానాయకుడు. శివరాజ్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైశాఖ్‌గౌడ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. ఈ సందర్భంగా డాలీ ధనంజయ లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. యాక్షన్‌తో పాటు ప్రేక్షకులను అలరించే అన్ని హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం అని మేకర్స్ తెలిపారు. పాన్ ఇండియా కంటెంట్‌తో రూపొందుతున్న చిత్రమిదని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్‌రాజ్, సినిమాటోగ్రఫీ: అద్వైత

కంటెంట్ ఉంటేనే కలెక్షన్లు

- ఎస్‌కేఎన్



'ప్రస్తుతం సినిమాల్లో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్న ఏకైక అంశం మంచి కంటెంట్ మాత్రమే. సినిమా చిన్నదైనా, పెద్దదైనా ముందు కథ బావుండాలి. ప్రేక్షకుల అభిరుచి మారింది. ఎంత హంగామా చేసినా సినిమాలో కంటెంట్ లేకుంటే థియేటర్లకు రావడం లేదు. మంచి కథతో వచ్చిన సినిమాలే బాక్సాఫీసు దగ్గర నిలబడుతున్నాయి' అని నిర్మాత ఎస్‌కేఎన్ అన్నారు. ఆయన నిర్మిస్తున్న పలు చిత్రాల విశేషాలను ఆదివారం మీడియాతో పంచుకున్నారు.

● నిర్మాతను అవ్వాలని నేను ఇండస్ట్రీకి రాలేదు. అవకాశం వచ్చింది. అందిపుచ్చుకున్నాను. ఇప్పుడు హిందీలోనూ సినిమాలు చేస్తున్నాను. నిర్మాతగా నెగ్గుకు రావడం అంత సులభం కాదు. మన కష్టం అంతా ఒక్కరోజులో పోవచ్చు. పది రూపాయలు పెడితే ఇరవై రూపాయలు వస్తుందని నిర్మాణ రంగంలోకి అడుగుపెడితే నష్టపోతాం. ముందు ఈ రంగం పట్ల మక్కువ ఉండాలి.

● ప్రస్తుతం 'రాజాసాబ్' బ్యాలెన్స్ షూట్ పూర్తి చేసే పనిలో ఉన్నాం. కిరణ్ అబ్బవరంతో 'చెన్నై లవ్‌స్టోరీ' చేస్తున్నా. హిందీలో 'బేబీ' చిత్రం రీమేక్ చేస్తున్నాం. ఆగస్టులో చిత్రీకరణ మొదలుపెడతాం. దర్శకుడు మారుతి, సాయిరాజేశ్‌తో కూడా మా బేనర్‌లో సినిమాలు చేస్తున్నాం. ఇద్దరు కొత్త దర్శకులతో సినిమాలు చేయబోతున్నాం.

● నిర్మాతగా తక్కువ బడ్జెట్‌లో మంచి కథలతో సినిమాలు చేయడం, అవి ప్రేక్షకాదరణ పొందడం నాకు సంతోషాన్నిచ్చింది. ప్రస్తుతం పలు అగ్ర నిర్మాణ సంస్థలతో కలిసి సినిమాలు నిర్మిస్తున్నాను. ఇప్పటివరకూ కొందరు తెలుగమ్మాయిలను నా సినిమాల ద్వారా కథానాయికలుగా పరిచయం చేశాను. మరో ముగ్గురు తెలుగమ్మాయిలను పరిచయం చేయబోతున్నా. అలాగే మహిళా దర్శకులతోనూ సినిమాలు చేసేందుకు ప్లాన్ చేస్తున్నా.

తెలుగువారంటే వైల్డ్ ఫైర్

అమెరికాలో టాలీవుడ్ సినీ తారలు సందడి చేశారు. 'నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్)- 2025' వేడుకలో దర్శకులు రాఘవేంద్రరావు, సుకుమార్, హీరో అల్లు అర్జున్, హీరోయిన్ శ్రీలీల తదితరులు పాల్గొన్నారు.



తెలుగువారంటే ఫైర్ అనుకున్నారా... వైల్డ్ ఫైర్ అంటూ తన 'పుష్ప' చిత్రంలోని డైలాగ్‌తో ప్రసంగాన్ని ప్రారంభించిన అల్లు అర్జున్ సభికులను అలరించారు. 'ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో సంతోషిస్తున్నా. ఇంతమంది తెలుగువారిని చూస్తుంటే హైదరాబాద్‌లోనో విశాఖపట్నంలోనో ఉన్నట్లు అనిపిస్తోంది. అమెరికాలో మనమంతా ఇలా కలవడం అదృష్టంగా భావిస్తున్నా. నన్ను ఇలాంటి అద్భుతమైన కార్యక్రమానికి ఆహ్వానించినందుకు నాట్స్‌కు ధన్యవాదాలు. నాట్స్ గురించి సరదాగా 'పుష్ప' స్టయిల్‌లో చెప్పాలంటే 'నాట్స్ అంటే నేషనల్ అనుకుంటివా... ఇంటర్నేషనల్. మన తెలుగు సంస్కృతిని ముందు తరాలకు చేరవేస్తున్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. భారతీయులు ఎక్కడున్నా తగ్గేదేలే...అందులోనూ తెలుగోళ్ళు అస్సలు తగ్గేదేలే. విదేశాల్లోనూ తెలుగువారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు' అని అల్లు అర్జున్ అన్నారు.

● దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ 'నేను పరిచయం చేసిన బన్నీ, శ్రీలీల ఇక్కడ ఉన్నందుకు ఆనందంగా ఉంది. సుకుమార్‌కూ నాకూ ఒక పోలిక ఉంది. అదే గడ్డం. నేను 'అడవి రాముడు'లో అడవిని నమ్ముకున్నా. స్టార్ డైరెక్టర్‌ను అయ్యా. 'పుష్ప'లో అడవిని నమ్ముకున్న సుకుమార్ స్టార్ డైరెక్టర్ అయ్యారు. బన్నీని స్టార్ హీరోను చేశారు. శ్రీలీల సైతం దెబ్బలు పడతాయని అంటూ అందరినీ అలరిస్తోంది' అని అన్నారు.

నాకొక గుర్తింపును ఇచ్చారు

- సమంత



'నేను ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, ఏ పరిశ్రమలో పనిచేసినా ..తెలుగు ప్రేక్షకులు నన్ను చూసి గర్వపడాలని భావిస్తాను. ఇన్నేళ్ల ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచినందుకు ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. మీరంతా నాకంటూ ఒక గుర్తింపునూ, కుటుంబాన్నీ ఇచ్చారు' అంటూ భావోద్వేగానికి గురయ్యారు నటి సమంత. అమెరికాలో జరుగుతున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) వేడుకల్లో పాల్గొన్నారు సమంత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ' తానా వేడుకల్లో పాల్గొనడానికి నాకు 15 ఏళ్లు పట్టిందంటే నమ్మలేకపోతున్నా. ప్రతి ఏటా ఇక్కడ జరిగే వేడుకలు, తెలుగువారి గురించి వింటూనే ఉన్నాను. నా తొలి చిత్రం 'ఏ మాయ చేసావే' నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై ప్రేమను చూపించారు. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు ఇన్నేళ్లు పట్టింది. కెరీర్ పరంగా ముఖ్యమైన దశలో ఉన్నాను. ట్రాలాలా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించాను. నిర్మాతగా 'శుభం'తో తొలి అడుగు వేశా. నార్త్ అమెరికాకు చెందిన తెలుగువారు నా చిత్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు' అని అన్నారు.

గ్యాంగ్‌స్టర్ డ్రామా



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'దురంధర్'. సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాతో సారా అర్జున్ కథానాయికగా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. గతంలో పలు విజయవంతమైన చిత్రాలను అందించిన ఆదిత్య ధర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డిసెంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌ని చిత్రబృందం రిలీజ్ చేసింది. ట్రైలర్‌ని చూస్తే ఇదొక గ్యాంగ్‌స్టర్ డ్రామా అని అర్థమవుతోంది. ఇటీవల వచ్చిన 'కిల్', 'జాన్ విక్'లను మించిన యాక్షన్ సన్నివేశాలు ఇందులో ఉన్నాయి.

కొత్తగా..

వినోదం పంచే బకాసుర



నటుడు ప్రవీణ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. వైవా హర్ష టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌తో ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా టైటిల్ ర్యాప్‌సాంగ్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ గీతాన్ని వికాస్ బడిస స్వరపరిచారు. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ "బకాసుర రెస్టారెంట్‌లో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు వినోదం పంచడంతో పాటు థ్రిల్‌ను ఇస్తుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బాల సరస్వతి, ఎడిటర్: మార్తాండ్ కే. వెంకటేశ్



ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథ

సుహాస్ కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళ నటి మాళవికా మనోజ్ కథానాయికగా పరిచయమవుతున్నారు. రామ్‌జీ దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 11న 'ఓ భామ అయ్యోరామ' విడుదలవుతోంది. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రమిది. చక్కని ప్రేమకథతో రూపొందించాం. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను అలరిస్తుంది. కొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'సినిమా మేకింగ్‌లో రాజీ పడలేదు. మంచి అవుట్‌పుట్ వచ్చింది. పాటలు, ఆకట్టుకునే రొమాంటిక్ సన్నివేశాలు, అందరినీ కట్టిపడేసే భావోద్వేగాలు ఈ చిత్రంలో మిళితమై ఉన్నాయి' అని చెప్పారు.

అన్ని హంగులతో అలరించేందుకు



యూత్‌ఫుల్ సబ్జెక్ట్‌తో తెరకెక్కిన చిత్రం వర్జిన్‌బాయ్స్. మిత్రశర్మ, గీతానంద్, శ్రీహాన్, రోనిత్ ప్రధాన తారాగణం. దయానంద్ గడ్డం దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించారు. ఈనెల 11న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సినిమా టికెట్లు కొన్నవారిలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన 11 మందికి ఐఫోన్లు బహుమతిగా ఇస్తామని చిత్రబృందం తెలిపింది. దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ 'నా కళాశాల అనుభవాలను ఆధారంగా చేసుకొని తెరకెక్కించిన చిత్రమిది. 'వర్జిన్‌బాయ్స్' అనే టైటిల్‌కు కచ్చితంగా సరిపోయేలా కథ ఉంటుంది' అని చెప్పారు. రాజా దారపునేని మాట్లాడుతూ 'ఈ సినిమాలో పాపులర్ నటీనటులు ఎవరూ లేరు. కథే ఈ చిత్రానికి హీరో. ప్రేక్షకులను అబ్బురపరిచే కంటెంట్‌తో వస్తున్నాం' అని తెలిపారు. గీతానంద్ మాట్లాడుతూ 'ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి ఎంటర్‌టైన్ చేస్తుంది. మంచి సినిమా చూసిన ఫీల్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి వెళ్తారు' అని అన్నారు.

మిస్టీరియస్ కథతో...



పాతతరం నటుడు నాగభూషణం మనవడు అబిడ్ భూషణ్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో ఉషా, శివాని నిర్మించారు. రోహిత్ సహాని కీలకపాత్ర పోషిస్తున్నారు. రియాకపూర్, మేఘనా రాజ్‌పుత్ కథానాయికలు. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్ జానర్‌లో వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అన్నారు. భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మించిన చిత్రమిది, భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొస్తామని నిర్మాతలు తెలిపారు.



బంగారం మొక్క!

ఈ ప్రకృతిలో అనేక అద్భుతాలు ఉన్నాయి. చాలా సార్లు అవి మన కళ్ల ముందే కనిపిస్తూ ఉంటాయి. కానీ వాటి ప్రాముఖ్యం తెలియక పట్టించుకోం. అలాంటి ఒక మొక్క ఉచ్చి ఉసిరిక. ఈ మొక్క ఆకులలో నానో బంగారు కణాలు ఉంటాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ మొక్క గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం.

నీళ్లు ఎక్కువగా లభించని ప్రాంతాల్లో ఉచ్చి ఉసిరిక మొక్క ఎక్కువగా పెరుగుతుంది. ఈ మొక్కకు ఫిలంథస్ విర్గాటస్ అనే శాస్త్రీయ నామం ఉంది. ఈ మొక్క 30 నుంచి 60 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. పొదలా గుబురుగా వ్యాపిస్తుంది. దీని ఆకులు చిన్నగా ఉంటాయి. ఈ మొక్కకు ఎర్రటి పువ్వులు పూస్తాయి. ఈ పూల నుంచి చిన్న చిన్న కాయలు కాస్తాయి. మొదట పచ్చగా ఉన్నా.. బాగా పండిన తర్వాత బ్రౌన్ రంగులోకి మారతాయి. ఈ మొక్కను ఆయుర్వేద వైద్యంలో కొన్ని వేల ఏళ్లుగా కామెర్లు, జీర్ణ కోశ సమస్యలు, చర్మ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తున్నారు. ఇక ఈ మొక్క ఆకుల నుంచి నానో బంగారం కణాలు సంగ్రహించవచ్చని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ దిశగా అనేక ప్రయోగాలు జరుగుతున్నాయి. నీళ్ల సదుపాయం ఎక్కువగా లేని ప్రాంతాల్లో ఈ మొక్కను పెంచుకోవటం వల్ల అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయి.

● డాక్టర్ శ్రీనాథ్,
ఫోన్: 94930 02124
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్





మమ్మల్ని అలా చూడొద్దు

అందరు పిల్లల్లానే బాల్యం ఆడుతూ పాడుతూ సాగిపోయేది. కానీ... వయసు పెరుగుతున్నకొద్దీ చూపు మందగించింది. దీంతో అన్నింటా వెనకడుగు... అది ఆమెను కుంగదీసింది. అయితే తల్లిదండ్రుల సహకారంతో ప్రతికూలతలను అనుకూలంగా మార్చుకుంది. అంధుల క్రికెట్‌తో పాటు పారా క్రీడల్లోనూ రాణిస్తోంది.. సిద్ధిగాడ్రి హంసిక. తన ఈ ప్రయాణంలో ఎదురైన సవాళ్లు, సమస్యలు, వాటిని అధిగమించిన తీరును ఆమె 'నవ్య'తో పంచుకుంది.

"ఎన్నో ఆశలు.. అందమైన ఊహలు.. జీవితంలో ఏవేవో సాధించాలని కలలు కన్నాను. కానీ అవన్నీ కల్లలయ్యాయి. ఇకపై నేను మునుపటిలా చూడలేనని వైద్యులు చెప్పడంతో ఎంతో కుమిలిపోయా. కానీ అంతటితోనే ఆగిపోవాలని అనుకోలేదు. నాలాగా చూపు లేనివారు ఎందరో అద్భుతాలు చేస్తున్నారు. అలాంటివారి స్ఫూర్తితో అడుగు ముందుకు వేశాను. మాది దిగువ మధ్య తరగతి కుటుంబం. నాన్న ప్రభు... పాలకోవా తదితర పాల ఉత్పత్తులు విక్రయించి కుటుంబాన్ని పోషిస్తారు. అమ్మ గాయత్రి... నాన్నకు చేదోడు వాదోడుగా ఉంటోంది. ముగ్గురు సంతానంలో నేనే పెద్దదాన్ని. చెల్లి హాసిని, తమ్ముడు అర్జున్ నాకు అన్ని విషయాల్లో తోడుగా ఉంటారు. సికింద్రాబాద్ పద్మారావునగర్‌లో ఒక చిన్న ఇంట్లో అద్దెకు ఉంటున్నాం. నాలుగో తరగతి వరకు నేను చదువు, క్రీడల్లో ముందుండేదాన్ని. పాఠశాలలో, ఇంటర్ స్కూల్ పోటీల్లో... పాల్గొన్న ప్రతి ఈవెంట్‌లో ఫస్ట్ వచ్చేదాన్ని. ఆ తర్వాత నాకున్న కంటి చూపు సమస్యతో అన్నింట్లో వెనకబడడం మొదలైంది. తొలుత సాధారణంగా వచ్చే చూపు మాంద్యం అని వైద్యులు ఇచ్చిన కళ్లద్దాలు ఉపయోగించా. నాకు 13 ఏళ్లు వచ్చేసరికి సమస్య మరీ ఎక్కువ కావడంతో హైపవర్ లెన్స్ వాడాను. అవి పెట్టుకున్నాక మైగ్రేన్ నొప్పి, కళ్లల్లో నుంచి విపరీతంగా నీళ్లు కారడంతో ఆ కళ్లద్దాలు పక్కన పెట్టేశాను.

ఆస్పత్రికి వెళితే..

కొందరి సలహా మేరకు సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి అమ్మా నాన్న నన్ను తీసుకెళ్లారు. కళ్లలోని రెటీనాలో చుక్కలు ఉండడంతో ఒక అడుగు దూరానికి మించి ఏమీ చూడలేవని వైద్యులు చెప్పారు. అది విని నా గుండె ఆగినంత పనైంది. మా కుటుంబం షాక్‌లోకి వెళ్లిపోయింది. ఇది చాలా అరుదైన సమస్య అని, దీనికి చికిత్స లేదని వైద్యులు చెప్పారు. నాకు 80 శాతం పైగా అంధత్వం ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. ఆయుర్వేదంతో పాటు పలు రకాల వైద్యం చేయించుకున్నా ఫలితం కనిపించలేదు.

ఎగతాళి చేసేవారు..

నేను ఏదైనా ఒక వస్తువునే చూడగలను. దాని చుట్టూ ఉన్నవి అలికినట్టు కనపడతాయి. బాల్యంలో నా సమస్యను ఎవరికీ చెప్పుకోలేకపోయాను. ఒకసారి స్కూల్‌లో పరుగెడుతున్నప్పుడు మధ్యలో స్తంభం అడ్డుంటే నాకు కనిపించక.. దాన్ని ఢీకొట్టా. ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావమైంది. నాకు క్రీడలంటే ఇష్టమున్నా అప్పటి నుంచి ఆటలకు దూరమయ్యా. చదువులోనూ వెనకపడ్డా. బోర్డు పైన అక్షరాలు సరిగ్గా కనిపించక, నోట్స్ రాయలేకపోయేదాన్ని. విన్న పాఠాలనే నెమరేసుకుని, అవే పరీక్షల్లో రాశాను. మంచి మార్కులు రానివారిని వెనుక బెంచీల్లో కూర్చోబెట్టేవారు. ఎందుకు సరిగ్గా చదవడం లేదని టీచర్లు తిట్టేవారు. నాకు కళ్లజోడు పెట్టుకున్నా ఏం కనిపించదని తోటి విద్యార్థులు ఎగతాళి చేసేవారు. ఎనిమిదో తరగతికి వచ్చాక కానీ నా కంటి సమస్య గురించి ఉపాధ్యాయులకు తెలియలేదు. తర్వాత స్కూల్‌లో ఉపాధ్యాయులు నా గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

అనుకోని మలుపు..

నాకున్న అంధత్వంతో సాధారణ స్కూల్‌లో చదవడం కష్టమనిపించి తొమ్మిదో తరగతి తర్వాత బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో చేరా. అంతవరకు ఒక తరహా విద్యావిధానానికి అలవాటు పడిన నాకు, ఈ స్కూల్‌లో అంతా కొత్తగా అనిపించింది. దాంతో ఇంటర్మీడియేట్‌కు వచ్చేసరికి మళ్లీ సాధారణ కాలేజ్‌లో చేరి ఎంఈసీ పూర్తి చేశా. ఆ తర్వాత చినజీయర్ స్వామి నేత్ర విద్యాలయ ట్రస్టులో బీకాం కంప్యూటర్స్ చదివా. ఇక్కడకు వచ్చాక నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. స్వామివారి సహకారంతో క్రికెట్, పవర్ లిఫ్టింగ్‌ల్లో శిక్షణ తీసుకోవడం ప్రారంభించా.

టీమిండియా ప్రాబబుల్స్‌లో..

నాకు క్రికెట్ అంటే బాగా ఇష్టం. నేత్ర విద్యాలయలో చేరిన తర్వాత క్రికెట్ అంటే ఆసక్తి ఉన్నవారితో కలిసి టీమ్ తయారు చేశా. నేను పేస్ ఆల్‌రౌండర్‌ని. ఎడమ చేతివాటం బౌలర్, కుడి చేతివాటం బ్యాటర్‌ని. రాష్ట్ర స్థాయిలో వివిధ అంధ పాఠశాల జట్లతో తలపడ్డాం. మా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాను. 2023లో జాతీయ స్థాయి అంధుల క్రికెట్ పోటీల్లో తెలంగాణ జట్టుకు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించా. ఈ టోర్నీలో ఉత్తమ బ్యాటర్, బౌలర్ అవార్డులతో పాటు బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డు కూడా గెలుచుకున్నా. వచ్చే నవంబరులో ప్రపంచ మహిళల అంధుల క్రికెట్ వరల్డ్‌కప్ ఉంది. దాని కోసం టీమిండియాకు ఎంపిక చేసిన 29 మంది ప్రాబబుల్స్‌లో తెలంగాణ నుంచి నాకు మాత్రమే చోటు లభించింది. టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాలనేది నా చిరకాల స్వప్నం. జట్టులో స్థానమే లక్ష్యంగా కఠోర సాధన చేస్తున్నా. 'క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లయిండ్'లో కర్ణాటకకు చెందిన శిఖా మేడమ్ నన్ను ఎంతో ప్రోత్సహిస్తున్నారు.



జాలి... దయ చూపించొద్దు...

గుడ్డివాళ్లు అనగానే కొందరు జాలి, దయ చూపిస్తారు. మరికొందరు ఈసడించుకుంటారు. దయచేసి అలా ఎవరూ చూడవద్దు. ఇలా వ్యవహరించడం వల్ల తెలియకుండానే మాలో ఏదో ఆత్మనూన్యత భావన ఏర్పడతుంది. మమ్మల్ని సాధారణ వ్యక్తులుగానే చూడండి. అలానే ఆదరించండి. మా బంధువులు చాలా మంది నేను ఎదురుపడినప్పుడు ఎక్కడలేని జాలి చూపిస్తారు. నేను కొంచెం పక్కకి వెళ్లాక 'ఇంట్లో ఒక మూల కూర్చోక ఈ గుడ్డి దానికి ఈ ఆటలు, పాటలు ఎందుకని నా వెనకాల తిడుతుంటారు. ఇలాంటి వాటిని పట్టించుకుంటే జీవితంలో ముందుకు వెళ్లలేం. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడడం పెద్ద తప్పు. మన కష్టం ఏదో మనమే పడాలి. ఎవరైనా సహాయం చేసినా అది కొంతవరకే. చివరి వరకు ఎవరూ తోడు ఉండరు. కాబట్టి ఒకరిపై ఆధారపడకుండా మన కాళ్లపై మనమే నిలబడాలి.

పవర్‌లిఫ్టింగ్‌లో...

నా శరీర ధారుడ్యం బట్టి క్రికెట్‌తో పాటు అథ్లెటిక్స్‌లో కూడా పాల్గొనమని నేత్ర విద్యాలయలో కృష్ణ కుమారి మేడం ప్రోత్సహించారు. అలా 2020లో జరిగిన రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్, డిస్కస్ త్రో, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించా. తాజాగా తొలిసారిగా జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నా. గత నెల ఉడుపీలో జరిగిన ఈ పోటీల్లో 69 కిలోల విభాగంలో 155 కిలోల బరువెత్తి స్వర్ణ పతకం సాధించి, జాతీయ చాంపియన్‌గా నిలిచా. ఎల్బీ స్టేడియంలో శాట్ కోచ్‌లు రవి, ప్రవీణ్ సార్‌లు అతితక్కువ కాలంలో నన్ను ఈ పోటీలకు సిద్ధం చేశారు. ఇప్పటివరకు నేను ఏ పోటీల్లో బరిలోకి దిగాలన్న చినజీయర్ స్వామి ట్రస్టు సాయంతోనే పాల్గొనగలిగా. ఆ విషయంలో స్వామివారికి జీవితాంతం రుణపడి ఉంటా.

రోడ్డు ప్రమాదంతో..

మూడేళ్ల కిందట నేను ముచ్చింతల్ నేత్ర విద్యాలయంలో చదువుతున్నప్పుడు రోడ్డు ప్రమాదంలో నేను నాన్న గాయపడ్డాం. నాన్నతో బైక్ మీద విద్యాలయంకు వెళుతుండగా. వేరే వాహనం ఢీకొట్టింది. నా మోకాలికి దెబ్బ తగిలింది. నాన్న వెన్నులో ఎముకలు విరగడం వల్ల శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి నాన్న మూడేళ్లు మంచానికే పరిమితమయ్యారు. దీంతో మా కుటుంబ ఆర్థిక పరిస్థితి తలకిందులైంది. అమ్మపైనే కుటుంబ భారం పడింది. ఇప్పుడిప్పుడే నాన్న కాస్త నడవగలుగుతున్నారు. నా లక్ష్యం ఒక్కటే క్రికెట్‌లో బాగా రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలి. తర్వాత సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలి. మంచి వ్యాపారవేత్తగా గుర్తింపు పొందాలి."

● ఎస్.ఎస్.బి.సంజయ్

స్ఫూర్తి



ఆశయం సమున్నతం

క్రికెట్‌లో అంపైరింగ్ అనగానే మనకు వెంటనే గుర్తుకువచ్చేది మగవారే. కానీ ఇప్పుడిప్పుడే ఆడవారు కూడా ఆ పాత్రలోకి ఒదిగిపోతున్నారు. కేవలం మహిళల మ్యాచ్‌లకే పరిమితం కాకుండా... పురుషుల ఆటకు కూడా అంపైరింగ్ చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. అలాంటి ఔత్సాహికుల్లో ఒకరు... వెంకటేశన్ కృతిక. చెన్నైకు చెందిన ఆమె... ఇటీవల క్రికెటర్ అశ్విన్ వివాదంతో వార్తల్లో వ్యక్తి అయ్యారు. అంపైర్లుగా అంతర్జాతీయ క్రికెట్‌లో తమదైన ముద్ర వేసిన బృందా రతి, గాయత్రి వేణుగోపాలన్ స్ఫూర్తితో అడుగులు వేస్తున్న కృతిక జర్నీ ఇది.

క్రికెట్ అంటే కృతికకు చిన్నప్పటి నుంచీ చాలా ఇష్టం. బ్యాటింగ్, బౌలింగ్... రెండింటిలో ఆమెకు మంచి ప్రవేశం ఉంది. తమిళనాడు మహిళల జట్టు తరఫున ఎన్నో మ్యాచ్‌లు ఆడారు. ఆటకు సంబంధించిన ప్రతి అంశాన్నీ కూలంకషంగా పరిశీలించడమే కాదు... చక్కగా వివరించగలగడం ఆమె ప్రత్యేకత. మహిళల టీ20 లీగ్ మ్యాచ్‌లకు వ్యాఖ్యాతగా ఆమె అందరికీ సుపరిచితురాలు. తమిళనాట నిర్వహించిన పురుషుల టీ20 సహా పలు ఇతర మ్యాచ్‌లకూ అంపైర్‌గా వ్యవహరించారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారిణులను గుర్తించే టాలెంట్ స్కౌట్‌గా కూడా పని చేశారు. 2023 మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు క్రీడాకారిణులను ఎంపిక చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. గత ఏడాది తమిళనాడు ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌కు రిజర్వ్ అంపైర్‌గా వ్యవహరించారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొన్నారు. 'ఆడవారికైనా... మగవారికైనా అంపైరింగ్ అనేది ఒకేలా ఉంటుంది. నియమ నిబంధనల్లో తేడా ఉండదు. అంపైరింగ్‌లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొన్ని మ్యాచ్‌లు చాలా గంభీరంగా ఉంటాయి. కొన్ని అహ్లాదకరంగా సాగిపోతుంటాయి. ఆట తీరు ఎలా ఉన్నా అంపైర్ మాత్రం స్థిరంగా ఉండాల్సిందే" అంటారు కృతిక.

కుటుంబమే బలం...

'మగవారికి మాత్రమే పరిమితం అనే భావనను అధిగమించి ఇక్కడి దాకా ఎదిగానంటే అందుకు నా కుటుంబం అందించిన తోడ్పాటు మరువలేనిది. రాష్ట్రాలు దాటి ప్రయాణించడం నా వృత్తిలో భాగం. దీనికి తల్లిదండ్రులు, అత్తమామలు, భర్త, పిల్లలు సహకరించడం నా అదృష్టం. మొదట్లో పురుషుల మ్యాచ్‌లకు ఒక మహిళ అంపైర్‌గా వ్యవహరించడం అనేది సందేహాత్మకంగా ఉండేది. రానురానూ ఈ ధోరణి మారింది. క్రమేణా ఆటగాళ్లందరూ మమ్మల్ని అంగీకరించి సహకరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అభినందిస్తున్నారు కూడా. ఈ పరిస్థితి... అంపైర్లుగా రాణించాలనుకునే మహిళలకు ప్రోత్సాహాన్ని, ధైర్యాన్ని అందిస్తుంది. తమిళనాడు ప్రీమియర్ లీగ్ పురుషుల మ్యాచ్‌కు అంపైర్‌గా పనిచేయడం నాకు మంచి గుర్తింపునిచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగే మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయాలన్నదే నా కల. దానిని నెరవేర్చుకోవడం కోసం అహర్నిశలూ శ్రమిస్తూనే ఉంటాను" అంటూ తన భావాలు పంచుకున్నారు కృతిక.

> 'మగవారికి మాత్రమే పరిమితం అనే భావనను అధిగమించి ఇక్కడి దాకా ఎదిగానంటే అందుకు నా కుటుంబం అందించిన తోడ్పాటు మరువలేనిది. రాష్ట్రాలు దాటి ప్రయాణించడం నా వృత్తిలో భాగం. దీనికి తల్లిదండ్రులు, అత్తమామలు, భర్త, పిల్లలు సహకరించడం నా అదృష్టం.

ఆ వివాదంతో...

తమిళనాడు ప్రీమియర్ లీగ్ సీజన్‌లో దిండిగల్ డ్రాగన్స్, ఐడ్రీమ్ తిరుప్పూర్ తమిళియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో వివాదాస్పద సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. దిండిగల్ డ్రాగన్స్ జట్టుకు సారథ్యం వహించిన స్టార్ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్... సాయి కిషోర్ వేసిన బంతిని స్వీప్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. కానీ బంతి ప్యాడ్‌లకు తగిలింది. దీంతో అంపైర్ కృతిక ఎల్‌బీడబ్ల్యూగా ప్రకటించారు. వెంటనే అశ్విన్ కోపంగా అంపైర్ దగ్గరకు వెళ్లి బంతి లెగ్‌స్టంప్ బయట పిచ్ అయిందంటూ వాదించాడు రీప్లేలో అది నిజమని తేలినా... అప్పటికే డ్రాగన్ జట్టు రెండు రివ్యూలూ కోల్పోవడంతో అశ్విన్ రివ్యూకు వెళ్లలేకపోయాడు. అయితే కృతిక... ఇవేమీ పట్టించుకోకుండా మౌనంగా ఉన్నారు. మైదానాన్ని వీడుతూ అశ్విన్ కోపంగా బ్యాట్‌తో తన ప్యాడ్‌లను కొట్టుకున్నాడు. గ్యాలరీలోకి గ్లౌవ్స్ విసిరేశాడు. ఒక మహిళ అంపైర్‌పై అశ్విన్ ఇలా కోపం ప్రదర్శించడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అశ్విన్ కోపాన్ని అర్థం చేసుకుని అంపైర్ కృతిక హుందాగా ప్రవర్తించారంటూ నెటిజన్లు అభినందిస్తున్నారు.

ఆసనాలతో పొట్ట తగ్గిద్దాం!

మారిన జీవనశైలి, ఎక్కువ సేపు కూర్చుని పనిచేయడం వంటి కారణాలతో ఈ రోజుల్లో పొట్ట పెరగడం సాధారణం అయిపోయింది. అయితే కొన్ని యోగా ఆసనాలతో ఆ పొట్టను తగ్గించుకోవచ్చు. అవేంటో తెలుసుకుందాం..



నౌకాసనం : ముందుగా నేలమీద కాళ్లను చాపి కూర్చోవాలి. తర్వాత చేతులను తొడల కింద పెట్టి రెండు కాళ్లను పైకి లేపాలి. అలా లేపుతూ శరీరాన్ని కొంచెం వెనక్కి వంచాలి. ఇలా శరీరం V ఆకారంలోకి వచ్చేలా చేయాలి. తర్వాత చేతులను నిటారుగా చాపాలి. ఇప్పుడు శరీరం బరువంతా పిరుదుల మీద ఉంటుంది. 10-20 క్షణాల పాటు ఇలానే ఉండాలి. కొన్ని రోజులు అలవాటు అయిన తరువాత సమయం పెంచుకోవాలి. ఈ ఆసనం వలన పొట్టభాగంలోని కండరాలు కదిలి కొవ్వు తగ్గి పొట్ట తగ్గుతుంది. అలాగే జీర్ణక్రియ పెరుగుపడుతుంది. పొట్ట భాగానికి రక్తప్రసరణ మెరుగుపడుతుంది.




సేతు బంధ సర్వాంగాసనం : ముందుగా నేలపై పడుకోవాలి. మోకాళ్లను మడిచి భుజాలు, చేతులను నేలమీద ఆధారం చేసి నడుమును పైకి లేపాలి. ఇలా 20-30 క్షణాల పాటు ఉండాలి. ఆ భంగిమ మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది.



కుంభకాసనం : చేతులను నేలకు ఆనించి పుష్-అప్స్ చేసే భంగిమలో ఉండాలి. ఇలా నడుపు, కాళ్లు వంచకుండా 20-30 క్షణాల పాటు ఉండాలి. ఈ ఆసనం వలన పొట్ట భాగంలోని కొవ్వు తగ్గుతుంది. అలాగే చేతులు, నడుము బలంగా మారుతాయి.



భుజంగాసనం : ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. అరచేతులను నేలకు ఆనించి వాటి ఆధారంతో మెడను పైకి ఎత్తాలి. అరచేతులు నడుము కింద భాగం మాత్రమే నేలకు ఆనాలి. ఇలా 20- 30 సెకన్ల పాటు ఉండి నెమ్మదిగా మాములు స్థితికి రావాలి. ఈ భంగిమ వలన పొట్ట, నడుము కండరాలు బలపడతాయి. ఒత్తిడి కూడా తగ్గుతుంది. పొట్ట భాగంలోని కొవ్వు తగ్గుతుంది.



త్రికోణాసనం : ముందు కాళ్లను దూరంగా పెట్టి నిల్చోవాలి. ఇప్పుడు కుడి కాలిని కొంచెం దూరంగా జరిపి ఆ పక్కకు వంగి కుడి చేతితో ఆ కాలి పాదాలను తాకాలి. ఈ సమయంలో ఎడమ చేతిని నిటారుగా పైకి లేపాలి. ఓ ఇరవై క్షణాల పాటు అలా ఉండి మాములు స్థితి రావాలి. ఇప్పుడు ఇలానే ఎడమ వైపు కూడా చేయాలి. ఈ ఆసనం పొట్టను తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నడుము, కాళ్లు, చేతులను బలోపేతం చేస్తుంది.

సగ్గు బియ్యంతో ఇన్ని ఉపయోగాలా!



సగ్గుబియ్యంతో చేసిన వంటలు ఇష్టపడని వారు ఉండకపోవచ్చు. జ్వరం, విరోచనాలు వంటి సమస్యలు పీడిస్తున్నప్పుడు సగ్గుబియ్యం జావ, పాయసం నీరసం నుంచి ఉపశమనం కలిగిస్తాయి.. అలాంటి సగ్గుబియ్యం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలివీ..

- బరువు తగ్గాలనుకునేవారికి సగ్గుబియ్యం ఓ వరంలాంటిది. ఇందులోని అధిక ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. అలాగే ఇందులో క్యాలరీలు కూడా తక్కువ కావడంతో బరువు తగ్గేందుకు బాగా సహాయపడుతుంది.
- సగ్గుబియ్యంలో ఉండే క్యాల్షియం ఎముకల దృఢత్వానికి దోహదం చేస్తుంది.
- సగ్గుబియ్యం జావ శరీరంలో వేడిని తగ్గిస్తుంది.
- శరీరంలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేయడంలో సగ్గుబియ్యం సహాయపడతాయి.
- సగ్గుబియ్యంలోని పొటాషియం అధిక రక్తపోటును నియంత్రిస్తుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

నేరేడు ప్రయోజనాలెన్నో!



నేరేడు పళ్ల సీజన్ వచ్చింది. నల్లగా నిగనిగలాడుతూ చూడగానే తినేయాలనిపించే ఈ పళ్ల వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం..

- నేరేడు పళ్లలోని జాంబోలిన్, జాంబోసిన్ అనే ఫైటో కెమికల్స్ ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. దాంతో రక్తంలో చక్కెర స్థాయులు నియంత్రణలో ఉంటాయి.
- ఈ పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది.
- నేరేడు పళ్లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- ఈ పళ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.
- వీటిలోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఫ్రీ రాడికల్స్ నుంచి కణాలను రక్షిస్తాయి.
- నేరేడు పళ్లలోని ఐరన్ రక్తహీనతను దూరం చేస్తుంది.
- వీటిలోని పొటాషియం, కాల్షియంలు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- నేరేడు పళ్లలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు నోటిలోని ఇన్ఫెక్షన్లను తగ్గిస్తాయి. అలాగే మాడు మీద ఇన్ఫెక్షన్లను తగ్గించి, శిరోజాల పెరుగుదలకు సహాయపడతాయి.
- వీటిలోని విటమిన్ సి, యాంటి ఆక్సిడెంట్లు.. మచ్చలు, గాయాలను తగ్గించి చర్మం మెరిసేలా చేస్తాయి.

స్పోర్ట్స్

గుంటూరు ● సోమవారం 7 జూలై 2025

క్యాన్సర్‌తో బాధపడుతున్న నా సోదరికి ఈ ప్రదర్శన అంకితం

ఆకాశ్ దీప్

"ఇప్పటి వరకు నేనీ విషయం ఎవరికీ చెప్పలేదు. కానీ రెండు నెలల క్రితం నా సోదరికి క్యాన్సర్ సోకింది. బంతి చేతికి తీసుకున్న ప్రతీసారి తన ఆలోచనలే నా మదిలో కదలాడేవి. ఈ ప్రదర్శన ఆమెకే అంకితమిస్తున్నా. అలాగే ఈ సందర్భంగా తనకో విషయం చెప్పదల్చుకున్నా. మేమంతా మీ వెంటే ఉంటాం."



ఆకాశ్‌దీప్ (6/99)కు సహచరుల అభినందన

గిల్ సేన విజయ గర్జన

దిగ్గజ క్రికెటర్లు జట్టుకు దూరమయ్యారు.. గెలవాల్సిన తొలి టెస్టును అనుభవలేమితో కోల్పోయారు.. ఇక రెండో టెస్టులో స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి ఏం సాధిస్తారంటూ విమర్శలు.. అయినా అందరి సందేహాలను పటాపంచలు చేస్తూ యువ భారత్ ఎడ్జ్‌బాస్టన్‌లో సగర్వంగా నిలిచింది. దాదాపు ఆరు దశాబ్దాల నుంచి భారత్ ఈ వేదికపై దండయాత్ర చేస్తున్నా గెలుపు రుచి చూసిందే లేదు. ఇదిగో.. ఇన్నాళ్లకు కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలోని యువ ఆటగాళ్లు కలిసికట్టుగా చరిత్రాత్మక విజయాన్ని కళ్లముందుంచారు. 608 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్‌ను పేసర్ ఆకాశ్ దీప్ ఆరు వికెట్లతో దెబ్బతీయడంతో మరో సెషన్ ఉండగానే జట్టు సంబరాలు చేసుకుంది. అంతకుముందు గిల్ బాదిన డబుల్ సెంచరీ, భారీ శతకం ఈ విజయంలో అత్యంత కీలకంగా నిలిచాయనడంలో సందేహం లేదు.

టీమిండియాదే రెండో టెస్టు

- 336 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు
- రెండో ఇన్నింగ్స్‌లో 271 ఆలౌట్
- ఆరు వికెట్లతో ఆకాశ్‌దీప్ విజృంభణ
- ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌కు తొలి గెలుపు

బర్మింగ్‌హామ్: టీమిండియా విజయ లాంఛనాన్ని ముగించింది. చివరి రోజు ఆదివారం ఇంగ్లండ్ డ్రా కోసం ప్రయత్నిస్తుందనుకున్నా.. భారత బౌలర్లు వారి ఆటలు సాగనీయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ సత్తాచాటితే, రెండో ఇన్నింగ్స్‌లో పేసర్ ఆకాశ్‌దీప్ (6/99) స్టోక్స్ సేన భరతం పట్టాడు. దీంతో ఇంగ్లండ్‌పై 336 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. ఐదు టెస్టుల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. ఎడ్జ్‌బాస్టన్‌లో 58 ఏళ్ల తర్వాత భారత్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 1967 నుంచి ఇప్పటిదాకా ఆడిన ఎనిమిది టెస్టుల్లో ఏడింటిలో ఓడిన భారత్, ఓ మ్యాచ్‌ను డ్రాగా చేసుకుంది. ఇక.. 608 పరుగుల ఛేదనలో ఆతిథ్య ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 271 పరుగులకే కుప్పకూలింది. జేమీ స్మిత్ (88), బ్రైడన్ కార్స్ (38), సారథి బెన్ స్టోక్స్ (33) రాణించారు. మ్యాచ్ మొత్తమ్మీద పేసర్ ఆకాశ్‌కు పది వికెట్లు దక్కాయి. కెప్టెన్‌గా తొలి విజయం అందుకున్న శుభ్‌మన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.



గిల్

ఆరంభంలోనే రెండు వికెట్లు: చివరి రోజు ఆటకు ముందు వర్షం కురవగా, తొలి సెషన్‌కు గంటా 40 నిమిషాలపాటు అంతరాయం కలిగింది. ఈ కారణంగా మూడు సెషన్లను 80 ఓవర్లకు కుదించారు. ఇక 608 పరుగుల అసాధ్య ఛేదన కోసం 72/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. అయితే ఆకాశ్ చక్కటి సీమ్‌తో వీరిని కుదురుకోనీయలేదు. సెషన్ నాలుగో ఓవర్‌లోనే పోప్ (24)ను బౌల్డ్ చేశాడు. తన తర్వాతి ఓవర్‌లోనే బ్రూక్ (23)ను ఎల్బీ చేయడంతో ఇంగ్లండ్ 83/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ ఊపులో వికెట్ల పతనం సాగుతుందనిపించినా.. స్టోక్స్-స్మిత్ జోడీ నిలువరించింది. స్పిన్నర్ జడేజా మాత్రం వీరిని ఇబ్బందిపెట్టాడు. కానీ సిరాజ్ ఓవర్లలో మాత్రం స్టోక్స్ బౌండరీలు రాబట్టాడు. లంచ్ బ్రేక్‌కు మరో రెండు నిమిషాలు ఉందనగా బంతి తీసుకున్న జడేజా 100 సెకన్లలోనే ఆ ఓవర్‌ను ముగించాడు. దీంతో మరో ఓవర్‌కు సమయం మిగిలింది. ఈ ఓవర్‌ను స్పిన్నర్ సుందర్ వేసి స్టోక్స్ వికెట్ తీయడంతో ఇంగ్లండ్‌కు గట్టి ఝలక్ తగిలింది. అలాగే ఆరో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

కూల్చారు..: విజయానికి కేవలం నాలుగు వికెట్ల దూరంలో భారత్ రెండో సెషన్‌ను ఆరంభించింది. అయితే వోక్స్ (7) డిఫెన్స్‌కు పరిమితం కాగా స్మిత్ ఎదురుదాడికి దిగాడు. సుందర్ ఓవర్‌లో అతడు 6,4,6తో 17 రన్స్ రాబట్టాడు. అటు వోక్స్‌ను ప్రసిద్ధ్ అవుట్ చేసి ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచాడు. కాసేపటికే ఆకాశ్ ఓవర్‌లో స్మిత్ వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. అయితే అదే ఓవర్‌లో స్లో బాల్‌కు స్మిత్ ఆడిన పుల్ షాట్ సుందర్ చేతుల్లో పడింది. దీంతో ఆకాశ్ తొలిసారి ఐదు వికెట్ల ఫీట్ సాధించాడు. అటు జడేజా ఓవర్‌లో కార్స్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో ఉన్న రాహుల్ వదిలేశాడు. కానీ టంగ్ (2) క్యాచ్‌ను షార్ట్ మిడ్ వికెట్‌లో సిరాజ్ తన కుడి వైపునకు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో అందుకున్నాడు. ఇక చివరి వికెట్‌ను త్వరగా తీద్దామనుకున్న భారత్‌ను కార్స్-బషీర్ కాసేపు విసిగించారు. పైగా బషీర్ (12 నాటౌట్) ఓ సిక్స్ బాదగా.. ఆకాశ్ ఓవర్‌లో కార్స్ మూడు ఫోర్లు సాధించాడు. చివరకు పదో వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం అందించాక కార్స్‌ను ఆకాశ్ అవుట్ చేయడంతో భారత్ అద్భుత విజయం దక్కించుకుంది.

మధురాతి మధురం!



ఇంగ్లండ్ గడ్డపై భారత జట్టు టెస్టు మ్యాచ్ గెలిచి దాదాపు నాలుగు సంవత్సరాలైంది. కరోనా మహమ్మారి సమయంలో ఆ దేశంలో పర్యటించిన టీమిండియా..ఆ సిరీస్ నాలుగో టెస్టులో 157 పరుగుల తేడాతో నెగ్గింది. ఇక ఈసారి గెలుపు జట్టుకు ఎంతో..ఎంతో ప్రత్యేకం. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్ వంటి దిగ్గజ ఆటగాళ్లు లేకుండా ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటిస్తోంది. పైగా..కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జట్టులోనూ అంతా కుర్రాళ్లు. జట్టు పరివర్తన దిశగా సాగుతోంది. మరోవైపు స్టోక్స్, రూట్స్, వోక్స్‌లాంటి క్రికెటర్లతో ఇంగ్లిషు జట్టు పటిష్టంగా ఉంది. అలాంటి జట్టును వారి గడ్డపై ఓడించడం అంటే మామూలు విషయం కాదు. పైగా తొలి టెస్టు ఓటమి నుంచి త్వరగా కోలుకొని రెండో మ్యాచ్‌లో ప్రత్యర్థిని మట్టి కరిపించడం యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టుకు మరెంతో విశేషం. ముఖ్యంగా సారథి గిల్ జట్టును నడిపించిన తీరు అద్భుతం. మొదటి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో విజయంలో కీలక భూమిక పోషించాడు. అంతేకాదు..కెప్టెన్సీ భారం కాదని రెండు ఇన్నింగ్స్‌ల్లో తన ఆటతీరుతో నిరూపించాడు. యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, పంత్ తమ వంతు పాత్ర సమర్థంగా నిర్వర్తిస్తే, బుమ్రా లేని లోటును మరిపిస్తూ సిరాజ్, ఆకాశ్‌దీప్ ప్రత్యర్థిని గడగడలాడించారు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాదీ సిరాజ్ ఆరు వికెట్లతో చెలరేగితే..నేనేమన్నా తక్కువ తిన్నానా..అంటూ ఆకాశ్‌దీప్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. మొత్తంగా సమష్టితత్వంతో దక్కిన ఈ విజయం భారత్‌కు మధురాతి మధురం. ఈ గెలుపు దరిమిలా లభించిన ఆత్మవిశ్వాసంతో విశ్వవిఖ్యాత లార్డ్స్ మైదానంలో జరిగే మూడో టెస్టుకు భారత్ ఇనుమడించిన ఉత్సాహంతో బరిలో దిగుతుందనడంలో సందేహం లేదు. ఇదే ఊపులో మనోళ్లు టెస్టు సిరీస్ సొంతం చేసుకోవాలని ఆశిద్దాం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

1

ఒకే టెస్టులో ఎక్కువ పరుగులు (272) సాధించిన ఇంగ్లండ్ వికెట్ కీపర్‌గా జేమీ స్మిత్. స్టీవార్ట్ (204)ను అధిగమించాడు.

ఇంగ్లండ్‌లో జరిగిన సిరీస్‌లో ఇరు జట్ల వికెట్ కీపర్లు (పంత్-స్మిత్) కలిసి అత్యధిక పరుగులు (697) సాధించడం ఇదే తొలిసారి. గతంలో స్టీవార్ట్-హీలీ (674 రన్స్) పేరిట ఈ రికార్డు ఉండేది.

భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన ఓ టెస్టు మ్యాచ్‌లో ఎక్కువ పరుగులు (1692) నమోదవడం ఇదే తొలిసారి.

ఇంగ్లండ్‌లో జరిగిన టెస్టు మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లు (30) నమోదవడం ఇదే మొదటిసారి.

'సేనా' దేశాలపై భారత టెస్టు జట్టుకిదే భారీ విజయం (336 రన్స్ తేడాతో).

2

ఇంగ్లండ్‌లో పది వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా ఆకాశ్ దీప్. గతంలో చేతన్ శర్మ (1986లో 10/188) ఈ ఫీట్ సాధించాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 407; భారత్ రెండో ఇన్నింగ్స్: 427/6 డిక్లేర్;

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: డకెట్ (బి) ఆకాశ్‌దీప్ 25, క్రాలే (సి/సబ్) సాయి సుదర్శన్ (బి) సిరాజ్ 0, పోప్ (బి) ఆకాశ్‌దీప్ 24, రూట్ (బి) ఆకాశ్‌దీప్ 6, బ్రూక్ (ఎల్బీ) ఆకాశ్‌దీప్ 23, స్టోక్స్ (ఎల్బీ) వాషింగ్టన్ 33, జేమీ స్మిత్ (సి) వాషింగ్టన్ (బి) ఆకాశ్‌దీప్ 88, వోక్స్ (సి) సిరాజ్ (బి) ప్రసిద్ధ్ 7, కార్స్ (సి) గిల్ (బి) ఆకాశ్‌దీప్ 38, టంగ్ (సి) సిరాజ్ (బి) జడేజా 2, బషీర్ (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 68.1 ఓవర్లలో 271 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-11, 2-30, 3-50, 4-80, 5-83, 6-153, 7-199, 8-226, 9-246, 10-271; **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 21.1-2-99-6, సిరాజ్ 12-3-57-1, ప్రసిద్ధ్ 14-2-39-1, జడేజా 15-4-40-1, వాషింగ్టన్ సుందర్ 6-2-28-1.

క్వార్టర్స్‌లో సబలెంక

వింబుల్డన్

లండన్: టాప్ సీడ్ అర్యానా సబలెంక వింబుల్డన్ టైటిల్ దిశగా మరో అడుగు వేసింది. ఈ బెలారస్ భామ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. పురుషుల ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్, 17వ సీడ్ ఖచనోవ్ కూడా రౌండ్-8కి చేరారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో ప్రపంచ నెంబర్ వన్ సబలెంక 6-4, 7-6 (4)తో 24వ సీడ్ మెర్టెన్స్‌పై గెలుపొందింది. ఇతర మ్యాచ్‌ల్లో లారా సిగ్మండ్ 6-3, 6-2తో సీరాపై, పల్యుచెన్కోవా 7-6 (3), 6-4తో సోనె కర్తాల్‌పై నెగ్గారు. పురుషుల సింగిల్స్‌లో ఫ్రిట్జ్ 6-1, 3-0తో జోర్డాన్‌పై ఆధిక్యంలో ఉన్నప్పుడు గాయంతో ప్రత్యర్థి వైదొలిగాడు. దాంతో ఫ్రిట్జ్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. 17వ సీడ్ ఖచనోవ్ 6-4, 6-2, 6-3తో మచ్‌జక్‌ని ఓడించాడు.

సాక్షీ ధండా పసిడి పంచ్



అస్తానా (కజకిస్థాన్): రెండుసార్లు యూత్ వరల్డ్ చాంపియన్ సాక్షీ ధండా ప్రపంచ బాక్సింగ్ కప్‌లో పసిడి పంచ్ విసిరింది. ఆదివారం జరిగిన మహిళల 54 కిలోల విభాగం ఫైనల్లో అమెరికా బాక్సర్ యాస్లిన్ పెరెజ్‌ను ఓడించి సాక్షి స్వర్ణ పతకం సాధించింది. మీనాక్షి (48 కి), పూజా రాణి (80 కి), జుగ్ను (85 కి) రజత పతకాలు అందుకున్నారు.

గుకేష్‌కు మూడో స్థానం

విజేత కార్ల్‌సన్

జాగ్రెబ్ (చెక్ రిపబ్లిక్): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరిగిన సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్ ఓవరాల్‌గా 19.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలవగా.. ప్రజ్ఞానంద 15 పాయింట్లతో 9వ స్థానం దక్కించుకొన్నాడు. కార్ల్‌సన్ 22.5 పాయింట్లతో టోర్నీ విజేతగా నిలవగా.. సో వెస్లీ (20)కి రెండోస్థానం దక్కింది. బ్లిట్జ్‌లో కార్ల్‌సన్ (12.5) అగ్రస్థానాన్ని దక్కించుకొన్నాడు. కాగా, ర్యాపిడ్‌లో 14 పాయింట్లతో విజేతగా నిలిచిన గుకేష్.. బ్లిట్జ్‌లో 18 రౌండ్ల నుంచి 5.5 పాయింట్లతో చివరిస్థానానికే పరిమితమయ్యాడు.

ముల్డర్ 'డబుల్'.. దక్షిణాఫ్రికా 465/4

బులవాయో: కెప్టెన్ ముల్డర్ (264) అజేయ ద్విశతకంతో చెలరేగిన వేళ..జింబాబ్వేతో రెండో టెస్టు తొలిరోజే దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 465/4 స్కోరు చేసింది. బెడింగ్‌హామ్ (82)తో కలిసి మూడో వికెట్‌కు 184 పరుగులు జోడించిన ముల్డర్..ప్రిటోరియస్ (78)తో నాలుగో వికెట్‌కు 217 రన్స్ జత చేశాడు.

కంపెనీలకు మేకిన్ ఇండియా ఊతం

- 2035 నాటికి రూ.837 లక్షల కోట్ల జీవీఏ
- పీడబ్ల్యూసీ ఇండియా

న్యూఢిల్లీ: దేశీయ పారిశ్రామిక రంగానికి భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా) బాగానే ఉపకరిస్తోంది. దీంతో 2035 నాటికి దేశీయ కంపెనీల స్థూల విలువ జోడింపు (జీవీఏ) 9.82 లక్షల కోట్ల డాలర్ల (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ..837.15 లక్షల కోట్లు) వరకు ఉంటుందని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ప్రైస్‌వాటర్ హౌస్ కూపర్స్ (పీడబ్ల్యూసి) ఇండియా ఒక నివేదికలో తెలిపింది. ఇందులో తయారీ, పారిశ్రామిక రంగాలది అగ్రస్థానమని పేర్కొంది. 2023 నాటికి 94,500 కోట్ల డాలర్లుగా ఉన్న ఈ రెండు రంగాల జీవీఏ 2035 నాటికి 2.75 లక్షల కోట్ల డాలర్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. 'నావిగేటింగ్ ది వాల్యూ షిఫ్ట్' పేరుతో పీడబ్ల్యూసి ఇండియా ఈ నివేదిక విడుదల చేసింది. వాతావరణ మార్పులు, సాంకేతిక అవాంతరాలు, మారుతున్న ప్రజల అభిరుచులతో సంప్రదాయ పరిశ్రమల సరిహద్దులు చెరిగిపోతూ అదనపు విలువ జోడింపు జరగనుందని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక తెలిపింది.

పీఎస్‌బీల్లో కొలువుల జాతర

- ఈ సంవత్సరం 50,000 పోస్టుల భర్తీ
- ఒక్క ఎస్‌బీఐలోనే 20 వేల నియామకాలు

న్యూఢిల్లీ: దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూటు మార్చాయి. పెద్ద ఎత్తున నియామకాలకు సిద్ధమవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం దాదాపు 50,000 నిమామకాలు చేపట్టనున్నాయి. ఇందులో 21,000 ఉద్యోగాలు ఆఫీసర్ పోస్టులు. మిగతా 29,000 క్లరికల్ పోస్టులు. ఇవే బ్యాంకులు గతంలో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందనే పేరుతో 2001లో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకం ద్వారా లక్ష మంది పైగా ఉద్యోగులను ఇంటికి పంపించాయి. అప్పట్లో 26 పీఎస్‌బీలుంటే విలీనాలతో ఇపుడు వాటి సంఖ్య 12కు తగ్గిపోయింది. అయినా పీఎస్‌బీలు మళ్లీ పెద్ద ఎత్తున నియామకాలకు దిగడం విశేషం. పెరుగుతున్న వ్యాపారం, శాఖల విస్తరణ, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఈ నియామకాలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.



ఎస్‌బీఐదే పెద్ద వాటా

పీఎస్‌బీలు ఈ ఆర్థిక సంవత్సరం భర్తీ చేసే 50,000 ఉద్యోగాల్లో ఎస్‌బీఐ వాటానే దాదాపు 20,000 వరకు ఉంది. ఇందులో 505 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ) పోస్టులు; 13,455 జూనియర్ అసోసియేట్స్ పోస్టుల ఎంపిక ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసింది. ఈ ఏడాది మార్చి నాటికి ఎస్‌బీఐ ఉద్యోగుల సంఖ్య 2,36,226కు చేరింది. ఇందులో అధికారుల సంఖ్య 1,15,066 వరకు ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఒక్కో కొత్త ఉద్యోగి నియామకం కోసం ఎస్‌బీఐ రూ.40,440.59 చొప్పున ఖర్చు చేసింది. ఎస్‌బీఐతో పాటు పీఎన్‌బీ 5,500 మందిని, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4,000 మందిని తాజాగా ఉద్యోగాల్లోకి తీసుకోనున్నాయి.

ఎందుకంటే?

పీఎస్‌బీలకు ప్రస్తుతం దాదాపు 15 వరకు అనుబంధ లేదా జాయింట్ వెంచర్ కంపెనీలున్నాయి. వీటి కార్యకలాపాలను మరింత విస్తరించి ఐపీఓల ద్వారా వాటిల్లో పెట్టుబడులు కొంతైనా వెనక్కి తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల పీఎస్‌బీలను కోరింది. ఇందుకోసం కూడా పీఎస్‌బీలు నియామకాలు పెంచుతున్నాయని భావిస్తున్నారు.

బిజినెస్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	570
వరంగల్	562	గోదావరి	535
చిత్తూరు	633	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	102
వరంగల్	105	గుంటూరు	107
కరీంనగర్	105	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	102
కర్నూలు	105	నెల్లూరు	107
విశాఖపట్నం	86	అనంతపురం	107
గోదావరి	102		

స్మార్టెన్ పవర్ సిస్టమ్ ఇష్యూ నేడే

న్యూఢిల్లీ: సోమవారం ప్రారంభం కానున్న స్మార్టెన్ పవర్ సిస్టమ్ పబ్లిక్ ఇష్యూలో షేరు ధరను రూ.100గా ప్రకటించింది. బుధవారం ముగియనున్న ఈ ఇష్యూ ద్వారా రూ.50 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. రూ.40.01 కోట్ల విలువ గల తాజా షేర్లు జారీ చేయడంతో పాటు 10 లక్షల ఈక్విటీ షేర్లు ఓఎఫ్ఎస్ విధానంలో జారీ చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది.

రెండు కంపెనీల దరఖాస్తు: సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూళ్లు తయారుచేసే ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ లిమిటెడ్, స్మార్ట్ ఎనర్జీ మీటర్ తయారీ కంపెనీ అలైడ్ ఇంజనీరింగ్ వర్క్స్ ఐపీఓల జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేశాయి. ఎమ్వీ ఫొటోవోల్టాయిక్ పవర్ రూ.3,000 కోట్లు, అలైడ్ ఇంజనీరింగ్ వర్క్స్ రూ.400 కోట్లు సమీకరించనున్నట్టు ప్రకటించాయి.

ఈడీ జప్తు చేసిన ఆస్తుల విడుదల కుదరదు



ఎన్‌సీఎల్ఏటీ

న్యూఢిల్లీ: జాతీయ కంపెనీల చట్టం అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) బ్యాంకులు, ఆర్థిక సంస్థల సొమ్ముతో మజా చేసే ఘరానా వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు చెంప పెట్టులాంటి తీర్పు ఇచ్చింది. దివాలా చట్టాన్ని (ఐబీసీ) అడ్డు పెట్టుకుని అక్రమ నగదు లావాదేవీల చట్టం (పీఎంఎల్ఏ) నుంచి తప్పించుకోవడం కుదరదని స్పష్టం చేసింది. పీఎంఎల్ఏ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్వాధీనం చేసుకున్న ఆస్తులను విడుదల చేయడం కుదరదని తేల్చి చెప్పింది. అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఐబీసీ పరిష్కార ప్రక్రియలోకే రావని ప్రకటించింది.

ఇదీ కేసు: తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయిన డునార్ ఫుడ్స్ కంపెనీ నుంచి తమకు రావలసిన రూ.758.73 కోట్లు రాబట్టుకునేందుకు ఎస్‌బీఐ నాయకత్వంలోని బ్యాంకుల కన్సార్షియం ఎన్‌సీఎల్‌టీ, ముంబై బెంచ్‌ను ఆశ్రయించింది. ఈ లోపు పీఎల్ఏ చట్టం కింద డునార్ ఫుడ్స్ ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దాంతో ఈ ఆస్తులను విడిపించాలని ఎన్‌సీఎల్‌టీ, ముంబై బెంచ్‌ను ఆ కంపెనీ కోరింది. కేసును విచారించిన ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఈడీ చర్యను సమర్థిస్తూ డునార్ ఫుడ్స్ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. దీంతో డునార్ ఫుడ్స్ కంపెనీ దీనిపై ఎన్‌సీఎల్ఏటీకి అప్పీల్ చేసింది. కంపెనీకి ఎన్‌సీఎల్ఏటీలోనూ చుక్కెదురైంది. ఈ తీర్పు ఐబీసీని అడ్డుపెట్టుకుని బ్యాంకుల అప్పులతో మజా చేసే మాయగాళ్లకు చెంప పెట్టని భావిస్తున్నారు.

25850 పైన బుల్లిష్

(జూలై 7-11 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 25461 (-177)

నిఫ్టీ గత వారం 25639-24332 పాయింట్ల మధ్యన కదలాడి 177 పాయింట్ల నష్టంతో 25,461 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,850 కన్నా పైన ముగిస్తే స్వల్ప కాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25449, 25491, 25232, 25037 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25850 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25100
నిరోధ స్థాయిలు : 25675, 25775, 25875 (25575 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 25250, 25150, 25050 (25350 దిగువన బేరిష్)

అనలిస్ట్ నైట్

పెట్రోకెమికల్స్ రంగంలోకి అదానీ

గుజరాత్‌లో పీవీసీ ప్లాంట్



న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. కొత్తగా పెట్రో రసాయనాల (పెట్రో కెమికల్స్) రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా గుజరాత్‌లోని ముంద్రా వద్ద ఏటా 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పోలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని అదానీ గ్రూప్ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో ఇప్పటికే ఈ రంగంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు గట్టి పోటీ ఏర్పడుతుందని భావిస్తున్నారు.

భారీ డిమాండ్

సింథటిక్ పాలిమర్ అయిన పీవీసీని అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం మన దేశంలో దీనికి ఏటా 40 లక్షల టన్నుల వరకు డిమాండ్ ఉంది. ఇందులో 15.9 లక్షల టన్నులు మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అవుతోంది. అందులో రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటా 7.5 లక్షల టన్నులు. దేశంలో పీవీసీ డిమాండ్ ఏటా 8-10 శాతం చొప్పున పెరుగుతోంది. ఈ అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకే అదానీ గ్రూప్ పీవీసీ ఉత్పత్తిలోకి ప్రవేశిస్తోందని భావిస్తున్నారు.

మధ్యలో ఆటంకం

నిజానికి ఐదేళ్ల క్రితమే అదానీ గ్రూప్ ఈ ప్రాజెక్టు తలపెట్టింది. అయితే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో 2023 మార్చిలో ఈ ప్రాజెక్టును పక్కన పెట్టింది. పరిస్థితులు కుదుటపడడంతో మళ్లీ ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించింది. డిమాండ్‌ను బట్టి ఈ ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 20 లక్షల టన్నులకు విస్తరించాలని అదానీ గ్రూప్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

మానసిక అవధి 26000

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 25,650 వద్ద రియాక్షన్‌తో ప్రారంభమై వారం అంతా మైనర్ బలహీనత కొనసాగించింది. శుక్రవారం మైనర్ రికవరీతో 25,460 వద్ద ముగిసింది. అయినా వారం మొత్తం మీద 300 పాయింట్ల మేరకు పరిమిత పరిధిలోనే కదలాడి చివరికి 176 పాయింట్లు నష్టపోయింది. ముందు వారం 25,000 వద్ద బ్రేకౌట్ సాధించిన అనంతరం ఏర్పడిన పుల్‌బ్యాక్ రియాక్షన్ ఇది. ఈ రియాక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయిల కన్నా పైనే ఉండడం తక్షణ ముప్పు లేదనేందుకు సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ పాజిటివ్ ధోరణిలోనే ఉంది. తదుపరి నిరోధం 26,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ సాధించినట్టయితే ప్రధాన నిరోధం 25,600 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. తదుపరి మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ ఉండవచ్చు. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత పాజిటివ్‌గా పురోగమిస్తుంది.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్ సాధించి మైనర్ మద్దతు స్థాయి 25,400 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. స్వల్పకాలిక మద్దతు స్థాయి 25,000. అంత కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 57,600 వద్ద రియాక్షన్ సాధించి వారంలో 412 పాయింట్ల నష్టంతో 57,000 వద్ద నిలకడగా ముగిసింది. అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే ప్రధాన నిరోధం 57,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధం 58,000. బలహీనతలో ప్రవేశించినా 57,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ఈ స్థాయిలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

పాటర్న్: మరింత అప్‌ట్రెండ్ కోసం 25,600 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి. అలాగే మార్కెట్ 25 డీఎంఏ కన్నా పైనే ఉండడం ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. గత వారం మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధ వారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం : 25550, 25600	
మద్దతు : 25400, 25320	

నగరాలను బీసీ-డీలో చేర్చేందుకు కృషి: మంత్రి సవిత



అమరావతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగర(నగరాలు) సామాజిక వర్గీయులను బీసీ-డీలుగా గుర్తించి కులధ్రువీకరణ పత్రాలు జారీచేసేలా చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హామీ ఇచ్చారు. టీడీపీ బీసీ నగరాల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేష్ ఆదివారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మంత్రి సవితను నగరాల సామాజిక వర్గీయులతో కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా నగరాలకు బీసీ-డీ కులధ్రువీకరణ పత్రాలు అందజేయాలని జీఓ ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కేవలం విజయనగరం, శ్రీకాకుళం, విశాఖతో పాటు కృష్ణా జిల్లాల్లో మాత్రమే నగరాలకు బీసీ-డీ కులధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారన్నారు. దీనిపై మంత్రి సవిత మాట్లాడుతూ కులధ్రువీకరణ పత్రాల జారీపై అధికారులతో మాట్లాడతానన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

▸▸ ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



విజయవాడ (గాంధీనగర్), జూలై 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని, పదోన్నతులు కల్పించాలని ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో జరిగింది. అనంతరం విద్యాసాగర్ విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీల్లో కార్యదర్శుల విధుల సమయాలను సవరించాలని, వీడియో కాలింగ్ విధానాన్ని తొలగించాలని అన్నారు. గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు పెంచాలని, వారికి అవసరమైన ట్రై సైకిళ్లు, ఇతర పనిముట్లను సమకూర్చాలని కోరారు. ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీటీవీ రమణ పాల్గొన్నారు.

'సింగిల్ మేజర్'తో విద్యార్థులకు నష్టం

▸▸ డిగ్రీ అధ్యాపకుల జేఏసీ

అమరావతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సింగిల్ మేజర్ డిగ్రీ విధానంతో విద్యార్థులకు చాయిస్ తగ్గుతుందని, ఇది వారి భవిష్యత్తును దెబ్బతీస్తుందని ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల జేఏసీ అభిప్రాయపడింది. సింగిల్ మేజర్‌తో కాలేజీల్లో అందుబాటులో ఉన్న కోర్సులకే విద్యార్థులు పరిమితం కావాల్సి వస్తోందని తెలిపింది. పైగా భవిష్యత్తులో గణితం, భౌతిక శాస్త్రం, భాషా సబ్జెక్టుల్లో అధ్యాపకులు దొరకని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. అందువల్ల ఉన్నత విద్యామండలి ప్రతిపాదించినట్లుగా డ్యూయెల్ మేజర్ డిగ్రీని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ.. జేఏసీ ప్రతినిధులు రాఘవరెడ్డి, పి.గోపాలనాయుడు, ఎం.శ్యాంబాబు, ఎం.శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం దీనిపై స్పందించి డ్యూయెల్ మేజర్ అమలుచేయాలని కోరారు. అలాగే అధ్యాపకులకు బదిలీలు చేపట్టాలని, విద్యారంగం నిర్ణయాల్లో విద్యావేత్తలు, విద్యార్థులు, అధ్యాపకుల అభిప్రాయాలకు ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు.

గిరిజన ప్రాంతాల్లో 'ఆది కర్మయోగి'

▸▸ తొలివిడతలో ఏపీలో నాలుగు జిల్లాల్లో అమలు

అమరావతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో సమర్థవంతమైన పాలన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆది కర్మయోగి' కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చింది. దీన్ని కేంద్ర పథకమైన ధార్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డీఏజేజీయూఏ)తో అనుసంధానం చేస్తూ గిరిజనాభివృద్ధికి తోడ్పడాలని సంకల్పించింది. ఈ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా స్థానిక సంస్థలు, ప్రభుత్వ అధికారులు, గిరిజనులకు ప్రభుత్వ పథకాలు, పాలన పట్ల అవగాహన కల్పించడంతో పాటు సామర్థ్య పెంపు శిక్షణ అందిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 18 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుండగా.. తొలివిడతలో అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో దీని అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు మాస్టర్ ట్రైనర్లను నియమిస్తుంది. ముందుగా మాస్టర్ ట్రైనర్లకు బెంగుళూరులో ఈనెల 10 నుంచి 16 వరకు శిక్షణ అందిస్తారు.

కొత్త డీహెచ్‌ఎస్ ఎవరో!

▸▸ కొనసాగలేనంటున్న డాక్టర్ పద్మాశశిధర్

▸▸ ఇన్‌చార్జి డీహెచ్‌ఎస్‌గా డాక్టర్ పద్మావతి

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్‌ఎస్) నియామకంపై ఆరోగ్యశాఖ పునరాలోచనలో పడింది. ఆర్యోశాఖలో డీహెచ్ పోస్టు చాలా కీలకం. ఇలాంటి విభాగానికి డైరెక్టర్‌గా ఎవరిని నియమించాలనేదానిపై ప్రభుత్వం, ఆరోగ్యశాఖ మంత్రి తీవ్రంగా శోధించారు. అడిషనల్ డైరెక్టర్లల్లో సీనియర్, రాజమండ్రి ఆర్డీగా పనిచేస్తున్న డాక్టర్ పద్మాశశిధర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే, ఆరోగ్య, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తాను ఆ పోస్టులో పని చేయలేనని ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్‌ను కలిసి వివరించారు. పైగా ఆమె కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ బంధువు కావడం కొంత ఇబ్బంది అయింది. చివరికి ఆమె తాను డీహెచ్‌గా విధులు నిర్వహించలేనని చెప్పడంతో నెక్స్ట్ ఎవరిని నియమించాలనే ఆలోచనలో ఆరోగ్యశాఖ పడింది. అంతవరకు ప్రస్తుతం ఇన్‌చార్జి డీహెచ్‌ఎస్‌గా ఉన్న డాక్టర్ పద్మావతినే కొనసాగించాలనే ఆలోచనలో ఉన్నారు. ఆమె ఏపీశాక్స్ అడిషనల్ డైరెక్టర్ పోస్టుతో పాటు ఇన్‌చార్జి డీహెచ్‌ఎస్‌గా కొనసాగనున్నారు.

విశాఖ డ్రగ్స్ కేసులో వైద్యుడి అరెస్టు

మద్దిలపాలెం (విశాఖపట్నం), జూలై 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో కలకలం రేపిన డ్రగ్స్ కేసులో ఆదివారం త్రీటౌన్ పోలీసులు ఓ వైద్యుడిని అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారిసంఖ్య మూడుకు పెరిగింది. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో శనివారం కొకైన్‌తో పట్టుబడిన అక్షయ్‌కుమార్ వద్ద వైద్యుడు డ్రగ్స్ కొనుగోలు చేసినట్టు ఆరోపణలు రుజువయ్యాయి. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ పైడయ్య వివరాలు వెల్లడించారు. నగరంలోని కూర్మన్నపాలేనికి చెందిన కమ్మెళ్ల శ్రీకృష్ణచైతన్య వర్మ (34) ఎంబీబీఎస్ పూర్తిచేసి వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు సీతమ్మధారకు చెందిన అక్షయ్‌కుమార్‌తో పరిచయం ఉంది. దీంతో డ్రగ్స్ కావాలని కోరుతూ అందుకోసం రూ.65వేలు చెల్లించాడు. విచారణలో అక్షయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు వైద్యుడు శ్రీకృష్ణచైతన్యకు వైద్య పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. దీంతో ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. వైద్యుడితో పాటు రఘు, గౌతమ్ అనే ఇద్దరు వ్యక్తులకు కూడా డ్రగ్స్ విక్రయించానని అక్షయ్‌కుమార్ చెప్పడంతో వారికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించి, రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు.

తిరుమలలో రాత్రి అన్నప్రసాదంలోనూ వడలు

▸▸ వెల్లడించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



భక్తులకు వడలు వడ్డిస్తున్న బీఆర్ నాయుడు

తిరుమల, జూలై 6(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదంలో మధ్యాహ్నమే కాకుండా రాత్రి భోజన సమయంలోనూ భక్తులకు వడలను వడ్డించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నప్రసాదంలో భక్తులకు వడలు అందించనున్నారు. ఆదివారం సాయంత్రం అన్నప్రసాద భవనంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్వయంగా భక్తులకు వడలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదివారం నుంచి రాత్రి భోజనంలోనూ వడలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం రోజుకు 70 వేల నుంచి 75 వేల వడలను ప్రత్యేకంగా తయారు చేసి భక్తులకు వడ్డిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారాం, డిప్యూటీ ఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి

'రెవెన్యూ' మాయాజాలం!

175 ఎన్నికల డీటీ పోస్టులపైనా దొంగాటే.. తాత్కాలిక పోస్టులను పర్మినెంట్ చేస్తామంటూ ప్రతిపాదన

ఈసీ, జీఏడీ కుదరదని తేల్చినా.. మళ్లీ మళ్లీ అదే పాట

మండల స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి భూసమస్యలకు పరిష్కారం చూపాల్సిన రెవెన్యూ శాఖ అందుకు భిన్నమైన దారిలో నడుస్తోంది. జగన్ ప్రభుత్వంలో అడ్డగోలుగా సృష్టించిన 300 డీటీ పోస్టులను రెగ్యులరైజ్ చేసే ప్రయత్నం బెడిసికొట్టడంతో.. ఎన్నికల కమిషన్ పరిధిలోని 175 డీటీ పోస్టులను (డిప్యుటేషన్‌పై నియమించేవి) పర్మినెంట్ చేస్తామంటోంది. ఆ 300 పోస్టుల్లో వీటిని చూపించే ప్రయత్నం చేస్తోంది. అవి తాత్కాలిక పోస్టులేనని.. వాటిని శాశ్వత పోస్టుల జాబితాలో చేర్చడం కుదరదని, వాటికి పదోన్నతులు కూడా వర్తించవని సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ), ఎన్నికల కమిషన్ (ఈసీ) ఇప్పటికే పలుమార్లు తేల్చిచెప్పినా వినిపించుకోవడం లేదు. దరిమిలా ఈ మొత్తం పరిణామాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో లక్షలాది మంది ప్రజలు భూ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఒక్కసారి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తేనే 5 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిష్కరించేందుకు మండలాల్లో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్(డీటీ)లు తగినంత మంది లేరు. 697 తహశీల్దార్ పోస్టులకు 470 రెగ్యులర్ అధికారులే ఉన్నారు. మిగిలినవాటికి ఇన్‌చార్జులే దిక్కు. డీటీల పరిస్థితీ ఇంతే. మండల కార్యాలయాల్లోని ఉద్యోగ ఖాళీల భర్తీ, పదోన్నతుల అంశంలో నెలకొన్న ప్రతిష్టంభన, న్యాయపరమైన సమస్యలను పట్టించుకోకుండా.. వాటికి ఓ పరిష్కారం చూపకుండా.. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం లేని ఎన్నికల డీటీ పోస్టుల రెగ్యులరైజేషన్ గురించి రెవెన్యూ శాఖ పరుగులు తీస్తోంది. రాష్ట్రంలో 2019 ఎన్నికలకు ముందు.. ఎన్నికల విధుల కోసం 175 ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఇది కేవలం ఎన్నికల నిర్వహణ కోసమేనని, డిప్యుటేషన్‌పైనే వీటిని భర్తీచేయాలని అప్పటి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు (జీవో 12) జారీ చేశారు. ఈ పోస్టుల కాలపరిమితి 2024 మార్చిలో ముగిసిపోయింది. దీంతో మరో ఏడాదిపాటు అంటే 2025 మార్చి వరకు వాటి కాలపరిమితిని ఆర్థిక శాఖ పొడిగించింది. నిజానికి ఈ పోస్టులను క్రమబద్ధీకరించాలని ఈ శాఖను ఓ ఉద్యోగ సంఘం నాయకుడు కోరగా.. తిరస్కరించింది. ఈ 175 పోస్టులు తాత్కాలికమేనని, వాటిని శాశ్వత పోస్టుల జాబితాలో చూపలేమని ఉత్తర్వులో పేర్కొంది. ఎన్నికల డీటీ పోస్టులకు 50 శాతం కేంద్రం, మరో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తాయని.. ఈ పోస్టుల అవసరం తీరిన తర్వాత డిప్యుటేషన్లు రద్దయిపోతాయని కూడా తేల్చిచెప్పింది. తదనుగుణంగా ఈ డిప్యూటీ తహశీల్దార్ల ఉద్యోగాల తాజా గడువు ముగిసిపోయింది. ఇప్పుడు మరో 9 నెలలు పొడిగించాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. రానున్న స్థానిక ఎన్నికల దృష్ట్యా పొడిగించే అవకాశముంది. అయితే వీటిని పర్మినెంట్ చేయాలని రెవెన్యూ శాఖ గత ఏడాదిలోనే ప్రతిపాదన పంపింది. ఈసీ, జీఏడీ రెండూ తిరస్కరించాయి. దీంతో పర్మినెంట్ చేసే అవకాశం ఇక లేదని తేలిపోయింది.

..అదే జరిగితే ఆ అక్రమాలను ఆమోదించినట్లే..!

జగన్ ప్రభుత్వంలో ఓ అధికారి తన స్వార్థం కోసం 300 డీటీ పోస్టులను సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ పోస్టులను శాశ్వత ఉద్యోగాల జాబితాలో చూపాలన్న ప్రయత్నాలను జీఏడీ, ఆర్థిక శాఖ అడ్డుకున్నాయి. దీంతో దొడ్డిదారిన ఆ పోస్టులను మరో రూపంలో రెగ్యులరైజ్ చేయించేందుకు రెవెన్యూ శాఖ ఎత్తులు వేస్తోంది. ఎన్నికల కమిషన్ వద్ద డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న 175 మంది డీటీలను ఈ పర్మినెంట్ ఉద్యోగాల జాబితాలో చూపించి.. వారికిచ్చిన అడహాక్ పదోన్నతులను రెగ్యులరైజ్ చేయాలని చూస్తోంది. గతంలో రెవెన్యూ శాఖ 2023లో ఒకసారి, గత ఏడాది సాధారణ ఎన్నికలకు ముందు మరోసారి ఇలాంటి ప్రయత్నాలే చేసింది. అయితే ఆ 175 డీటీ పోస్టులు రెగ్యులర్ ఉద్యోగాలు కావని.. డిప్యుటేషన్‌పై తీసుకున్న తాత్కాలిక పోస్టులని.. వాటిని శాశ్వత ప్రాతిపదికన చూడలేమని ఎన్నికల కమిషన్, జీఏడీ 2024 ఏప్రిల్‌లోనే స్పష్టం చేశాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ పునరుద్ఘాటించాయి. అయినా రెవెన్యూశాఖ మళ్లీ అదే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపున 9 నెలల పాటు ఆ పోస్టుల పొడిగింపు కోరుతూ.. మరోవైపు వాటిని శాశ్వత ఉద్యోగాలుగా చూడాలని ఫైళ్లు పంపింది. ఒకవేళ ఈ పోస్టులను కూడా జగన్ ప్రభుత్వంలో అడ్డగోలుగా సృష్టించిన 300 జాబితాలో భాగంగా చూసి రెగ్యులరైజ్ చేస్తే.. రెవెన్యూశాఖ లేదా జీఏడీ ఆధ్వర్యంలోని ఈసీ జీతాలివ్వాల్సి ఉంటుంది. అదీగాక జగన్ ప్రభుత్వం సృష్టించిన 300 పోస్టుల్లో వాటిని కలిపితే.. ఆనాడు జరిగిన అక్రమాలను ఆమోదించినట్లవుతుందని సీనియర్ అధికారులు చెబుతున్నారు. జీఏడీ, ఆర్థికశాఖ పదే పదే తిరస్కరిస్తున్నా దొడ్డిదారిలో ఫైళ్లు పంపడం వెనుక గతంలో రెవెన్యూలో పనిచేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారితో పాటు ఒక ఉద్యోగ సంఘం నేత పాత్ర ఉందని ఆ శాఖలో చర్చ జరుగుతోంది.

'ఫస్ట్'గా కొట్టేయాలని!



(మొదటి పేజీ తరువాయి)

అండదండలు, ఆర్థిక బలం ఉండి... అవతలి వాళ్లను బెదిరించే వాళ్లే ఈ వేలంలో పాల్గొనేవారు. తమ కర్ర పెత్తనంతో ఇతరులెవరూ పోటీ రాకుండా అడ్డుకున్నారు. దీని వల్ల గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా పడిపోయింది. నోరున్నోడికే గనుల లీజులు దక్కాయి. కూటమి ప్రభుత్వం ఈ విధానంపై సమీక్ష చేసింది. వేలం వల్ల కొందరికే మేలు జరుగుతుందని భావించి దాన్ని రద్దుచేసింది. గతంలో మాదిరిగా... అంటే, ఎవరు ముందు దరఖాస్తు చేసుకుంటే వారికే ప్రాధాన్యం (ఫస్ట్‌కమ్ ఫస్ట్) ఇచ్చే విధానాన్ని పునరుద్ధరించింది. దీని ప్రకారం సూక్ష్మ ఖనిజాల లీజులు... అంటే గ్రావెల్, రోడ్ మెటల్, మెటల్, ఇతర వాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు. జూన్ 30న దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్‌మెటల్, గ్రావెల్, మెటల్ తదితర లీజులకు ప్రాంతాల వారీగా తొలి రెండు గంటల వ్యవధిలో దరఖాస్తులు సమర్పించారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు 'వచ్చాయి.' సర్వర్‌లో సమస్యల వల్ల దరఖాస్తులు అప్‌లోడ్ కావడం లేదని, ఎర్రర్ చూపిస్తోందని అనేక మంది గనుల శాఖ పెద్దలకు ఫిర్యాదు చేశారు. ఇది నిజంగానే సాఫ్ట్‌వేర్ సమస్య అని ఉన్నతాధికారులు భావించారు. సంబంధిత ఐటీ కంపెనీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెబుతూ వచ్చారు. కానీ... 48 గంటలపాటు... అంటే ఈనెల 2వ తేదీ ఉదయం వరకు సర్వర్లు పని చేయలేదు. ఆ తర్వాతే దరఖాస్తుల స్వీకరణ తిరిగి మొదలైంది. అంటే... అప్పటికే 'అస్మదీయ కాంట్రాక్టర్'లకు లీజు ఖరారైపోయినట్లే!

అధికారులే ఎర్రర్ సృష్టికర్తలు

కొన్ని ప్రాంతాలు... ప్రత్యేకించి గుంటూరు, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్, కృష్ణా, అన్నమయ్య, గోదావరి జిల్లాల పరిధిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే 'అసలు సమస్య' ఏమిటో బయటపడింది. గనుల శాఖలోని దిగువ స్థాయి అధికారులే సాఫ్ట్‌వేర్, సర్వర్ సమస్యలను సృష్టించారని తెలిసింది. లీజులకు డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి... వారి దరఖాస్తులే ముందుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అయ్యేలా, మిగతా వారు వెనకబడి పోయేలా వ్యూహాత్మకంగానే సాంకేతిక సమస్యలు సృష్టించారని తెలిసింది. తమకు టాస్క్ ఇచ్చిన వ్యక్తులు గ్రావెల్, రోడ్‌మెటల్, ఇతర ఖనిజాల కోసం వందలాది హెక్టార్లలో లీజులు కోరుతూ దరఖాస్తులు ముందుగానే సమర్పించేలా ఏర్పాటు చేసి.. వారి పనిపూర్తికాగానే సాంకేతిక సమస్యలు తలెత్తేలా వ్యవహరించినట్లు స్పష్టమైంది. ఉదాహరణకు చిత్తూరు జిల్లా సత్యవేడు పరిధిలోని ఓ గ్రామంలోని రెండు సర్వే నెంబర్ల పరిధిలోని రోడ్‌మెటల్, గ్రావెల్‌కోసం ఓ కంపెనీ ప్రతినిధి జూన్ 30వ తేదీనే దరఖాస్తు చేశారు. ఒకేసారి 120 హెక్టార్ల లీజుకు దరఖాస్తు చేశారు. ఆ తర్వాత రెండు రోజుల పాటు ఇతరులెవ్వరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయలేక పోయారు. ఈనెల 1వ తేదీ మంగళవారం అర్ధరాత్రి తర్వాత సర్వర్ పనిచేసింది. తిరుపతి జిల్లాలోనూ ఇదే సీన్ రిపీట్ అయింది. గ్రావెల్, ఇతర ఖనిజాల కోసం ఒకే వ్యక్తి 116 హెకార్లలో లీజులు కోరుతూ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఆ తర్వాత సర్వర్ సమస్యను తెరమీదకు తీసుకొచ్చారు. ఇతరులు దరఖాస్తులు అప్‌లోడ్ చేయలేకపోయారు. దీంతో నాలుగు లీజులకు సంబంధించి తొలి దరఖాస్తుదారుగా ఆ ఒక్క వ్యక్తే నిలిచారు. ఆయన వైసీపీ నేతకు అత్యంత సన్నిహితుడు కావడం విశేషం. సత్యవేడులోనూ ఇదే జరిగింది. అక్కడ కూడా వైసీపీ నేత ముఖ్య అనుచరుడే తొలి దరఖాస్తుదారుగా ఉన్నారు. చిత్తూరు జిల్లాలోని ఒక కీలక మండలంలోని ఆరు లీజులకు ఒక్కరే తొలి దరఖాస్తుదారుగా ఉన్నారు. ఆయన వైసీపీ మాజీ మంత్రి ప్రధాన అనుచరుడే. మొత్తం 230 ఎకరాల్లో లీజులకు తొలి దరఖాస్తుగా ఉన్న ఆయన... వైసీపీ ప్రభుత్వంలోనూ మైనింగ్ కింగ్‌గా చెలామణి అయ్యారు.

ఇద్దరు కీలకం..

గనుల శాఖలోని ఇద్దరు కింది స్థాయి అధికారులే... 'సర్వర్' సమస్య సృష్టికర్తలని తెలిసింది. గతంలోనూ వాళ్లు కీలకమైన విభాగాన్ని ఉపయోగించి అస్మదీయ కాంట్రాక్టర్లు, కంపెనీలకు మేలు చేశారన్న ఆరోపణలున్నాయి. 'ఫస్ట్ కమ్ ఫస్ట్' విధానంలో పారదర్శకంగా లీజుల విధానం ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యాలను తమ స్వార్థం కోసం భ్రష్టుపట్టించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామాలపై విచారణ జరిపి బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు, లీజుదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మంత్రిగారి 'బేరం'!

▸▸ 'గుట్టు' బయటపడ్డా తగ్గేదేలే!!

▸▸ 'ముడుపుల' కోసం హైదరాబాద్‌లో భేటీ

▸▸ ఓ హోటల్‌లో కంపెనీ ప్రతినిధులతో చర్చలు

▸▸ కంప్యూటర్ల కొను'గోల్‌మాల్'పై ప్రభుత్వం ఆరా

అమరావతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): "ఎలాగూ పని అయిపోయింది. ఇప్పుడు 'గుట్టు' బయటపడితే ఏమైందిలే!! వచ్చే కమీషన్ అయితే తీసేసుకుందాం" అనే రీతిన కంప్యూటర్ల కొను'గోల్‌మాల్' వ్యవహారంలో సంబంధిత శాఖ మంత్రి వ్యవహరించినట్లు తెలిసింది. టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తైన నేపథ్యంలో సంబంధిత కంపెనీ నుంచి 'ప్రతిఫలం' అందుకొనేందుకు ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో భేటీ అయ్యారు! కంపెనీ ముఖ్యులతో చర్చించిన తర్వాత రోడ్డు మార్గంలోనే విజయవాడకు వచ్చేశారు!! ఈ వ్యవహారంలో అందాల్సిన వారికి భారీగానే ముడుపులు చేరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హోటల్లో మంత్రితో చర్చించిన వ్యక్తులెవరు? ముడుపులు చేతులు మారాయా? ఎవరెవరు ఎంతమేర లబ్ధి పొందారు? మంత్రి కుమారుడికి కొత్త కారు ఎలా వచ్చింది? తదితర విషయాలపై ప్రభుత్వం ఆరా తీసినట్లు తెలిసింది. రాష్ట్రంలోని ఒక కీలక ప్రభుత్వ శాఖలో కంప్యూటర్ల కొనుగోళ్ల టెండర్ ఒక కంపెనీకి వచ్చేలా జరిగిన లాబీయింగ్‌పై 'సూర్యా భాయ్ దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఇది తెలిసిన సదరు మంత్రి.. తొలుత ఖంగుతున్నారు. తర్వాత తేరుకొని వెనక్కి తగ్గేదేలేదంటూ.. 'ప్రతిఫలం' అందుకొనేందుకు ముందుకే వెళ్లడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై ప్రభుత్వ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారన్న ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

ఎలాగూ పని అయిపోయింది కదా!

ముందస్తు చర్చల్లో జరిగిన ఒప్పందంలో భాగంగా టెండర్ దక్కించుకున్న కంపెనీ ప్రతినిధులు మంత్రికి చెప్పిన ప్రతిఫలం ముట్టజెప్పేందుకు హైదరాబాద్‌లోని ఒక స్టార్ హోటళ్లో సమావేశం ఏర్పాటు చేశారు. మాదాపూర్‌ని ఒక హోటల్‌కు శనివారం రాత్రే చేరుకున్న సదరు మంత్రి.. ఆదివారం ఉదయం బేగంపేటలోని స్టార్ హోటల్‌లో సమావేశమై ప్రతిఫలం అందుకోవడానికి సిద్ధమయ్యారు. అయితే ఆదివారం ఉదయం 'ఆంధ్రజ్యోతి'లో ఈ వ్యవహారంపై కథనం రావడంతో ఖంగుతిన్నారు. కొంతసేపు తర్జనభర్జన తర్వాత ఎలాగూ పని అయిపోయింది కదా! ఇప్పుడు తీసుకుంటే నష్టమేంటి? తీసుకోకపోతే లాభమేంటి? అనే ఆలోచనతోనే హోటళ్లో భేటీకి వెళ్లిపోయినట్లు తెలిసింది. సంబంధిత కంప్యూటర్ల కొనుగోళ్ల ప్రాజెక్టు కేంద్ర నిధుల వాటా మెజార్టీగా ఉన్న నేపథ్యంలో.. ఈ భేటీలో ఢిల్లీ నుంచి వచ్చిన ఓ ఐఏఎస్ అధికారి కూడా పాల్గొన్నట్లు సమాచారం.

బేరసారాలు.. టెండర్లలో మార్పులు ఇలా..

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రాజెక్టులో భాగంగా ఏపీలోనూ అమలుకు రూ.40 కోట్లు విడుదల చేసింది. నాలుగు విభాగాలను ఏకం చేసి అన్నింట్లోనూ సమాచారం నిక్షిప్తం చేసేందుకు కంప్యూటర్లు కొనుగోలు చేయాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.10 కోట్లు కలుపుకొని ఈ ప్రాజెక్టు మొదలైంది. డెస్క్‌టాప్, హార్డ్‌డిస్క్, ఇతర పరికరాలు కలిపి మొత్తం 4,580 సెట్లు కొనుగోలుకు రాష్ట్రంలోని కీలక ప్రభుత్వ శాఖకు చెందిన టెక్నికల్ విభాగం కంప్యూటర్ల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించింది. మొదట కేంద్రం సూచించిన స్పెసిఫికేషన్లతో టెండర్లు ఆహ్వానించింది. అర్హత కలిగిన ఐదు కంపెనీలు బిడ్లు వేయగా.. అందులో మూడు కంపెనీలను ఒక్కరే బినామీల ద్వారా రంగంలోకి దించినట్లు తెలిసింది. మిగతా ఇద్దరినీ తప్పించే ప్రయత్నాల్లో భాగంగా మంత్రిని ఆశ్రయించారు. టెండర్ వచ్చేలా చేస్తే ప్రతిఫలం ఉంటుందని ఆఫర్ ఇచ్చారు. ఈ క్రమంలో మంచి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తోన్న అధికారితో మాట్లాడిన మంత్రి 'మీ పోస్టింగ్ బాధ్యత నాది. వీళ్లు అడిగినట్లు స్పెసిఫికేషన్లు మార్చి టెండర్ వచ్చేలా చూడండి' అని ఆదేశించారు. దీనికి సరేనన్న టెక్నికల్ విభాగం అధికారి.. ఆ మూడు కంపెనీలకు మాత్రమే టెండర్ దక్కేలా, మిగతా రెండు అవకాశం కోల్పోయేలా మార్పులు చేశారు. ఎట్టకేలకు అనుకున్న లక్ష్యం నెరవేరడంతో మంత్రి ఆ అధికారికి మంచి పోస్టింగ్ ఇప్పించేందుకు ప్రభుత్వ పెద్దల వద్ద ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం. నిజాయితీపరుడు, సమర్థుడు అంటూ కులం కార్డు సైతం వాడి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ట్రోలింగ్‌పై తక్షణ చర్యలు అవసరం

▸▸ ఏపీ బార్ కౌన్సిల్ తీర్మానం

అమరావతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిపై నిరాధార ఆరోపణలు, వ్యక్తిత్వ హననం చేస్తూ ట్రోల్ చేయడాన్ని ఏపీ బార్ కౌన్సిల్ ఖండించింది. ట్రోలింగ్‌ను అడ్డుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టడం అవసరమని పేర్కొంది. చైర్మన్ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఏపీ బార్ కౌన్సిల్ వర్చువల్‌గా సమావేశమైంది. వైస్‌చైర్మన్ కృష్ణమోహన్, బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఏ రామిరెడ్డి, ఇతర సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ పలు తీర్మానాలను ఆమోదించింది. ఓ కేసులో తీర్పు వెల్లడించిన అనంతరం సోషల్ మీడియా, డిజిటల్ ఫోరమ్, పబ్లిక్ డొమైన్‌లో జస్టిస్ శ్రీనివాసరెడ్డిని ట్రోల్ చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపింది. న్యాయమూర్తులు చట్టనిబంధనలు అనుసరించి తీర్పులు ఇస్తారని.. వాటిని వ్యక్తిగత వ్యాఖ్యలుగా పరిగణించి వారిపై దాడి చేయడం సరికాదని స్పష్టంచేసింది. 'గతంలో కూడా న్యాయమూర్తులను లక్ష్యంగా చేసుకుని ట్రోల్ చేశారు. పదేపదే జరుగుతున్న ఇలాంటి ఘటనలపై తక్షణ చర్యలు అవసరం. ఇందుకోసం హైకోర్టు రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రస్తుత, గతంలో జరిగిన ఘటనలపై విచారణ జరిపి.. బాధ్యులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సుప్రీంకోర్టు కఠిన చర్యలు తీసుకోవాలి. రెచ్చగొట్టే చర్యలు ఉన్నప్పటికీ తమ రాజ్యాంగ విధులను నైతిక నిష్ఠతో నిర్వహిస్తున్న న్యాయమూర్తులకు మా సంపూర్ణ మద్దతు ఉంటుంది' అని బార్ కౌన్సిల్ ఓ ప్రకటనలో పేర్కొంది.

శ్రీశైలానికి భారీగా వరద

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం 77.34 టీఎంసీల నీరు నిల్వ చేశారు. 22 గేట్లు ఎత్తి 62,444 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఆర్డీఎస్ ఆనకట్టపై వరద పోటెత్తింది. మంత్రాలయం వద్ద భారీగా వరద ఉండటంతో భక్తులను అప్రమత్తం చేశారు. సుంకేసుల జలాశయానికి 67,218 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

నేడు గోదారి పరీవాహక ప్రాంతాల్లో కుంభవృష్టి


పశ్చిమబెంగాల్ పరిసరాల్లో ఆదివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండు మూడు రోజుల్లో పశ్చిమ వాయవ్యంగా జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా నెమ్మదిగా పయనించనుంది. దీని ప్రభావంతో ఆదివారం ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతంలో అనేకచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడ కుంభవృష్టి కురిసే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ విభాగం తెలిపింది. దీంతో వచ్చే రెండు మూడు రోజుల్లో గోదావరికి వరద పోటెత్తుతుందని హెచ్చరించింది. ముఖ్యంగా వైన్‌గంగా, ప్రాణహిత నదీ పరీవాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరగనుంది.

పోలవరం నుంచి 2,23,309 క్యూసెక్కుల విడుదల

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదులు, ఏజెన్సీలోని వాగులు పొంగి భారీగా వరద గోదావరిలో కలుస్తోంది. దీంతో ఏలూరు జిల్లాలో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతోంది. ఆదివారం పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలోకి చేరుకున్న 2,23,309 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్వే ఎగువన 28.220 మీటర్లు, దిగువన 18.740 మీటర్లు, కాపర్ డ్యాం ఎగువన 28.370 మీటర్లు, దిగువన 17.770 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాంల మధ్య 15.680 మీటర్ల నీటి మట్టం నమోదైంది. పట్టిసీమ ఫెర్రీ రేవులో మెట్లపైకి వరద ప్రవహిస్తోంది.

వర్షాల కోసం రాష్ట్ర రైతుల ఎదురుచూపు

అల్పపీడనం ప్రభావం రాష్ట్రంపై పెద్దగా కనిపించడంలేదు. ఉత్తరకోస్తాలో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి తప్ప చెప్పుకోదగ్గ వర్షాలు కురవలేదు. మిగిలిన ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగింది. రానున్న నాలుగు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. నాలుగు రోజుల తరువాత బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నదని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు. దీంతో ఉత్తరకోస్తాలో ఈనెల 11వ తేదీ నుంచి రెండు మూడురోజులు ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఒడిశాకు దగ్గరగా అల్పపీడనాలు వస్తేనే ఉత్తరకోస్తా, ఉత్తర తెలంగాణ వరకు వర్షాలు కురుస్తాయని వివరించారు. నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చాయన్న సంతోషం రాష్ట్ర రైతుల్లో కనిపించడంలేదు. గతనెలలో 23.3 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. జూలైలో రాష్ట్రంలో మంచి వర్షాలు కురుస్తాయని ఐఎండీ ప్రకటించినప్పటికీ మేఘాలు తప్ప వర్షం కురవడంలేదు. వచ్చేనెలలో రాష్ట్రంలో రుతుపవనాలు పుంజుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్న విశ్రాంత చీఫ్ ఇంజనీర్ కన్నయ్యనాయుడు

శ్రీశైలం క్రస్ట్ గేట్లన్నీ ఐదేళ్లకైనా మార్చాల్సిందే!

▸▸ లేదంటే తుంగభద్ర పరిస్థితే: కన్నయ్యనాయుడు

▸▸ 10వ గేటు లీకేజీతో ప్రస్తుతానికి ముప్పులేదు

▸▸ నిర్వహణకు నిధులు కేటాయించాలి

▸▸ శ్రీశైలం డ్యాంను పరిశీలించిన గేట్ల నిపుణుడు

నంద్యాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో 10వ గేటు లీకేజీతో ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేదని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు చెప్పారు. అయితే ఐదేళ్లకైనా ఉన్న 12 క్రస్ట్ గేట్లన్నింటినీ మార్చాల్సిందేనని స్పష్టంచేశారు. ఆదివారం ఆయన జలాశయాన్ని, గేట్లను ఆయన పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గేట్ల నుంచి ప్రస్తుతం 10శాతం కంటే తక్కువ లీకేజీ ఉందని తెలిపారు. క్రమం తప్పకుండా రేడియల్ క్రస్ట్ గేట్లకు పెయింటింగ్ చేయాలని సూచించారు. ఐదేళ్లకైనా అన్ని గేట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని.. లేకపోతే తుంగభద్ర డ్యాం పరిస్థితే ఇక్కడా ఏర్పడే ప్రమాదం ఉందని చెప్పారు. ప్లంజ్ పూల్ వద్ద గొయ్యితో జలాశయానికి ఎలాంటి ప్రమాదం లేదన్నారు. ప్రభుత్వం జలాశయానికి, క్రస్ట్‌గేట్ల నిర్వహణకు తగిన స్థాయిలు నిధులు కేటాయించాలని కోరారు. గేట్ల తీరుపై అధికారులతో కలిసి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తానని చెప్పారు.

అ.. ఆ..లూ రావట్లేదు

(మొదటి పేజీ తరువాయి)

మందికి, పర్యావరణ సైన్స్‌పై 40శాతం మందికి మాత్రమే పట్టు ఉంది. మొత్తంగా మూడో తరగతి భాషా సబ్జెక్టులు, గణితం మినహాయిస్తే మిగిలిన అన్ని సబ్జెక్టుల్లోనూ జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రం చాలా వెనుకబడి ఉందని పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)-2024 స్పష్టం చేసింది. గత వైసీపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో సృష్టించిన విధ్వంసం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను దారుణంగా దెబ్బతీసింది. ప్రాథమిక విద్యను గాలికొదిలేసింది. కొన్నిచోట్ల విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్పించి రాష్ట్రమంతా అలాగే ఉందని ప్రచారం చేసుకుంది. ఇప్పుడు జాతీయ సర్వే నివేదికలతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సర్వేలను సమీక్షించిన పాఠశాల విద్యాశాఖ.. లోపాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు త్వరలో నిర్వహించబోయే ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను సిలబస్‌పై కాకుండా ప్రాథమిక అంశాలపైనే నిర్వహించాలని నిర్ణయించింది.

అసర్ నివేదిక ప్రకారం...

- రాష్ట్రంలో మూడో తరగతి విద్యార్థులు 15.5%, ఐదో తరగతి వారు 37.7%, 8వ తరగతి వారు 56.2% మంది రెండో తరగతి పాఠాలు చదవగలుగుతున్నారు. వీటిని చదవగలిగిన మూడో తరగతి ప్రభుత్వ బడుల విద్యార్థులు 14.7% మంది ఉంటే, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు 16.8% ఉన్నారు. ఐదో తరగతిలో ప్రభుత్వంలో 37.5%, ప్రైవేటులో 38.5%, 8వ తరగతిలో ప్రభుత్వంలో 53%, ప్రైవేటులో 64.8శాతం మంది చదవగలుగుతున్నారు.
- ప్రభుత్వ బడుల్లో చదివే 3వ తరగతి విద్యార్థులు 40.9 శాతం మంది తీసివేతలు చేయగలిగితే, ప్రైవేటులో 48.7 శాతం మంది ఉన్నారు.
- ఐదో తరగతి ప్రభుత్వ విద్యార్థులు భాగాహారాలను 35.1% మంది, ప్రైవేటులో 38.5% మంది చేస్తున్నారు. 8వ తరగతిలో ప్రభుత్వంలో 45.2%, ప్రైవేటులో 56.6శాతం మంది చేయగలుగుతున్నారు.

పరఖ్ సర్వే ప్రకారం...

- మూడో తరగతి విద్యార్థుల్లో 64శాతం మందికి భాషా సబ్జెక్టులపై, 61శాతం మందికి గణితంపై అవగాహన ఉంది. ఈ రెండింటిలో మాత్రమే జాతీయ స్థాయితో సమానంగా రాష్ట్ర విద్యార్థులున్నారు.
- ఆరో తరగతిలో భాషా సబ్జెక్టులపై జాతీయ స్థాయిలో 57శాతం మంది మెరుగ్గా ఉంటే, ఏపీలో ఇది 48శాతానికే పరిమితమైంది.
- గణితంలో జాతీయ స్థాయిలో 46శాతం మెరుగ్గా ఉంటే, ఏపీలో 41శాతం మందికి మాత్రమే అవగాహన ఉంది.
- 9వ తరగతి ఏపీ విద్యార్థులకు భాషలపై 50శాతం మందికి, గణితంపై 35శాతం మందికి, సైన్స్‌పై 36శాతం మందికి, సోషల్ 37శాతం మందికి మాత్రమే అవగాహన ఉంది. ఈ విభాగాల్లో జాతీయ సగటు వరుసగా 54శాతం, 37శాతం, 40శాతం, సోషల్‌పై 40శాతంగా ఉంది.

జిల్లాల వారీగా ఇలా...

పరఖ్ సర్వే ప్రకారం గణితం, పరిసరాలపై అవగాహన పెంచుకోవడం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో విద్యార్థులు బాగా వెనకబడిపోయారు. జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

- అల్లూరి జిల్లాలో ఫౌండేషనల్ ఇంగ్లిష్‌లో చిన్నపాటి స్టోరీలను 55శాతం మంది చదవగలరు. చిన్నవార్తలు, సూచికలను 60 శాతం మంది చదువుతున్నారు. 99 వరకు అంకెలను ఆరోహణ, అవరోహణ క్రమంలో అమర్చగలిగేవారు 53 శాతం మంది ఉన్నారు.
- అనకాపల్లి జిల్లాలో రేఖలు, కోణాలు, త్రికోణాలు ఉపయోగించి గణితంలో సమస్యలను పరిష్కరించడం 35శాతం మందికి మాత్రమే తెలుసు. కరెంటు గురించిన ప్రశ్నలకు 28శాతం మందికి, అయస్కాంత శక్తి గురించి 32 శాతం మందికే అవగాహన ఉంది.
- అనంతపురం జిల్లాలో చిన్నపాటి ఇంగ్లిష్ స్టోరీలను 47% మంది చదవగలరు. చిన్న వార్తలు, సూచికలను 49% మంది చదివి అర్థంచేసుకుంటున్నారు. గణితం, ఇంగ్లిష్, సైన్స్‌లో జిల్లా పరిస్థితి దారుణంగా ఉంది.

ఎందుకీ పరిస్థితి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాధారణ పరిస్థితుల్లో దాదాపు 4 లక్షల టన్నుల వరకు తోతాపురి రకం మామిడి దిగుబడి వస్తుంది. ఈ సారి బంపర్ క్రాప్(అధిక దిగుబడి) అంటే.. 5.5 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. డిమాండ్‌కు మించి దిగుబడి రావడం ధరలు తగ్గడానికి ఓ కారణం.

ఇంతకుముందు మాదిరి పల్ప్‌కు అంత డిమాండ్ లేదు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జ్యూస్ ఫ్యాక్టరీల్లో 2023, 2024 సంవత్సరాల నాటి 40 వేల టన్నుల పల్ప్ డిమాండ్ లేక ఉండిపోయింది. దీంతో ఈసారి తోతాపురి కొనుగోళ్లకు ఇష్టపడటం లేదు. ధరలు పతనం కావడానికి ఇది కూడా ఓ కారణం.



ఏపీలో ఆంక్షలు లేకుండా..

ఏపీలో రైతులు ఎన్ని టన్నులు తోతాపురి తెచ్చినా సబ్సిడీ వర్తిస్తుంది. ఉదాహరణకు ఓ రైతు వంద టన్నులు తెస్తే రూ.4 లక్షలు సబ్సిడీ వస్తుంది. అదే కర్ణాటకలో ఓ రైతు వంద టన్నులు పండించినా గరిష్ఠంగా 10 టన్నులకే (రెండు హెక్టార్లకు మాత్రమే) సబ్సిడీ అందుతుంది. అంటే.. గరిష్ఠంగా రూ.40 వేలు అన్నమాట. తమిళనాడులో అయితే ప్రభుత్వ సాయమే లేదు.

తోతాపురికి తోడ్పాటు

ఇతర రాష్ట్రాల కంటే ఏపీలోనే ఎక్కువ 'మద్దతు'



- రైతులు అడక్కముందే కిలోకు రూ.4 సబ్సిడీ
- ఎన్ని టన్నులకైనా రాష్ట్ర ప్రభుత్వమే సాయం
- కర్ణాటకలో ఆంక్షలతో మద్దతు రూ.4
- ఒక్కోరైతు నుంచి 10 టన్నుల వరకే కొనుగోలు
- సాయం గురించి పట్టించుకోని తమిళనాడు

(చిత్తూరు-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది తోతాపురి దిగుబడి పెద్దఎత్తున రావడం, ఉత్పత్తులకు డిమాండ్ తగ్గిపోవడంతో రైతులు ధరలు లేక ఇబ్బందికర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. మద్దతు ధరగా కిలో రూ.8 ప్రకటించినా ఆ మేరకు రైతుకు దక్కడం లేదు. మార్కెట్లో గరిష్ఠంగా రూ.6 వరకే దక్కుతోంది. ఈ పరిస్థితిని ముందే గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తోతాపురి మామిడికి కిలోకు రూ.4 సబ్సిడీ ప్రకటించారు. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతులకే రూ.200 కోట్ల వరకు సబ్సిడీగా అందించనున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోనే రైతులకు అధిక మద్దతు ధర లభిస్తోంది. మన రాష్ట్రంలో తోతాపురి రకం మామిడిని ఎక్కువగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాగు చేస్తున్నారు. మార్కెట్లో ఇతర రకాలతో పోలిస్తే తోతాపురి ధరలు తక్కువగా ఉంటాయి. ఎక్కువగా వీటిని జ్యూస్ ఫ్యాక్టరీలు కొనుగోలు చేస్తుంటాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈసారి తోతాపురి బంపర్ క్రాప్ (దాదాపు 5.05 లక్షల టన్నులు) వచ్చింది. ఆశించిన ధరలు లేకపోవడంతో ప్రభుత్వం ఆదుకుంటోంది. కొనుగోళ్ల పరిమితిపై ఆంక్షలు పెట్టకుండా కిలోకు రూ.4 చొప్పున సబ్సిడీ అందిస్తోంది. ఫ్యాక్టరీలు రూ.5-6 చొప్పున ఇస్తున్నాయి. రైతులు 50, 100, 200 టన్నుల కాయలు తెచ్చినా, ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. ఇలా టన్నుకు రూ.4 వేల చొప్పున వంద టన్నులు తెచ్చినా రూ.4 లక్షల సబ్సిడీ రైతుకు ఇస్తోంది.

తమిళనాడులో సాయమేదీ?

పొరుగునే ఉన్న తమిళనాడు ప్రభుత్వం మామిడి రైతుల్ని పట్టించుకోవడం లేదు. అక్కడా ఈసారి బంపర్ క్రాప్ వచ్చింది. అక్కడ ఫ్యాక్టరీలు ప్రస్తుతం కిలోకు ధర రూ.4-4.5 మధ్యలో అందిస్తున్నాయి. దీనికి అదనంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం లేదు. దీంతో రైతులు కూడా చేసేదేమీలేక ఆ ధరకే అమ్ముకుంటున్నారు.

కర్ణాటకలో ఆంక్షలు

కర్ణాటకలోనూ తోతాపురి రకాన్ని ఎక్కువగా సాగు చేస్తారు. పల్ప్ ఫ్యాక్టరీలు కిలోను రూ.4-4.5 మధ్య కొనుగోలు చేస్తున్నాయి. ఆ రాష్ట్ర ప్రభుత్వం రైతుల్ని ఆదుకోవడానికి మొదట ముందుకు రాలేదు. ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కుమారస్వామి జూన్ చివర్లో మామిడి రైతుల్ని ఆదుకోవాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. దీంతో కర్ణాటక రైతుల్ని ఎంఐఎస్ (మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్) ద్వారా ఆదుకుంటామని చౌహాన్ ప్రత్యుత్తరం పంపించారు. ఎంఐఎస్ స్కీమ్ ద్వారా కర్ణాటకలో కిలో తోతాపురి మామిడికి మద్దతు ధరను రూ.16.16గా కేంద్రం నిర్ణయించింది. కానీ ఎవరూ ఆ ధరకు కొనడం లేదు. ప్రభుత్వం కిలోకు రూ.4 సబ్సిడీ ఇస్తుంది. రూ.2 కేంద్రం ఇస్తే, రూ.2 కర్ణాటక ప్రభుత్వం రైతులకు అందించాలి. మొత్తంగా రైతులకు కిలోకు రూ.8-8.5 మాత్రమే లభిస్తోంది. ఇక కొనుగోలులో అనేక ఆంక్షలు పెట్టడంతో రైతులకు పూర్తిస్థాయిలో లబ్ధి కలగడం లేదు. సాధారణంగా ఓ హెక్టారుకు 12.5 నుంచి 13 టన్నుల తోతాపురి కాయల దిగుబడి వస్తాయి. కానీ కేంద్రం జీవోలో ఓ హెక్టారుకు 5 టన్నులనే ఎంఐఎస్ స్కీమ్ ద్వారా కొంటామని పేర్కొంది. అంతేగాక ఒక్కో రైతు నుంచి 2 హెక్టార్ల వరకే కొనుగోలు చేస్తారు. మొత్తమ్మీద ఆ రాష్ట్రంలో 25 లక్షల టన్నులే ప్రభుత్వం కొంటుంది.

తోతాపురి ధరలు ఇలా (కిలోకు రూ.ల్లో)..


రాష్ట్రం	ఫ్యాక్టరీల్లో ధర	ప్రభుత్వ సబ్సిడీ	మొత్తం
ఏపీ	5-6	4 (పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే)	9-10
కర్ణాటక	4-4.5	4 (కేంద్రం 2, రాష్ట్రం 2)	8-8.5
తమిళనాడు	4-4.5	లేదు	4-4.5

జగన్ చేసిందేమిటి?

మామిడి రైతులకు మద్దతుగా ఈ నెల 9వ తేదీన వైసీపీ అధ్యక్షుడు జగన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా బంగారుపాలెం పర్యటనకు వెళ్తున్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో రెండేళ్లు తోతాపురి ధరలు పడిపోయాయి. కానీ ఆయన పట్టించుకోలేదు. మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోలేదు. నాడు కలెక్టర్ మద్దతు ధర ప్రకటించినా అమలు కాలేదు. తన హయాంలో మామిడి రైతుల గురించి ఏమాత్రం ఆలోచించని జగన్ ఇప్పుడు మద్దతు ధర పేరిట రాజకీయం చేసేందుకు వస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

తోతాపురి సేకరణకు 130 కోట్లు ఇవ్వండి

- కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ



అమరావతి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మార్కెట్ జోక్యం పథకం ద్వారా తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు రూ.130 కోట్లు విడుదల చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాశారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్లలో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసి, మామిడి కొనుగోళ్లపై సీఎం రోజువారీ సమీక్ష చేస్తున్నారు. పార్లే ఆగ్రో, కోకోకోలా, పెప్సీ తదితర సంస్థలు రైతుల నుంచి తోతాపురి కొనుగోలు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రాసెసింగ్ యూనిట్లు, ట్రేడర్లు కిలోకు రూ.8 చెల్లించి కొనుగోలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం భరించే రూ.4తో రైతులకు రూ.12 ధర దక్కేలా చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి సీఎంవో అధికారులు మామిడి కొనుగోళ్లపై సమీక్ష చేశారు. ఇప్పటి వరకు 3.08 లక్షల టన్నుల పంట కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. చిత్తూరు జిల్లాలో 1.65 లక్షల టన్నులు, తిరుపతి జిల్లాలో 45 వేల టన్నులు, అన్నమయ్య జిల్లాలో 16,400 టన్నులు కొనుగోలు చేయగా, ర్యాంపులు, మండీల ద్వారా మరో 81 వేల టన్నులు ఇతర రాష్ట్రాలకు విక్రయించినట్లు అధికారులు వివరించారు.

పీ4లో ప్రవాసులు భాగస్వామ్యం కావాలి

- టాంపా 'నాట్స్' సంబరాల్లో రఘురామకృష్ణరాజు, నాదెండ్ల

(ఆంధ్రజ్యోతి కోసం టాంపా నుంచి కిలారు గోకుల్ కృష్ణ)

ఏపీలో 2047 నాటికి పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన పీ4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) పథకంలో ప్రవాస భారతీయులు భాగస్వాములు కావాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం టాంపా నగరంలో ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) నిర్వహిస్తున్న 8వ అమెరికా తెలుగు సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 15 లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపే ప్రణాళికతో ఏర్పాటైన పీ4 పథకానికి ప్రవాసులు చేయూతనందించాలని కోరారు. వారికి సీఎం తో పాటు కేబినెట్‌లో చర్చించి టీటీడీ దర్శనాల వంటి ప్రత్యేక సదుపాయాలు అందేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పీ4ను ప్రోత్సహించాలని కోరారు. 1980ల్లో టెన్నిస్ క్రీడాకారుడిగా తాను అమెరికాకు వచ్చినప్పుడు చూసిన టాంపా ఇప్పటి టాంపా వేరని అన్నారు. ప్రవాసులు ఏపీ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాల్ వద్ద ఏపీ స్పోర్ట్స్ అథారిటీ(శాప్) ఛైర్మన్ రవినాయుడు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్స్ పలువురికి పురస్కారాలు ప్రదానం చేసింది. డా.గురువారెడ్డి, మ్యాక్సివిజన్ ప్రసాదరెడ్డి, ఎటర్నల్ హెల్త్ ఐకా పూజ, డా.మాధవి శేఖరం, డా.దేవయ్య రుద్రమ్మలకు పురస్కారాలు అందజేసింది.



హైకోర్టు న్యాయవాదులు, పౌరహక్కుల బృందానికి తమ గోడు వెల్లబోసుకుంటున్న అలగాయపాలెం గ్రామస్థులు

రైతులు తిరగబడితే ప్రభుత్వాలే గల్లంతు

- కరేడు రైతులకు హైకోర్టు న్యాయవాదుల మద్దతు

ఉలవపాడు, జూలై 6(ఆంధ్రజ్యోతి): 'రైతులు తిరగబడితే ప్రభుత్వాలే గల్లంతవుతాయి. అమరావతి రైతుల సుదీర్ఘ పోరాటమే ఇందుకు నిదర్శనం. వారి పోరాటమే గత వైసీపీ ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేసింది. కరేడు రైతుల విషయంలో మేల్కొకపోతే కూటమి ప్రభుత్వానికీ అదే గతి పడుతుంది'.. అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇండోసోల్ కంపెనీ బాధిత గ్రామం కరేడులో ఆదివారం హైకోర్టు న్యాయవాదులు, పౌర హక్కుల సంఘం నాయకులు 21 మంది పర్యటించారు. అలగాయపాలెం, బట్టిసోమయ్య పాలెం, టెంకాయ చెట్లపాలెం, చిన్నపల్లెపాలెం తదితర గ్రామాల్లో ఈ బృందం పర్యటించింది. మత్స్యకారులు, వేరుశనగ రైతులు, నర్సరీలో పనిచేస్తున్న మహిళలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంది. అనంతరం కరేడు బస్టాండ్ ప్రాంగణంలో గ్రామసభలో స్థానికుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, పౌర హక్కుల సంఘం నాయకులు కరేడు రైతుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని ఎండగట్టారు.



నెల్లూరు జిల్లా కరేడులో.. చెరువు కింద ఏటా రెండు పంటలు పండే మాగాణి భూములు



నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలోని కరేడు గ్రామం

పచ్చని పొలాల్లో ఇండోసోల్ మంటలు

- ప్రాణాలైనా ఇస్తాం కానీ.. భూములిచ్చే ప్రసక్తే లేదు
- భూసేకరణ నోటిఫికేషన్‌పై రగులుతున్న కరేడు రైతులు
- గత నెల 29న హైవేను దిగ్బంధించి నిరసన
- సోలార్ పరిశ్రమను బంజరు భూముల్లో పెట్టుకోవచ్చు కదా అని ఆక్రోశం

(కందుకూరు-ఆంధ్రజ్యోతి)

ఇండోసోల్ సోలార్ పరిశ్రమ కోసం పచ్చని పంట పొలాలకు మంట పెడతారా? అని కరేడు గ్రామ రైతులు ముక్తకంఠంతో నిరసిస్తున్నారు. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం కరేడు గ్రామ పరిధిలో ఇండోసోల్ కంపెనీ కోసం 4,855 ఎకరాల భూసేకరణకు గత నెల 22న కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై గ్రామం అట్టుడికిపోతోంది. రైతులకు నచ్చజెప్పాలని అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు వారు ససేమిరా అంటున్నారు. భూసేకరణను నిరసిస్తూ పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఏకతాటిపై తమ నిరసన గళాన్ని వినిపిస్తున్నారు. ఈ క్రమంలోనే గత నెల 29న జాతీయ రహదారిని దిగ్బంధించి నిరసన తెలిపారు. అలాగే, గత శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు రాజశేఖర్ గ్రామంలో సభ ఏర్పాటుచేయగా .. '3పంటలు పండే మా భూములు పరిశ్రమల కోసం ఇచ్చే ప్రశ్నేలేద'ని అక్కడికి వచ్చిన వేలాదిమంది రైతులు తేల్చిచెప్పారు.

ఇదీ కరేడు ప్రత్యేకత!

17 వేలకుపైగా జనాభా కలిగి 16 శివారు గ్రామాలతో కందుకూరు నియోజకవర్గంలోనే అతిపెద్ద గ్రామ పంచాయతీ కరేడు. ఇక్కడ పండ్ల తోటలు, మాగాణి భూమి అధికం. గ్రామంలో 12,632 ఎకరాల భూములు ఉండగా, అందులో 2,600 ఎకరాల ప్రభుత్వ భూమి, 1,200 ఎకరాల అటవీ భూమి ఉంది. మిగిలినదంతా రైతుల పట్టా భూమి. 3 వేల ఎకరాలకుపైగా ఏటా రెండు పంటలు పండే మాగాణి భూమి ఉంది. తీర ప్రాంతంలో 1,200 ఎకరాలకు పైగా వేరుశనగ సాగుకు అనుకూలంగా, మూడు పంటలు పండే భూమి ఉంది. మరో 400 ఎకరాల్లో మామిడి, సపోట తోటలు ఉండగా 100 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో అరటి, కొబ్బరి తోటలు ఉన్నాయి.

పంట పొలాల్లో పరిశ్రమ ఎందుకు?

ఇండోసోల్ సోలార్ కంపెనీ సోలార్ ప్యానెల్ తయారీ ప్లాంట్ కోసం ఏర్పాటు చేస్తున్నందున, దానికి ఎండలు అధికంగా ఉండే ఎడారి ప్రాంతం, బంజరు భూములు అవసరమని గ్రామస్థులు పేర్కొన్నారు. అయితే పండ్ల తోటలు, మాగాణి భూములతో చల్లని వాతావరణం ఉండే కరేడును ఎంచుకోవడంలో మతలబు ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.14,152 కోట్లు సబ్సిడీ కొట్టేయడం, కారుచౌకగా తమ భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే లక్ష్యంగా ఈ తంతు నడుస్తుందని గ్రామస్థులు ఆగ్రహిస్తున్నారు. వందల మందికి ఉద్యోగాలు వస్తాయని చెబుతూ వేల మంది బతుకులు బజారున పడేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

భూములన్నీ తీసుకుంటే ఎలా బతకాలి?



నాకు కరేడులోని 1410, 1412 సర్వే నంబర్లలో పది ఎకరాల మాగాణి ఉంది. మాకు వ్యవసాయం, పశుపోషణ తప్ప మరో వృత్తి తెలియదు. మా గ్రామంలోని శివాలయానికి 600ఏళ్ల చరిత్ర ఉంది. 17వేలకు పైగా జనాభా ఉన్న మా గ్రామంలో ఉన్న భూములన్నీ తీసేసుకుంటే ఈ జనమంతా ఎలా బతకాలి?

- రంగని బ్రహ్మారెడ్డి, కరేడు గ్రామ రైతు

కాలనీలే ఖాళీ చేయిస్తారంట...



మాకు వ్యవసాయం, కూలి పని తప్ప మరో వృత్తి తెలియదు. పరిశ్రమ కోసం ఇప్పుడు రామకృష్ణాపురం ఎస్టీ కాలనీ, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ, పొట్టేనికుంట ఎస్సీ కాలనీలు ఖాళీ చేయిస్తారంటున్నారు. మేము ఇక్కడి నుంచి ఖాళీ చేసే ప్రశ్నేలేదు. ఐక్యంగా ప్రతిఘటిస్తాం.

- గంజి యలమంద, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ రైతు

భూములిచ్చే ప్రసక్తే లేదు



నాకు సర్వే నం.732-1లో 1.28 సెంట్లు మాగాణి భూమి లంకలో ఉంది. వ్యవసాయం మీదే ఆధారపడి నా కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లల్ని చదివించు కుంటున్నా. ప్రభుత్వమిచ్చే పరిహారం డబ్బులు ఎన్నాళ్లుంటాయి? ఆతర్వాత మేమంతా ఎలా బతకాలి? ప్రాణాలైనాఇస్తాంకానీ భూములు ఇచ్చేదే లేదు. -మిరియం వెంకటకృష్ణ, కరేడు గ్రామ రైతు

ప్రభుత్వం పునరాలోచించాలి

ఏటా మూడు పంటలు పండే మా భూములను సోలార్ పరిశ్రమకోసం తీసుకుంటే మేమేలా బతకాలి? ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోపోతే మా సమాధుల మీదే పరిశ్రమ కట్టాల్సి వస్తుంది!.

- బత్తుల వెంకట రమణారెడ్డి

డిజిటల్ హైవేలు!

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను ఉల్లంఘించి వాహనం నడిపిన వారికి జరిమానా పడడంతోపాటు వాహన ప్రయాణ వీడియో కూడా ఫోన్‌కు వచ్చేస్తుంది. ఇప్పటికే ఢిల్లీ-గురుగ్రామ్‌ను కలిపే ద్వారక ఎక్స్‌ప్రెస్‌వేపై ఏఐతో పనిచేసే సాంకేతిక విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇదే విధానాన్ని దేశంలోని ఇతర రహదారుల్లోనూ అమలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలో మొదటి దశలో భాగంగా హైదరాబాద్-నాగపూర్ మార్గం (ఎన్.హెచ్-44)లో స్మార్ట్ హైవే విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇది మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వరకు మొత్తం 591 కిలోమీటర్లు ఉంటుంది. ఈ బాధ్యతలు దక్కించుకున్న ఓ సంస్థ.. పనులు కూడా ప్రారంభించింది.

అత్యాధునిక సీసీ కెమెరాలు..

స్మార్ట్, డిజిటల్ హై వే ఏర్పాటులో భాగంగా.. రహదారిపై 360 డిగ్రీల కోణంలో పనిచేసే అత్యాధునిక సీసీ కెమెరాలను ప్రతి కిలోమీటర్‌కు (రెండు వైపులా) ఒకటి చొప్పున 251 కెమెరాలను అమర్చుతారు. మూల మలుపులు, వంకరలు ఉన్నచోట రెండు చొప్పున కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం రోడ్లపై ఏర్పాటుచేసే వాటి కంటే అత్యంత శక్తిమంతంగా ఈ కెమెరాలు ఉంటాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో వీటిని ఏర్పాటుచేస్తారు. ఇవి 24 గంటలూ రోడ్లపై నిఘా ఉంచుతాయి. వీటి పర్యవేక్షణకు ప్రత్యేక మానిటరింగ్ కేంద్రాలను హైవే పైనే ఒకటి, రెండు చోట్ల ఏర్పాటుచేయడంతోపాటు ప్రత్యేకంగా సిబ్బంది కూడా ఉంటారు. ఈ కెమెరాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వ పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేస్తారు. ఇవి ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను అంచనా వేస్తుంటాయి. రహదారిపై ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు లొకేషన్‌తోపాటు కిలోమీటర్ నంబర్‌తో కూడిన అన్ని వివరాలను వీడియోతో సహా పంపుతుంది. వెంటనే హైవేపై ఉండే అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని అవసరమైన సాయం అందిస్తారు. అంతేకాదు.. స్పీడ్ డిటెక్షన్, రాంగ్ రూట్, ప్రమాదాల వీడియోను చిత్రీకరించడం వంటి పలు రకాల సేవలను వీటి ద్వారా అందించనున్నారు. ఫలితంగా రోడ్లన్నీ అత్యంత భద్రతగా ఉండడంతోపాటు ప్రమాదాలు తగ్గేందుకూ అవకాశం ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అంటున్నారు. త్వరలోనే హైదరాబాద్-నాగపూర్ హైవేపై ఈ సాంకేతిక విధానం అందుబాటులోకి రానుంది.

త్వరలో మరో మూడు ఎన్‌హెచ్‌లపై..

త్వరలో ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిపై ఈ విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేసి రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల అధికారులను ఆదేశించారు. దీంతో రహదారిని ప్రారంభించేలోపు లేదా ఆ తరువాతనైనా డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు నిర్ణయించారు. కర్నూలు -రాయచూరు మార్గంలోనూ స్మార్ట్ రోడ్డు విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. హైదరాబాద్-విజయవాడ మార్గంలోనూ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ రహదారిపై అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు 17 బ్లాక్‌స్పాట్‌ల వద్ద పలు రకాల పనులు చేపట్టగా.. అవి పలు దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసలను, ఆరు వరుసల రోడ్డుగా మార్చేందుకు డీపీఆర్ సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యేలోపు.. ఈ రోడ్డుపైనా అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏటీఎంఎస్)ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna.** Founder: K.L.N.Prasad.